

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 52

మంగళవారం 14-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముంబై అతలాకుతలం

జీభత్సం సృష్టించిన గాలివాన. తొమ్మిది మంది దుర్మరణం. - 6లో



'గ్రాండ్‌మాస్టర్' శ్యామ్ నిఖిల్

భారత చెస్‌లో 85వ జీఎంగా అవతరించిన తమిళనాడు ప్లేయర్. - 14లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్ నాయకులు పిరికిపందలు



పిరికిపందలైన కాంగ్రెస్ నాయకులు పాక్ అణు బాంబులకు భయపడుతున్నారని ప్రధాని మోదీ ఘాటుగా విమర్శించారు. 'ఇండియా' కూటమి పాక్ అణుశక్తిని తలచుకొని చూసి బెంబేలెత్తిపోతోందని ఎద్దేవా చేశారు.

- వివరాలు 6లో

రాయ్‌బరేలీ కోసం మేము.. అదానీ, అంబానీ కోసం మోదీ



రాయ్‌బరేలీ నియోజకవర్గ ప్రజల కోసం తన కుటుంబం మొత్తం పనిచేస్తే, అదానీ, అంబానీల కోసం మోదీ చాలా చెమటోడ్చారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. సోమవారం రాయ్‌బరేలీలో తొలిసారి ప్రచారం చేపట్టారు.

- వివరాలు 6లో

హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతపై కేసు



హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఓటర్లతో ప్రవర్తించిన తీరు వివాదాస్పదమైంది. ముస్లిం మహిళల వివరాలు ఆరా తీస్తూ వారి హిజాబ్‌లను తొలగించడంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు.

- వివరాలు 3లో

కేజ్రీవాల్‌పై పిటిషన్ కొట్టివేత

- మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కారణంగా ఢిల్లీ సీఎం పదవి నుంచి కేజ్రీవాల్‌ను తొలగించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. అలాంటి చట్ట నిబంధన ఏదీ లేదని స్పష్టం చేసింది. ఒకవేళ తొలగించాలని భావిస్తే నిర్ణయం తీసుకొనే అధికారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉంటుందని తేల్చిచెప్పింది. - 6లో

ఇదండీ సంగతి



ఎందుకు సార్! ఫలితాలు తేడాగా వచ్చేట్లున్నాయా సార్!

64.93% పోలింగ్!

రాష్ట్రంలో ప్రశాంతంగా ముగిసిన లోక్‌సభ ఎన్నికలు



మహబూబాబాద్ జిల్లా రెడ్యాలలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు

- కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకూ ఓటింగ్
- వివిధ సంఘటనల్లో 38 కేసులు నమోదు
- 115 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల మొరాయింపు
- వాతావరణం చల్లబడటంతో రోజంతా కొనసాగిన పోలింగ్
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం.. స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రం
- సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్ రూమ్‌ల దృశ్యాలు ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశం
- జూన్ 4న ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు సాధారణ ఎన్నికలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)లో నిక్షిప్తమైంది. రాత్రి 12 గంటల వరకు వేసిన అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 64.93 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు ప్రకటించారు.

ఉదయం నుంచే వడివడిగా..: రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. 13 మావోయిస్టు ప్రభావిత అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సాయంత్రం 4 గంటల వరకు, మిగతా అన్నిచోట్లా సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. గడువు ముగిసే సమయానికల్లా పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉన్న వారందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. దీనితో సాయంత్రం 7 గంటల తర్వాత కూడా సుమారు 1,400 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగిందని సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారు. సాయంత్రం ఏడు గంటల తర్వాత ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా మిగతా 12వ పేజీలో ▶

నాలుగో దశలో 67.70% పోలింగ్

- 10 రాష్ట్రాలు,యూటీల్లోని 96 స్థానాల్లో పూర్తయిన ఎన్నికలు
- స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా పోలింగ్

- వివరాలు 6లో



కొడంగల్‌లో ఓటు వేసిన సీఎం రేవంత్

9 సీట్లు పక్కా.. ఒకటి ఎక్స్‌ట్రా!

- లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళిపై కాంగ్రెస్ లెక్కలు
- పదింట బీజేపీతో, ఆరింట బీఆర్‌ఎస్‌తో పోటీ జరిగిందంటున్న నేతలు
- అసెంబ్లీ ఎన్నికల ఓటు బ్యాంకు పదిలంగానే ఉందనే అంచనాలు
- గ్రామీణ ప్రజలు, మహిళలు అండగా నిలిచారనే ఆశాభావం

12లో



చింతమడకలో కేసీఆర్

12కు పైగా.. బీఆర్‌ఎస్ ధీమా

- ఆ పార్టీ ప్రాథమిక అంచనా
- తగ్గిన పోలింగ్ శాతం పార్టీకి అనుకూలిస్తుందనే లెక్కలు
- ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో లబ్ధి జరుగుతుందనే అంచనాలు
- పోలింగ్ సరళిపై అధినేత కేసీఆర్ ఆరా
- ఎర్రవెల్లిలో పార్టీ అధినేతతో కేటీఆర్, హరీశ్ సమావేశం

12లో



హైదరాబాద్ కాచిగూడలో కిషన్‌రెడ్డి

10 సీట్లపై కమలం ఆశలు

- మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తమకే ఓట్లు వేశారనే విశ్వాసంతో బీజేపీ ముఖ్యనేతలు
- ప్రధాని మోదీపట్ల వివిధ వర్గాల ఓటర్లలో సానుకూలత వ్యక్తమైందని అభిప్రాయం
- గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లోనూ సానుకూలంగా ఉందనే అంచనాలు

5లో

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు జెడ్పీ హైస్కూలు వద్ద ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో బారులుదీరిన మహిళలు



మళ్లీ ఫ్యాన్ సునామీ

పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే ఓటర్ల బారులు

ఉప్పెనలా కదలివచ్చిన వృద్ధులు, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు

పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అధిక శాతం ఓటింగ్

సాయంత్రం 5 గంటలకు 68.04 శాతం పోలింగ్ నమోదు

రాత్రి 10 గంటలకు 76.50 శాతం నమోదు అయినట్లు ఈసీ వర్గాల వెల్లడి

ఫలితాలను నిర్దేశించేది మహిళలు, గ్రామీణులేనన్న ఇండియాటుడే టీవీ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్

ప్రభుత్వ సేవలను బట్టే 80 శాతం మహిళలు ఓట్లు వేస్తారన్న యాక్సిస్ మై ఇండియా సీఎండీ ప్రదీప్ గుప్తా

సంక్షేమాభివృద్ధి పథకాలతో ఇంటింటా వచ్చిన విప్లవాత్మక మార్పును ప్రతిబింబించిన పోలింగ్ సరళి

ప్రభుత్వ సానుకూలత సునామీలా ఓటెత్తిందంటున్న రాజకీయ పరిశీలకులు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వంపై సానుకూలత (పాజిటివ్) పోటెత్తింది. ఓటు వేసేందుకు వెల్లువెత్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు భారీ ఎత్తున కదలివచ్చారు. సాయంత్రం 5 గంటలకు 68.04% పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటల సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లే కనిపించారు. వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. కొన్ని కేంద్రాల్లో రాత్రి పది గంటల వరకూ మిగతా 10వ పేజీలో ▶

పచ్చ ముఠాల విధ్వంస కాండ

- ఓటమి భయంతో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు
- రాళ్లదాడులు, కత్తులతో బీభత్సం, బాంబులతో భయోత్పాతం
- యథేచ్ఛగా విధ్వంసం సృష్టించిన టీడీపీ, జనసేన.. చంద్రబాబు పక్కా పన్నాగంతోనే ధ్వంస రచన
- ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసినా ఈసీ ఉదాసీనత.. శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువులో యువకుడుకి కత్తిపోట్లు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కత్తెరతో 'చింతమనేని' అనుచరుల హత్యాయత్నం.. వైఎస్సార్ జిల్లాలో రెచ్చిపోయిన పచ్చ మూకలు
- అన్నమయ్య జిల్లాలో బరితెగించి రౌడీయిజం.. వైఎస్సార్ జిల్లా మబ్బు చింతలపల్లెలో కారు అద్దాలు ధ్వంసం
- జంగాలపల్లి పోలింగ్ బూత్‌లో బరితెగించిన టీడీపీ కార్యకర్తలు
- చిత్తూరు జిల్లా పెరుమాళ్ల కండ్రిగలో ఇళ్లపై దాడులు, కార్లు ధ్వంసం
- కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మితిమీరిన టీడీపీ నేతల ఆగడాలు - 10లో

ఉప్పెనలా ప్రభుత్వ సానుకూలత

తమ సంక్షేమానికి కృషి చేసిన సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలిచారు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో పోలింగ్ సరళిని చూస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సానుకూలత ఉప్పెనలా కనిపించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పేదలందరి అభివృద్ధి, మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని తెలిపారు. అందుకే సీఎం జగన్‌కు అట్టడుగు వర్గాలు అండగా నిలిచి ఓటింగ్‌కు పెద్ద ఎత్తున వచ్చి అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. ఉదయం నుంచే మహిళలు, వృద్ధులు తరలివచ్చి స్వేచ్ఛగా ఓటు వేశారన్నారు. ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. '2019లోనూ ఉప్పెనలా పోలింగ్ జరిగింది. అప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత కనిపించింది. ఈసారి మిగతా 5వ పేజీలో ▶

3 రోజులు ముందుగానే 'నైరుతి'!

ఈనెల 22కు బదులు 19నే దక్షిణ అండమాన్ సముద్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే చాన్స్

కేరళకూ సకాలంలోనే ఆగమనం.. సానుకూల పరిణామం అంటున్న నిపుణులు

తెలంగాణలో నేడు, రేపు తేలికపాటి వానలు

రేపటి నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం

సాక్షి, విశాఖపట్నం/సాక్షి హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది కాస్త ముందుగానే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా దక్షిణ అండమాన్ సముద్రంలోకి ఏటా మే 22న నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. తర్వాత వారం, పది రోజుల్లో కేరళను తాకుతాయి. ఈ ఏడాది నైరుతి మూడు రోజులు ముందే.. మే 19న దక్షిణ అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ సోమవారం వెల్లడించింది.

వచ్చే నెల ఒకటి నాటికి కేరళకు!: వచ్చే నెల ఒకటో తేదీలోగా నైరుతి రుతుపవనాలు కేరళకు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది సానుకూల పరిణామమని అంటున్నారు. అయితే రుతుపవనాలు కేరళకు సకాలంలో చేరాలంటే అరేబియా సముద్రంలో అనుకూల వాతావరణం ఉండాలి. వాటి ఆగమనానికి ముందు అరేబియా సముద్రంలో అల్పపీడనం గానీ, వాయుగుండం గానీ ఏర్పడకూడదు. అలా ఏర్పడితే నైరుతి రాకను ఆలస్యం చేస్తాయి. ఇప్పుడున్న పరిస్థితుల మేరకు.. ఈ నెలాఖరులోగా అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు కొంత కనిపిస్తున్నాయని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. మరికొన్ని రోజులైతే స్పష్టత వస్తుందని అంటున్నారు. నిజానికి గత ఏడాది నైరుతి రుతుపవనాలు మే 19నే దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించాయి. కానీ ప్రతికూల పరిస్థితుల వల్ల ఆలస్యంగా జూన్ 8న కేరళను తాకాయి.

రాష్ట్రంలో రెండు రోజులు వానలు: తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశంఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. రాష్ట్రానికి దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి బలమైన గాలులు వీస్తాయని వెల్లడించింది.

వందొస్తే టాప్ కాలేజీల్లో సీఎస్‌సీ!

ఇంజనీరింగ్ సీట్లపై నిపుణుల అంచనా.. 10 రోజుల్లో సెట్ ఫలితాలు వెల్లడయ్యే చాన్స్


ఈసారి ఎక్కువ శాతం అర్హులయ్యే అవకాశం.. ఆప్షన్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలు మరో 20 రోజుల్లో వెలువడే అవకాశముంది. ఇప్పటికే కీ విడుదల చేశారు. దీన్ని బట్టి ఎన్ని మార్కులు వస్తాయనేది విద్యార్థులకు ఓ అంచనా ఉంది. ఈ మార్కుల ఆధారంగా ఏయే ర్యాంకులు వస్తాయి? ఆ ర్యాంకుకు అనుకున్న కాలేజీలో సీటు వస్తుందా? అనే ఉత్కంఠ విద్యార్థుల్లో కన్పిస్తోంది. అయితే ఇంజనీరింగ్ ప్రశ్నపత్రం కష్టంగా లేదని, ఎక్కువ మంది అర్హత సాధించే వీలుందని నిపుణులు అంటున్నారు. సాధారణ విద్యార్థి కూడా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ సబ్జెక్టుల నుంచి 40 ప్రశ్నలకు జవాబులు ఇచ్చే చాన్స్ ఉందంటున్నారు. 160 ప్రశ్నల్లో ఎక్కువ మంది 50 శాతానికి పైగానే కరెక్టు సమాధానాలు రాయవచ్చని అంచనా వేస్తున్నారు. 100 మార్కులొస్తే టాప్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ సీటు వచ్చే అవకాశముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



సీఎస్‌సీ సీటు ఈజీనే

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద 80 వేల వరకూ సీట్లు అందుబాటులో ఉండే వీలుంది. ఇందులో 58% కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇతర కంప్యూటర్ కోర్సు సీట్లు ఉంటాయి. గత ఏడాది సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచిల్లోని సీట్లు కాలేజీలు రద్దు చేసుకోవడం, కొత్తగా పెరిగిన సీట్ల వల్ల కంప్యూటర్ కోర్సుల సీట్లు అదనంగా 14 వేలు పెరిగాయి. కాబట్టి ఈసారి కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పొందడం తేలికేనని నిపుణులు అంటున్నారు. గత ఏడాది ఆఖరి దశ కౌన్సెలింగ్‌ను ప్రామాణికంగా తీసుకుంటే టాప్ కాలేజీల్లో సీఎస్‌సీ సీటు 4 వేల ర్యాంకు వరకూ వచ్చింది. ఈ ఏడాది కూడా ఇంచుమించు ఇదే ర్యాంకు వరకూ ఉండే వీలుందని తెలుస్తోంది. అయితే కాలేజీతో పనిలేదు కంప్యూటర్ సైన్స్ బ్రాంచిలో సీటే ప్రధానం అనుకుంటే 35 వేల ర్యాంకు వరకూ ఆ సీటు వచ్చే వీలుంది. 50 వేల ర్యాంకు దాటితే మాత్రం సీఎస్‌సీ సీటును ఆశించలేమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సెట్‌లో కనీసం 40 నుంచి 50 మార్కులు తెచ్చుకుంటే ఆ విద్యార్థికి 35 నుంచి 50 వేల ర్యాంకు వచ్చే వీలుందని మిగతా 5వ పేజీలో ▶


ALPHORES-CBSE
Education decides the future of a Nation.
It should be practised very effectively...
ALPHORES DOES IT
Always Ahead of others despite the
STATE/CBSE/REGULAR/IIT & NEET COACHING
GRADE X
98.6%
V.SHREYASH REDDY
493
500
GRADE X
98.6%
G. CHAITRA
493
500
GRADE XII
96.6%
N. HEMANTH
483
500
Dr. V.NARENDER REDDY
CHAIRMAN
97.4% A. AKSHAYA 487/500
97.4% M.LAKSHMI SANJUKTHA 487/500
97.2% G.SAHASRA 486/500
97.2% D.RITHWIK 486/500
97.2% G.LASYA SRI 486/500
97% J.SARUYUH 485/500
97% T.SWARAGNYA 485/500
96.8% K.AISHWARYA 484/500
96.8% B. SAI RISHIK REDDY 484/500
96.8% K.DEV ASHISH 484/500
96.4% P.SAHASRA 482/500
96.4% S.LAXMIMANOGNYA 482/500
96.4% L.PRANAYNI 482/500
96.4% G.SRIVALLIKA 482/500
96.2% MIRZA MOHD SAFIULLA BAIG 481/500
96.2% SAI SUHAAS 481/500
GRADE XII
95.2% SHUBODH CHOUDHARY 476/500
95.2% G.SAI MANJUNATH REDDY 476/500
95% G.LAHARI 475/500
94.4% V.SRIMUKHI 472/500
93.8% G.RATHAN RAO 469/500
93.4% NIKESH CHOPRA 467/500
93% K VISHAL REDDY 465/500
92% AMIT CHOPRA 460/500
92% K.SRINIDHI 460/500
91.4% S.SAKETH PATEL 457/500
91.2% SARDAR JASPREETH SINGH BAL 456/500
96% CH.SAM ROHITH KUMAR 480/500
96% J.SREEJA 480/500
95.8% B.SRINIDHI 479/500
95.8% A.SREEJA 479/500
95.8% K.SAI SHAINY 479/500
95.8% M.RUSHIL VARENYA 479/500
95.8% A.ASHRITHA REDDY 479/500
95.8% V.VENNELA REDDY 479/500
95.6% G.SHEFALI 478/500
95.6% G. HARDIK 478/500
95.6% P.SHRUTWIKA 478/500
95.6% V.SUHANI 478/500
95.4% A.VEERA HEMANTH 477/500
95.2% D.SRIHITHA 476/500
95.2% B.SAI DEEKSHITH 476/500
95.2% B.ROHITH 476/500
95.2% MD ABDUL MUNEEB 476/500
95% SHAIK JUNAID 475/500
95% S. ANUP SAI 475/500
94.8% N. SARANI CHANDRA 474/500
94.6% K. SRINIDHI 473/500
94.6% T.DEVANSHI 473/500
94.4% K.VERONICA HRUTHI 472/500
94.4% K.SATHWIK PATEL 472/500
94.4% R.AKHILA 472/500
94.2% TARANPREET KAUR 471/500
94% L.ADITYA 470/500
94% B.SAHASRA RATHOD 470/500
93.8% MA.ASHRAFF ARMAN 469/500
93.8% D.ARADDHYA 469/500
93.8% T.RISHINDRA 469/500
93.8% G.VISHWAK SEN 469/500
93.6% T.RITHESH REDDY 468/500
93.6% CH.SOUMYA SRI 468/500
93.6% N.SHARANYA 468/500
93.6% A. SHARVANI 468/500
93.4% B.SHARMILA 467/500
93.4% R.DESHMUKH 467/500
93.2% K.SHIVAPRANAV 466/500
93.2% P.MOURYA 466/500
93.2% J.ARCHIT 466/500
93.2% G.PAVAN TEJ 466/500
93.2% K.SAHASRA 466/500
93% N.RATHNA PRAKASH 465/500
93% P.ADVAITH 465/500
92.8% CH.VIDITHA 464/500
92.8% ABDUL MUNAM 464/500
92.8% V.SRIVALLI 464/500
92.6% B.LIKITH SAI 463/500
92.6% I.SHISHIRA REDDY 463/500
92.4% S.ISHITHA 462/500
92.4% J.SAHASRA REDDY 462/500
92.2% G.HANSIKA 461/500
92.2% P.ABHINAV REDDY 461/500
92.2% SHIFA RAUF 461/500
92% A.SAI SHASHREEK 460/500
91.6% K.SAI JESHWANTH REDDY 458/500
91.6% REEYA WASALA 458/500
91.4% T.SHIVAMSH 457/500
91.4% V.SAI HARSHITH 457/500
91.4% G.SIRI CHANDANA 457/500
91.2% G.SAI MANISH 456/500
91% K.MANVITHA REDDY 455/500
90.6% Y.VYSHNAVI 453/500
90.4% D.SRIVATHSAV 452/500
90.2% V.SAI SATVIK REDDY 451/500
90.2% A.MANOGNYA 451/500
90.2% D.NANDINI 451/500
90% V.NEHITH REDDY 450/500
90% D.ANKITH REDDY 450/500
90% R.AKSHITHA 450/500
Glorious Stats... 100% PASS
Grade X : 165 Alphoresians out of 219 have secured 80% +
Grade XII : 32 Alphoresians out of 86 have attained more than 80%
ADMISSIONS ARE OPEN
Hearty Congrats,! ALPHORESIANS for your INSPIRATIONAL SUCCESS II Parents & Staff, thanks a lot for your continuous SUPPORT & ENCOURAGEMENT
OUR SCHOOL BRANCHES : KARIMNAGAR : 91335 37444 Kothapally, Vavilalapally, Kisannagar, Bhagathnagar, Mankammathota, Vedira II GOPALRAOPET 9133312833 SULTANABAD 9246934448 II HUSNABAD : 9133929444 II JAGITIAL : 9246934445 Krishnanagar, Vidyanagar, Shivaveedhi II MALLIAL 9154901238 II MANCHERIAL 9133936444 NIRMAL 9246934451 II BHAINSA 9133312829 II ARMOOR : 9133938444 Brahmanapalli 'X' Road & Vidyanagar II WARDHANNAPET 9133189444 II WANI-MH : 8766966421
OUR COLLEGE BRANCHES : HYDERABAD SUCHITRA ALWAL : 91608 61444, GHATKESAR 9160128444, KARMANGHAT 9246834441, NEW NALLAKUNTA 9160867444, HASTINAPURAM 91339 73444 II KARIMNAGAR 91335 88857 II HANAMKONDA 91604 27444 II JAGTIAL 92470 66644 II MANCHERIAL 9160264443 II NIRMAL 96524 44414
OUR NEW INITIATIVES : SMART SCHOOL - MANCHERIAL 91604 21444 II GENIUS SCHOOL - HUZURABAD 9160412 444 II KARIMNAGAR : GIRLS SCHOOL 91549 01240, IIT&NEET ACADEMY (ELITE) - SEETHARAMPUR 92467 34447, EXCEL CAMPUS - KOTHAPALLI 91602 54447 II NIZAMABAD 9652444414 : MUBARAKNAGAR, GG ROAD-DUBBA & GAYATHRINAGAR II ARMOOR : 9652 44414 II MANCHERIAL : IIT&NEET AC CAMPUS : 81868 24444 II HANAMKONDA : BHEEMARAM 9160427444 II WARANGAL : POCHAMMA MAIDAN 9160426444







సోమవారం వివిధ పోలింగ్ కేంద్రాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు (ఎడమ నుంచి వరుసగా..) జస్టిస్ జి.విజయ్‌సేన్ రెడ్డి, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ కాజా శరత్, జస్టిస్ టి.మాధవీ దేవి, జస్టిస్ ఈవీ వేణుగోపాల్




ఓటు వేసిన ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా

డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తాం

- గ్రామాలు, పట్టణాలు తేడాలేకుండా యువత, మహిళలు ఆదరించారు
- సీఎం రేవంత్‌రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు
- ఓటర్ల జాబితాల్లో సంస్కరణలు తేవాలి
- మీడియాతో జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ అధినాయకత్వం ఊహిస్తున్నట్లే తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి సానుకూల వాతావరణం కనిపించిందని, ఎన్నికలు ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రంలో బీజేపీ కొత్త రాజకీయ శక్తిగా అవతరిస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో బీజేపీకి ఓటు వేశారని, మహిళలు, యువత ఆదరించారని, పట్టణప్రాంతంలోనూ తమ పార్టీకే ఓట్లు పడ్డాయని చెప్పారు. ఓటింగ్ శాతంతో సంబంధం లేకుండా సికింద్రాబా ద్‌లో బీజేపీ గెలుపులో ఎలాంటి అనుమానం లేదన్నారు. పట్టణప్రాంతాల్లో పోలింగ్ కాస్త తగ్గినా.. పోలైన ఓట్లు బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. సోమవారం పోలింగ్ సమయం ముగిశాక పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లా డారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి రెచ్చ గొట్టినా ప్రజలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించారని, లేకపోతే అగ్గిరగిలేదన్నారు. సికింద్రాబాద్, ఆదిలాబాద్ తదితరచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి గోబెల్స్ ప్రచారం చేసినా బీజేపీని ప్రజ లు ఆదరించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర పార్టీలకు వేసిన వారంతా.. ఈసారి బీజేపీకి మద్దతుగా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, ఓటేసిన ప్రజలు, అధికారులు, అన్ని పార్టీల కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

జూన్ 4 తర్వాత కాంగ్రెస్ హామీలపై కార్యాచరణ

ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్ గ్యారంటీలు, హామీల అమలుకు బీజేపీ కార్యాచరణ సిద్ధం చేసుకుని పోరాడుతుందని కిషన్‌రెడ్డి చెప్పారు. 'ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా జరుపుకోవాలని ప్రధాని మోదీ చెప్పారని నేను చెబితే దానిపైనా ఫిర్యాదుచేశారు. మోదీ పేరు ఎత్తకుండా నిషేధం ఉందా? సీఎం రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. ప్రతిదానికీ మోదీని చాలెంజ్ చేశారు. మోదీపై విమర్శలు గుప్పించడం ద్వారా పెద్దనాయకుడు కాలేరని ఆయన గ్రహించాలి. ప్రధాని అయ్యాక పెళ్లి చేసుకుందామని రాహుల్ అనుకున్నట్టున్నారు. ఆయన ప్రధాని అయ్యే పరిస్థితి లేదు. ఎవరు ఏమిటనేది జూన్ 4న ఫలితాలతో తేలిపోతుంది' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాల్లో సంస్కరణలు తేవాలి

'ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాలి. ఓటరు లిస్టును ప్రభుత్వం వెరిఫికేషన్ చేయాలి. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ లిస్టులను తనిఖీ చేసి, చనిపోయినవారి ఓట్లను తొలగించాలి. జూబ్లీహిల్స్‌లో ఒక వర్గం వారివి వేల ఓట్లు తొలగించారు. వేల ఓట్లను డిలీట్ అని పేర్కొన్న జాబితాను ఆదివారం రాత్రే మాకు ఇచ్చారు. కుట్రపూరితంగా ఈ తొలగింపు జరిగింది. కొన్నిచోట్ల ఓటరు స్లిప్పులు ఇచ్చినా ఓట్లు లేవని తిప్పిపంపించారు. మా అబ్బాయి ఓటు ఎక్కడో, నా ఓటు ఎక్కడో ఉంటుంది. దీనిపై కేంద్రమంత్రిగా లేఖ రాసినా చర్యలు తీసుకోలేదు. ఓటర్ల వివరాలతో ఆధార్ కార్డును అనుసంధానం చేస్తే బాగుండేది. రానున్న రోజుల్లో దీనిపై ఆలోచించి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు.

విమోచన అధికారికం

'ప్రతిఏటా సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. పసుపుబోర్డు, టెక్స్‌టైల్ బోర్డు వంటి వాటిని మోదీ తెలంగాణకు ఇచ్చారు. మోదీ మళ్లీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక త్వరలోనే ఆయన చేతుల మీదుగా వీటిని ప్రారంభిస్తాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

కిషన్‌రెడ్డి, ఈటల, కేటీఆర్‌పై కాంగ్రెస్ ఫిర్యాదు

- ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఓట్లు అభ్యర్థించారని ఈసీకి లేఖ
- కేటీఆర్ ఓటు చెల్లకుండా చేయాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ముగ్గురూ ఓటేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేశారని, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఓట్లు అభ్యర్థించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. కిషన్‌రెడ్డి, ఈటలపై చర్యలు తీసుకోవాలని, కేటీఆర్ ఓటు చెల్లకుండా చేయాలని ఆ లేఖలో కోరారు. 'ప్రధాని నరేంద్ర మోదీ పేరును చెప్పడం ద్వారా ఓటర్లను ప్రభావితం చేసేందుకు కిషన్‌రెడ్డి ప్రయత్నించారు. దేశమంతా ఫిర్ఏక్ బార్ మోదీ సర్కార్ అనే నినాదం వినిపిస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. తాను తెలంగాణ తెచ్చిన పార్టీకి, తెచ్చిన నాయకుడికి ఓటేశానని, అందరూ అలాగే ఓటేయాలని కేటీఆర్ కోరారు. ఈ ముగ్గురి వ్యాఖ్యలు ఎన్నికల కోడ్‌కు విరుద్ధం. వెంటనే చర్యలు తీసుకోవాలి' అని నిరంజన్ పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోండి

- సీఈవోకు బీజేపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేసింది. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కొడంగల్‌లో ఓటు వేసిన సందర్భంగా సోమవారం మీడియాతో రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియో ఉదయం 11.40 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్యలో వివిధ టీవీచానళ్లలో ప్రసారమైందని బీజేపీ పేర్కొంది. పోలింగ్ సందర్భంగా సైలెంట్ పీరియడ్‌లో ఓటింగ్‌ను ప్రభావితం చేసేలా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మాట్లాడడాన్ని నిషేధించినా సీఎం పలు రాజకీయ వ్యాఖ్యలు చేశారని తెలిపింది. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, బీజేపీకి మేజిక్ ఫిగర్ అనేది కలే అని, తెలంగాణలో మోదీ, ఈడీ జట్టు పనిచేయదని, బీజేపీ గ్రాఫ్ గణనీయంగా తగ్గిపోయిందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు సీఈవోకు బీజేపీ నేతలు బంగారుశ్రుతి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, ఆంథోనిరెడ్డి వినతిపత్రం సమర్పించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీనేత, మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం. రఘునందన్‌రావు కూడా ఈసీకి ఫిర్యాదు చేశారు. రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతో నిబంధనలు ఉల్లంఘించి మరీ పోలింగ్ రోజు కూడా రేవంత్ ప్రచారం చేశారని పేర్కొన్నారు.

ఈ ఎన్నికలు మా పనితీరుకు రెఫరెండం

- తెలంగాణలో 14 లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్ గెలుపు: సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్: రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలు ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు రెఫరెండంగా భావిస్తున్నామని టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఓటు వేసేందుకు సోమవారం కొడంగల్ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని.. రాహు ల్ గాంధీ ప్రధాని అవుతారని చెప్పారు. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ గెలవాలని చూస్తోందని ఆరోపించారు.

మోదీ తప్పుకుంటే ప్రధాని ఎవరు?

"బీజేపీ పాలసీ ప్రకారం 75 ఏళ్లు దాటిన వారు రాజకీయాల నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. ప్రధాని నరేంద్ర మోదీకి 75 ఏళ్ల వయసు వచ్చేస్తోంది. ఆయన రాజకీయాల నుంచి తప్పుకొంటే బీజేపీ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించాలి" అని రేవంత్ డిమాండ్ చేశారు. పదమూడేళ్లు సీఎంగా, పదేళ్లు ప్రధాన మంత్రిగా పనిచేసినా కూడా మోదీకి భారత రాజ్యాంగంపై అవగాహన లేదని విమర్శించారు. బీజేపీ నేతలు రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమ ని మండిపడ్డారు. కశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు పాదయాత్ర చేసి, ప్రజల సమస్యలు తెలుసుకున్న రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని పేర్కొన్నారు.

ప్రతీ క్షణం రాష్ట్ర ప్రయోజనాల కోసమే..

ఆగస్టు 15వ తేదీలోపు రైతుల రుణమాఫీ చేస్తామని రేవంత్ చెప్పారు. తాము ప్రతీ క్షణం రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి అంబానీ, అదానీలు డబ్బులు పంపిస్తున్నారనే బీజేపీ నేతల ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు ఎంపీ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లు కూడా కరువయ్యారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యం క్షీణించిందని, ఆయన మతిభ్రమించినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, సిద్దిపేట: ఈ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అవుతుందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. సోమవారం హెలికాప్టర్‌లో సిద్దిపేట జిల్లా చింతమడక చేరుకున్న కేసీఆర్, ఆయన సతీమణి శోభ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందరినీ పలకరిస్తూ, నమస్కారం పెడుతూ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, బీజేపీ, కాంగ్రెస్ కూటమిలకు సరైన మెజార్టీ రాదని చెప్పారు. ఇండియా కూటమిలో చేరతారా? అని అడగ్గా.. ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదని వ్యాఖ్యానించారు. బీజేపీ సొంత నిబంధనల ప్రకారం 75 సంవత్సరాల వయసు తర్వాత ఎవరూ ఏ పదవినీ చేపట్టకూడదని, అందువల్ల మోదీ కూడా పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆయన వెంట ఉన్నారు.

మీ కొట్లాట... గొప్ప ఫలితాలనిస్తుంది: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత బలంగా నిలబడి కొట్లాడటం ఆషామాషీ వ్యవహారం కాదని, లోక్‌సభ ఎన్నికల్లో నిబద్ధతతో పార్టీ అధినేత కేసీఆర్ వెంట నడిచి ప్రజామోదం కోసం బీఆర్ఎస్ కేడర్ కొట్లాడిన తీరు అద్భుతమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణుల కొట్లాట ఈ ఎన్నికల్లో గొప్ప ఫలితాలనిస్తుందని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం సోమవారం ఈ మేరకు కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ ఎన్నికల్లో అద్భుత పోరాట పటిమ ప్రదర్శించిన బీఆర్ఎస్ నేతలు, శ్రేణులకు హృదయపూర్వక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

మార్పు కోరుతున్నారు: హరీశ్

సిద్దిపేట జోన్: 'ప్రజలు మార్పు కోరుతున్నారు. పార్లమెంట్‌లో మా కోసం మాట్లాడే, ప్రశ్నించే గొంతుక ఉండాలని ఆలోచిస్తున్నారు' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం పోలింగ్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబిటస్ స్కూల్ పోలింగ్ కేంద్రం 114లో సతీమణి శ్రీనిత, కుమారుడు హర్షిస్‌తో కలిసి ఓటేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ముమ్మరంగా పోలింగ్‌లో పాల్గొన్నారని, ఇది శుభపరిణామమని చెప్పారు.

రేవంత్‌ది మూర్ఖపు వాదన: ఈటల

సాక్షి, హైదరాబాద్, మేడ్చల్: సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడుతున్నారని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆరోపించారు. 2014లో మోదీ పీఎం అయితే దేశం విచ్ఛిన్నమవుతుందంటూ కాంగ్రెస్ చేసిన వాదన తప్పని తేలినా.. మళ్లీ అరిగిపోయిన రికార్డును 2024లో కూడా వినిపించడం రేవంత్ అజ్ఞానానికే నిదర్శనమన్నారు. సోమవారం రాత్రి ఈటల మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి అజ్ఞానపు మాటలు ఒక సీఎం హోదాలో ఉండి మాట్లాడటం రేవంత్‌కు తగదన్నారు. ఇందుకు సీఎం తప్పకుండా రాబోయే కాలంలో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మరోవైపు ఈటల ఓ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా 12 ఎంపీ సీట్లను సాధిస్తుందని పేర్కొన్నారు. సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్త పోలింగ్ సరళిని పరిశీలిస్తే బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పినట్టు పక్కాగా తెలంగాణ నుంచి 12 సీట్లు బీజేపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సీఎం నిబంధనలు అతిక్రమించారు: బండి



హుస్నాబాద్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా, కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేసిన సీఎంకు నిబంధనల నుంచి ఎన్నికల కమిషన్ మినహాయింపు ఇచ్చిందా?, లేదా సీఎం ఏదైనా మాట్లాడవచ్చా? అని ప్రశ్నించారు. సీఎం వ్యాఖ్యల బట్టీ.. తెలంగాణలో బీజేపీ మెజార్టీ సీట్లు సాధిస్తుందని అర్థమైందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బులు, మద్యం పంపిణీ చేస్తున్నా ఎన్నికల కమిషన్ చూసీచూ డనట్లు వ్యవహరించిందని సంజయ్ ఆరోపించారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతపై కేసు

- హిజాబ్ తీయించి ఓటరు వివరాల తనిఖీ
- హైదరాబాద్ ఆస్మాన్‌ఘడ్ పోలింగ్ కేంద్రంలో ఘటన

సైదాబాద్: ఎన్నికల సరళిని పరిశీలించేందుకు ఓ పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఓటర్లతో ప్రవర్తించిన తీరు వివాదాస్పదమైంది. వరుసలో కూర్చొని ఉన్న ముస్లిం మహిళల వివరాలు ఆరా తీస్తూ వారి హిజాబ్‌లను తొలగించారు. ఈ ఘటనపై ఎన్నికల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మలక్‌పేట పోలీసులు ఆమెపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే...సోమవారం ఉదయం సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని పోలింగ్ బూత్‌లను మాధవీలత పరిశీలించారు. ఇందులో భాగంగా ఆమె ఆస్మాన్‌ఘడ్‌లోని హోలీ మదర్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్దకు వెళ్లారు. ఆ బూత్‌లో కొందరు ముస్లిం మహిళలు క్యూలో కూర్చొని ఉన్నారు. వారి వద్దకు వెళ్లిన మాధవీలత వారి నుంచి ఓటరు, ఇతర గుర్తింపుకార్డులు తీసుకొని పరిశీలించారు. అవి సరిచూడటం కోసం ఆ మహిళల హిజాబ్‌లు తొలగించేలా చేసి పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బంది, పోలీస్ కానిస్టేబుళ్లను ఓటర్ల వివరాలు సక్రమంగా పరిశీలించి అనుమతించాలని, లేకుంటే మీ ఉద్యోగాలు ఊడుతాయని ఆమె మందలించారు. ఓటర్ల పట్ల మాధవీలత ప్రవర్తించిన తీరుపై ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా అయ్యింది. దీనిని సీరియస్‌గా తీసుకున్న అధికారులు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మాధవీలతపై కేసు నమోదైంది. మరోపక్క సోమవారం మధ్యాహ్నం పాతబస్తీకి వెళ్లిన మాధవీలత వాహనాన్ని ఎంఐఎం కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో బీబీబజార్‌లోని విక్టోరియా హోటల్ వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఎంఐఎం కార్యకర్తలు, నాయకులను చెదరగొట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది.



పోలింగ్ కేంద్రంలో ముస్లిం మహిళల వివరాలు తనిఖీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి మాధవీలత

మంగళ్‌హాట్ పీఎస్‌లో మరోకేసు

అబిడ్స్: మంగళ్‌హాట్ పీఎస్‌లో మాధవీలతపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్‌కేపేట్ పోలింగ్‌బూత్ వద్ద బీజేపీ కార్యకర్తలు రాకేష్‌గౌడ్, బంటి ప్రచారం చేస్తున్నారని మంగళ్‌హాట్ పోలీసులు ఆ ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న బీజేపీ అభ్యర్థి మాధవీలత పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆ ఇద్దరు బీజేపీ కార్యకర్తలను బలవంతంగా తీసుకువెళ్లారు. ఈ ఘటనపై మంగళ్‌హాట్ పోలీసులు పలు సెక్షన్ల కింద ఆమెతోపాటు అనుచరులపై కూడా కేసు నమోదు చేసినట్టు గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి తెలిపారు.

పంట నష్టంపై నివేదిక ఇవ్వండి: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే వెంటనే అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. మార్కె ట్లకు వచ్చిన ధాన్యాన్ని తడవకుండా కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాల్సిందిగా మార్కెటింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు.



> మీ సొంత కారణం, మీ సొంత ఇంగిత జ్ఞానంతో మీరు ఏకీభవిస్తే తప్ప ఎక్కడ చదివినా, లేదా ఎవరు చెప్పినా, చివరికి నేను బోధించినా దేనినీ నమ్మవద్దు.
> – గౌతమ బుద్ధుడు

సాక్షి

మంగళవారం, 14 మే 2024


పోటెత్తిన వోటర్లు!

సార్వత్రిక ఎన్నికల తొలి మూడు దశల తీరు వేరు... సోమవారంనాటి నాలుగో దశ పోలింగ్ తీరు వేరు. దేశవ్యాప్తంగా మొత్తం 96 లోక్‌సభ స్థానాల్లో జనం పెద్దయెత్తున వోటింగ్‌లో పాల్గొన్నారు. ఈ నాలుగో దశలో లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అందుకోసమే కాక ఈ రాష్ట్రంవైపు దేశమంతా ఆసక్తిగా చూడటానికి ప్రత్యేక కారణం ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన అయిదేళ్ల పాలన తర్వాత ప్రజల ఆశీస్సులు కోరుతూ నిర్వహించిన 'సిద్ధం' సభలకూ, బస్సు యాత్రకూ పోటెత్తిన జనవాహినిని చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోయింది. 'మీ ఇంట్లో మంచి జరిగితేనే నాకు వోటేయండి' అంటూ ప్రజానీకానికి పిలుపునీయటం, అందుకు వచ్చిన సానుకూల స్పందన అసాధారణమైనవి. విపక్షం పూనకం వచ్చినట్టు వ్యక్తిగత దూషణలకు దిగినా, కులాల పేరిట ప్రాంతాల పేరిట చిచ్చురేపాలని చూసినా జగన్, ఆయన పార్టీ హుందాగా వ్యవహరించారు. ఈ ఎన్నికలు 'పేదలకూ, పెత్తందార్లకూ జరిగే యుద్ధం...ఇందులో మీరు ఎటువైపో తేల్చుకోండ'ని ఇచ్చిన ఆయన పిలుపును పల్లెసీమల నుంచి నగరాలు, పట్టణాల వరకూ అన్నిచోట్లా అందరూ అందుకున్నారు. కొత్తగా వోటు హక్కు వచ్చిన యువత మొదలుకొని వృద్ధుల వరకూ...వికలాంగులు మొదలుకొని అనారోగ్యంతోవున్న పెద్దల వరకూ... వేసవి తీవ్రతను కూడా లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలిరావటంలోని ఆంతర్యం అదే. కనుకనే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. వోటేయటానికి బారులు తీరిన మహిళలు, వృద్ధుల్ని చూసి టీడీపీ కూటమి వణికింది. దానికి తోడు గతంలో ఎవరూ సాహసించని, యోచించని ఒక వినూత్న ప్రయోగం చేశారు జగన్. అన్ని సామాజిక వర్గాలకూ పాలనలో సమ భాగస్వామ్యం కల్పించాలన్న పట్టుదలతో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో దాదాపు సగభాగం అట్టడుగు వర్గాలకు కేటాయించారు. అందువల్లే జనం వైఎస్సార్ కాంగ్రెస్‌ను గుండెల నిండా హత్తుకున్నారు. సాధారణంగా అయిదేళ్ల పాలన ఏ ప్రభుత్వం పైన అయినా ఎంతో కొంత అసంతృప్తి తీసుకొస్తుంది. అత్యంత జనాకర్షణగల సినీ దిగ్గజం ఎన్టీరామారావు కొత్తగా పార్టీ స్థాపించినప్పుడు రోడ్లపైకి భారీయెత్తున వచ్చిన జనమే... ఆయన పాలన చూశాక మొహం చాటేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. దాన్నుంచి కోలుకుని ప్రజాభిమానాన్ని చూరగొనడానికి ఆయనకు మరో అయిదేళ్లు పట్టింది.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల 4న వెల్లడయ్యాక దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. జనరంజక పాలన అంటే ఏమిటో... ఏం చేస్తే ప్రజల ఆదరాభిమానాలు సాధించుకోవచ్చునో అన్ని రాష్ట్రాల రాజకీయ నాయకులూ గ్రహిస్తారు. సంక్షేమం అంటే కేవలం తాయిలాలు పంచటం కాదని, వారి భవిష్యత్తును వారే నిర్మించుకునే విధంగా ఆసరాగా నిలబడటమని నిరూపించిన జగన్‌ను ఇకపై వారంతా రోల్ మోడల్‌గా తీసుకుంటారు. పిల్లలు బాగా చదువుకుని వృద్ధిలోకి వస్తేనే కుటుంబాలు బాగుపడతాయని గుర్తించి ఆ రంగాన్ని ప్రక్షాళన చేయటం, ప్రామాణికమైన విద్యనందించటం, 'నాడు–నేడు' పేరిట బడులన్నిటినీ తీర్చిదిద్దటం కనీవినీ ఎరుగనిది. వైద్యరంగంపైనా ఆయన అంతే శ్రద్ధ పెట్టారు. భారీయెత్తున సిబ్బందిని నియమించి ఆస్పత్రులను తీర్చిదిద్దటం, ఆధునాతన వైద్య పరికరాలు, ఔషధాలు సమకూర్చటం, పల్లెలకు సైతం వైద్య సేవలు చేరేయటం మామూలు విషయం కాదు. అలాగే రైతు కోసం ఏర్పాటైన వ్యవస్థలైతేనేమి... వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిట్లోకి తీసుకెళ్లటమైతేనేమి జగన్ విజయాల్లో మచ్చుకు కొన్ని. దేశంలో ప్రజాభిమానాన్ని చూరగొనాలనుకునే నాయకులెవరైనా వీటిని అనుసరించక తప్పదు.

అయితే జనం మనస్సుల్లోంచి దీన్నంతటినీ తుడిచేయాలని చూసిన జిత్తులమారి టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి గురించీ, వారి చేష్టలకు వంతపాడిన ఎన్నికల సంఘం గురించీ ప్రస్తావించుకోవాలి. వారి నుంచి ఫిర్యాదు రావటమే తడవుగా ఉన్నతాధికారులను బదిలీ చేయటం, అయిదేళ్ల నుంచి అమలవుతున్న పథకాలకు మోకాలడ్డటం,వారు కోరిన విధంగా అడ్డగోలుగా అధికారుల్ని నియమించటం... టీడీపీ పోకడలపై ఫిర్యాదు చేసినా బేఖాతరు చేయటం లేదా ఆలస్యంగా స్పందించటం తటస్థంగా వుండాల్సిన వ్యవస్థకు తగదు. సాక్షాత్తూ బాబే ఎన్నికల సభల్లో సీఎంనుద్దేశించి దూషించినా... ఆయన్ను రాళ్లతో కొట్టాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా బాబును ఆపే ప్రయత్నం చేయలేదు. వేరే రాష్ట్రాల్లో ప్రధానినుద్దేశించి చిన్న వ్యాఖ్య చేసినా నొచ్చుకున్న ఆ వ్యవస్థ ఏపీలో వీటన్నిటినీ ఎలా కొనసాగనిచ్చింది? అన్నీ ఒక ఎత్తయితే ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై బాబు అండ్ కో సాగించిన దుష్ప్రచారం, ప్రజలను భయపెట్టడం మరో ఎత్తు. బాబు, లోకేష్‌లపై కేసులు పెట్టాలని ఆదేశించారు సరే... కానీ ఆ తర్వాత అదే అంశంపై నిబంధనలకు విరుద్ధంగా మీడియాలో పూర్తి పేజీ ప్రకటనలిస్తే ఎందుకు సంజాయిషీ కోరలేదు? నిజానికి పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగిందంటే అందుకు వైఎస్సార్ కాంగ్రెస్ సంయమనమే కారణం. అయినదానికీ, కానిదానికీ రాయలసీమపై అభాండాలేయటం బాబు దురలవాటు. కానీ చిత్రంగా అక్కడ అత్యంత ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఇతరచోట్ల టీడీపీ బరితెగింపుతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈవీఎంల ధ్వంసం, పెట్రోల్ బాంబులతో దాడి, పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలను బెదిరించటం, బౌన్సర్లతో హడలెత్తించటం, పోలీస్ స్టేషన్‌పై దండయాత్ర చేయటం దేనికి సంకేతం? ఎన్ని అవరోధాలెదురైనా నిర్భయంగా పోటెత్తి వోటేసిన ప్రజానీకం అభీష్టానిదే అంతిమ విజయం.

ఆశల వసంతం... నిస్పృహల శిశిరం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అవినీతిపై యుద్ధం అని చెప్పి గెలిచిన ఎన్డీఏ కూటమి అవినీతిని అరికట్టలేకపోయింది. దానికి బదులు ఈ కూటమి పాలనా కాలంలో కొద్దిమందిగా ఉన్న కోటీశ్వరుల సంఖ్య పెరిగింది. ఇప్పుడు వారంతా మహా కోటీశ్వరులుగా మారారు. ఏడీఆర్ తాజా నివేదిక ప్రకారం... ఇక దేశంలో 'ఆరుగాలమూ' పాలనలో తిష్ఠవేసేది అవినీతిపరుల, కోటీశ్వరుల, మహాకోటీశ్వరుల పాలనేనని రుజువైంది. రాజ్యాంగాన్ని మార్చడం అనే విషయమూ ఎన్నికల కాలంలో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులు కొందరు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో తాము రాజ్యాంగాన్ని మార్చబోమని అధికార పార్టీవారు స్పష్టం చేయవలసివచ్చింది.

''తయారయ్యే ప్రతీ తుపాకీ, రంగంలో ఉన్న ప్రతీ యుద్ధనౌక, మనం ఉపయోగించే ప్రతీ రాకెట్టూ – ఆకలిదప్పులతో మలమల మాడుతున్న, మనం మాడ్చుతున్న పేదసాదల కష్టార్జితం నుంచి దోచుకున్నదే''

– అమెరికా మాజీ అధ్యక్షుడు ఐజెన్‌హోవర్ విస్పష్ట ప్రకటన

''నేటి భారతదేశంలోని లెజిస్లేటర్లలో 360 మంది నేర చరిత్రు లేనని, 476 మంది కోటీశ్వరులని, ఒక అభ్యర్థి రూ. 5 వేల కోట్లతో అగ్రస్థానంలో ఉన్నారనీ, లోక్‌సభ నాలుగో విడత అభ్యర్థులపై తాజాగా 'ఏడీఆర్' (అసోసియేషన్ ఆఫ్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్) సాధికార నివేదిక వెల్లడించింది. మొత్తం 1,717 మంది పోటీ పడే అభ్యర్థుల్లో 1,710 మంది వాఙ్మూలాలను విశ్లేషించి ఈ నివేదికను విడుదల చేసింది.''

ఏడీఆర్ తాజా నివేదిక ప్రకారం... ఇక దేశంలో 'ఆరుగాలమూ' పాలనలో తిష్ఠవేసేది అవినీతిపరుల, కోటీశ్వరుల, మహాకోటీశ్వరుల పాలనేనని రుజువైంది. కానీ మళ్లీ అదే ఎన్డీఏ ముఠా నినాదం – 'వచ్చే అయిదేళ్లు అవినీతిపై యుద్ధమే'నని!

ఇప్పటిదాకా ఎన్డీఏ కూటమి 'అవినీతిపై యుద్ధంలో' సాధించిన విజయాలేమిటో మోదీ చెప్పగలరా? దేశ సమైక్యత అంటూనే దేశంలో విభజనకు ఎన్డీఏ అవకాశం కలిగేలా వ్యవహరిస్తోంది. ఉత్తర–దక్షిణ భారతాల మధ్య విభజన రేఖకు ప్రస్తుత కేంద్రం వ్యవహారశైలి దారి తీస్తుందనేది కొందరి వాదన.

వేలాది గుజరాత్ దళిత పేదసాదలపై దారుణ హత్యాకాండకు కారకులైన నాటి బీజేపీ నాయకులు ఆ ఉన్మాద చరిత్రను దాచడానికి ప్రయత్నిస్తూ సుప్రీంకోర్టు విచారణను సహితం పక్కదారులు పట్టించారు. అయినా బీజేపీ–ఆరెస్సెస్ కూటమిగా ఉన్న ఎన్డీఏ 'రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్టు' పచ్చి అబద్ధమాడుతూ ఇప్పుడు తాజాగా సరికొత్త ఎదురుదాడికి సాహసిస్తోంది. పైగా, 'భారత రాజ్యాంగాన్ని దాన్ని రూపొందించిన డాక్టర్ అంబేడ్కర్ కూడా మార్చలేరని' తాజాగా ప్రధాని మోదీ బాహాటంగా 'కోతల'కు దిగడం అత్యంత హాస్యాస్పదం!

నిజానికి మనకు మోదీ హయాంలో రాజ్యాంగం అమలులో ఉందానిపిస్తోంది. ఉంటే, విదేశీ 'పెగసస్' సాఫ్ట్‌వేర్ ద్వారా దేశ యువకులను వేధించడానికి భారత పాలకులు సాహసించేవారు కాదు! రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ తను రూపొందించిన రాజ్యాంగాన్ని ఏదో తానే మార్చేయబోతున్నట్టు మోదీ ఊహించుకుని అంబేడ్కర్ సహితం దాన్ని మార్చలేరని 'ట్విస్టు' ఇచ్చారు! పైగా 'నేనింతవరకు ఈ స్థాయికి ఎదగడానికి సాయపడిన రాజ్యాంగానికి రుణపడి ఉన్నానని' మరో ట్విస్టు ఇచ్చారు!

బీజేపీ నాయకుల్లో కొందరు 400 లోక్‌సభా స్థానాలు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామనే ప్రకటనలు ఇవ్వడం, దానిపై దేశవ్యాప్తంగా నిరసన గళాలు లేవడం తెలిసిందే. అందుకే మోదీ రాజ్యాంగాన్ని ఎవ్వరూ మార్చలేరని ప్రకటించాల్సి వచ్చింది.

రెండో మాట



మనకో గొప్ప సామెత ఉంది – కంపు నోటి వాడు సంపాదిస్తే, కమ్మని నోటి వాడు ఎగేసుకుపోయాడని! తన సమకాలీన సమాజంలోని అంతరాల దొంతర్లను, అకృత్యాలను, అన్యాయాలనూ, మౌఢ్యాన్నీ చాటలతో చెరిగి ప్రజల సుఖదుఃఖాలకు అద్దంపట్టిన ఇంగ్లండ్ మహా రచయిత చార్లెస్ డికెన్స్ 'రెండు మహానగరాలు' అన్న రచనలో చెప్పిన మాటలు నేటికీ చిరస్మరణీయాలే! అపార దేశ సంపద మధ్యనే దారుణమైన దారిద్ర్యం తాండవమాడుతోంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలైనా సగటు మనిషి జీవితం దుర్లభం కావడం, కేవలం కొద్దిమందిగా ఉన్న కోటీశ్వరుల సంఖ్య అమాంతం పెరిగి మహా కోటీశ్వరులుగా మారిపోవడం చూస్తున్నాం. అందుకే డికెన్స్ మహాశయుడు తన కాలం నాటి ఇంగ్లండ్ పరిస్థితులను వర్ణించిన మహా వాక్యాలను తిలకించండి:

''అవి ఎంతో మంచి రోజులు. అలాగే అవి పరమ చెడ్డ రోజులు కూడా. అది జ్ఞానంతో కూడిన వివేచనా యుగం, అయినా అది మూర్ఖపు యుగం కూడా. అది విశ్వసించదగిన శకం, కానీ అది నమ్మలేని యుగం కూడా. అది అంధకారాన్ని చీల్చగలిగిన క్రాంతికి అరుదైన సమయం కూడా. అయినా అది అంధకారానికి ప్రతీక కూడా. అది ఆశల వసంతకాలం, కానీ అది నిరాశా నిస్పృహల శిశిరం కూడా. అన్నీ మా కళ్లముందే పరుచుకుని ఉన్నాయి, అయినా మా కళ్లముందు ఉండవు!''

విచిత్రమైన విషయం ఏమంటే– రాజ్యాంగాన్ని ఏదో అంబేడ్కర్ మార్చదలచినట్టు 'భావించి' ఒకవేళ 'మార్చుదామనుకున్నా మార్చలేడ'ని, అలాగే ఎన్డీఏ–ఆరెస్సెస్ కూటమి మార్చుదామనుకున్నా మార్చలేదనీ ప్రకటించిన ఎన్డీఏ నాయకుడు 'నేనీ స్థితికి (ప్రధాని పదవికి) వచ్చానంటే నన్నీ ఉన్నత స్థితికి తీసుకొచ్చింది రాజ్యాంగమే'నని ప్రకటించుకోవడం వింతలలో వింతగా ఉంది. కానీ భారత రాజ్యాంగాన్ని గౌరవించే వాళ్లెవరూ ఫాసిస్టుల చేతుల్లో దాన్ని పెట్టి, భ్రష్టు పట్టించరు గాక పట్టించరు. మహాకవి జాషువా ఇవాళ కాదు, దశాబ్దాల క్రితమే 'హైందవ నాగరాజు' నీడల్ని పసికట్టి భారంగా ఒక సత్యాన్ని చాటాడు. 'స్వాతంత్ర్యంబును సర్వసౌఖ్యమున మా భాగంబు మాకిత్తురో, ఖాతాలేదని త్రోసిపుచ్చెదరో! వక్కాణింపవే చెల్లెలా!'

ఈ ప్రశ్నలో అప్పటికీ ఇప్పటికీ పెద్ద మార్పు లేదు. ఎంతసేపటికీ దళితుల ఖాతాలు మార్చడం తప్ప, ఉమ్మడి సొత్తులో వారి ఖాతాలు ఈ రోజుకీ మెరుగుపర్చింది లేదు. ఎందుకంటే జాతి వివక్షా విధానంలో, కులం కుళ్లు అంతర్భాగమనీ, ఇండియాలో వర్గమూ, వర్ణమూ అవినాభావ సంబంధం కలిగి, కుల సమస్యగా, వర్ణ వివక్షా సమస్యగా మనిషి ఉనికినీ, ఉసురునూ, ఉపాధినీ దెబ్బతీసే వికృత సమస్యగా ఉంది. ఇదే విషయాన్ని 50 స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు) 300 మంది కార్యకర్తలతో కలిసి ఒక ఫోరమ్‌గా ఏర్పడి 'దర్బన్' సభకు 18 పేజీల డాక్యుమెంట్‌ను సమర్పించారు. ఇది ఫోరమ్ స్థాయిలో సర్వాంగీకారం పొందిన పత్రం. ఈ దర్బన్ సభలో 'పరివార్' ప్రభుత్వ ప్రతినిధి పాల్గొని 'కుల సమస్య' దర్బన్ సభ ఎజెండాలోకి రాకుండా, వర్ణ వివక్షను పెంచి పోషిస్తున్న అమెరికా, తదితర పాశ్చాత్య రాజ్యాల అండతో సమస్యను దాటవేశారు. అలా బీజేపీ ఈ దాటవేతలో 'జయప్రద'మయింది! చివరికి ఇప్పుడు మన దేశంలో 'బీజేపీ పరివార్' ప్రభుత్వం ఏ స్థాయికి ఎదిగిపోయింది? దేశ బడ్జెట్లు, బిల్లులు శాసన వేదికలో సరైన చర్చ లేకుండానే మూజువాణీ ఓటుతో ఆమోదించి ముద్ర వేసుకోవడమే! నేర చరిత్ర గల అభ్యర్థులను డబ్బు కోసం కక్కుర్తిపడి పాలక పక్షం సహా దాదాపు అన్ని పక్షాలూ (కొన్నే మినహాయింపులు) ఆశ్రయించి, ఆమోదించడం! ఇదీ మన శాసన వేదికల, అభ్యర్థుల చరిత్ర, భాగోతం!

వివేకానందుడు, హరిదాస్ విహారిదాస్ దేశాయ్‌కి చికాగో నుంచి లేఖ రాస్తూ ఇలా అన్నారు: 'అణగారిపోతున్న అసంఖ్యాక నిరుపేద కష్టజీవుల రక్త మాంసాలపై ఆధారపడి విద్యావంతుడై, కులాసా జీవితం గడిపే ప్రతి ఒక్కరినీ దేశ ద్రోహిగా పరిగణించాలి. మన సంస్కర్తలు అసలు 'జబ్బు' ఎక్కడుందో చూడరు. విగ్రహాల వల్ల లాభం లేదు. హిందువనీ, ముసల్మాన్ అనీ, క్రిస్టియన్ అనే పేర్ల చాటున ఆ మతాల పదఘట్టన కింద కకావికలమవుతున్న ప్రజా బాహుళ్యం... ధన సంచులున్న వాడి పాదాల కింద శాశ్వతంగా పడి నలిగి పోవడానికే తాము పుట్టామన్న భావనకు గురి కారాదు. విగ్రహాలు ఉంటాయో, ఊడతాయో, కులాలు మంచివా, చెడ్డవా ప్రశ్నలు మనకు అనవసరం. పేదల మనస్సుల్లో భావవ్యాప్తి జరిగిన మరుక్షణం, మిగతా కార్యాచరణను వారే పూర్తి చేస్తారు!'

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

షీల్డ్ తొలగింది!



ఆస్ట్రాజెనెకా తన కోవిడ్ వ్యాక్సిన్‌లను ప్రపంచమంతటా ఉపసంహరించుకుంది. భారతదేశంలో ఇక కోవిషీల్డ్ లేనట్లే! అయితే ఇప్పటికే ఆ వ్యాక్సిన్‌ను తీసుకున్న 80 కోట్ల మంది ప్రజల సంగతేమిటి? మోదీ ఇప్పుడు క్షమాపణ చెబుతారా?

– అంకిత్ మయాంక్, వ్యాపారవేత్త

ఆదర్శ న్యాయం



నేరాలను నిరోధించేది కచ్చితమైన న్యాయమే కానీ, కంటి తుడుపు న్యాయం కాదు. ప్రజ్వల్ రేవణ్ణ కేసును నిర్వహించే విధానం... ఇంకా ప్రజల దృష్టికి రాని వాటితో సహా ఇలాంటి కేసులలో న్యాయ ప్రక్రియను నడిపిస్తుంది.

– రితుపర్ణ చటర్జీ, నెట్‌వర్క్, 'ఉమెన్ ఇన్ మీడియా'

ఇలా కూడా!!



మా అమ్మకు (ఇంట్లో నేను ఆమె పక్కన ఉండగానే) బయటి నుంచి నేను చేసినట్లుగా ఒక అమ్మాయి పెద్దగా ఏడుస్తూ కాల్ చేసి, తన కారు యాక్సిడెంట్‌కు గురయిందని చెప్పింది! ఆ వెంటనే ఒక వ్యక్తి తను పోలీస్‌నని ఫోన్‌లో చెబుతూ, "మీ అమ్మాయి యాక్సిడెంట్ చేసింది. ఆమెను జైలుకు తీసుకెళుతున్నాం. మీరు వెంటనే 4 వేలు ట్రాన్స్‌ఫర్ చేస్తే బెయిల్ ఇప్పిస్తాను." అని చెప్పాడు! ఈ మధ్య ఇలాంటివి ఎక్కువయ్యాయి.

– ఎంజే, పర్వతారోహకురాలు

సీటు బెల్టుతో పాటుగా..!



1. మీకు కారు ఉంటే, వెంటనే డ్యాష్‌క్యామ్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి. 2. హైవేలపై ఇకపై ఎప్పుడూ డ్రైవ్ చేయకండి. 3. సాధారణంగా రోడ్డు భద్రత అన్నది భారతదేశంలో తక్కువగా ఉంటుంది కనుక మీరు జాగ్రత్త గలిగిన డ్రైవరుగా ఉండండి – ఎల్లప్పుడూ!

– ఆనంద్ శంకర్, సోషల్ ఆంట్రప్రెన్యూర్

ఇన్నేళ్ల తర్వాత!



మా నాన్న మా అమ్మను ఎంతగా హింసించేవారో ఈ మధ్యే కొద్ది కొద్దిగా మా అమ్మ నాకు చెప్పటం మొదలు పెట్టింది. ఇన్నాళ్లూ సీసాలో మూత పెట్టి ఉంచిన ఆ కథలను ఒకటొకటిగా ఈ 68 ఏళ్ల వయసులో ఆమె బయటికి తీసి నాకు చెబుతోంది. ఇలా నాకు చెప్పకోవటం ద్వారా ఆమె తన గాయాలను మాన్పుకునే ప్రయత్నం చేస్తోంది. అసలే చెప్పకపోవటం కన్నా ఆలస్యంగానైనా చెప్పటం మేలే కదా!

– గౌతమ్ ఎస్. మెంజిల్, సైబర్ అవేర్‌నెస్ వారియర్

ఆ మాట వద్దు



మీరు యువ జర్నలిస్టు అయితే కనుక దయచేసి గమనించండి. మీ రిపోర్టింగ్ స్టోరీలో 'నేను' అనే మాట వాడకండి. మీరు కథ కాదు, జర్నలిస్టు! అభిప్రాయాలు, వ్యక్తిగత వ్యాసాలు ముఖ్యమైనవే. కానీ అవి రిపోర్టింగ్‌తో సమానం కావు.

– రాగమాలిక, కమ్యూనికేటర్

ఏం టైమింగ్!!



ముస్లింలను లక్ష్యంగా చేసుకుని కర్ణాటక బీజేపీ చేసిన ద్వేష పూరిత ప్రసంగ వీడియోను తొలగించాలని ఈసీ ట్విట్టర్‌ని ఆదేశించింది. ఈసీ మరికొంత కాలం వేచి ఉండొచ్చు. కర్ణాటక ఎన్నికలు ముగిసే వరకే ఎందుకు వేచి ఉండాలి? అన్ని విడతలూ పూర్తయ్యే వరకు ఆగితేనేం?!

– ధన్యా రాజేంద్రన్, చమేలీ దేవీ జైన్ అవార్డు గ్రహీత

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** శు.సప్తమి పూర్తి(24 గంటలు), **నక్షత్రం:** పుష్యమి ప.3.08 వరకు తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** తె.4.56 నుండి 6.36 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.52 వరకు తదుపరి రా.10.50 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.20 నుండి 10.01 వరకు.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వెచ్చని హృదయ రాగ సందేశం

అభిప్రాయం



కరణ్ థాపర్

ఇది నిన్ననే జరిగినట్లుగా నా జ్ఞాపకంలో స్పష్టంగా ఉంది. నిజానికైతే, నేను తొలిసారి ఫాదర్ టెర్రీ గిల్‌ఫెడర్‌ను కలిసింది నలభై ఏళ్ల కిందట! అది 1982 వేసవి చివరిలో... నిషా, నేను మా పెళ్లికి సిద్ధం అవుతున్న సమయం. ఒక క్యాథలిక్‌గా నిషా తను కోరుకున్న సంప్రదాయబద్ధమైన చర్చి వివాహానికి నేను నా అంగీకారాన్ని తెలిపినప్పుడు, స్థానిక పారిష్ చర్చి ప్రీస్ట్‌ను కలసి ఆయన చేత మూడు ఉపదేశాలు ఇప్పించుకోవలసి అవసరం ఏర్పడటం నన్ను చీకాకు పెట్టింది. కానీ వేరే దారి లేదు. వెదికితే, అతి దగ్గరగా నార్తంబర్లాండ్ అవెన్యూలో ఉన్న పునీత మేరీ మగ్దలీనా చర్చి ఒక్కటే నిషాకు ఒక క్రైస్తవేతరునితో వివాహం జరిపించేందుకు అంగీకరించింది, నిబంధనలకు లోబడి ఉండే షరతు మీద!

సెప్టెంబరులో ఒక శనివారం, సాయంత్రం 6 గంటలప్పుడు నిషా, నేనూ ఫాదర్ టెర్రీ ఇంటి తలుపు తట్టాం. ఆయన తన డెస్క్ ముందు కూర్చొని ఉన్నారు. ఆయన కళ్లజోడు ముక్కు చివరికి దిగి ఉంది. ఆ చిన్న గదికి ఎదురుగా ఉన్న ఒక పాత, వెలసిపోయిన లెదర్ సోఫా మీద మేము కూర్చున్నాం. బయట ఎప్పుడూ లేనంత వేడిగా ఉంటే, లోపల వాతావరణం మంచులో ఉన్నట్లుగా ఉంది. నేను ఊరకే ఉండలేకపోతున్నాను.

''షెర్రీ తీసుకుంటారా?'' అని ఆయన అనటం నన్ను అమితంగా ఆశ్చర్యపరిచింది. ''మీ ఇద్దరి గురించీ నాకు తెలియదు. కానీ నేను షెర్రీ పట్ల కొంత మొగ్గగానే ఉన్నాను'' అన్నారు.

అది టియో పెపె. నాకు ఇష్టమైనది. షెర్రీ బ్రాండ్. కానీ ఆ రోజుల్లో లండన్‌లో అది చాలా అరుదుగా మాత్రమే దొరికేది. ఫాదర్ టెర్రీ వివేచనతో కూడిన అభిరుచి గల వ్యక్తి. నేను ఆయనతో యూఎస్ ఓపెన్ టెన్నిస్, నాటింగ్ హిల్ కార్నివాల్, రష్దీ 'మిడ్‌నైట్ చిల్డ్రన్' వంటివాటిపై చర్చిస్తూ ఉన్నాను– మేము చేసుకోబోయే వివాహం, మాకు పుట్టబోయే పిల్లలు ఏ మతాన్ని అనుసరించవలసి ఉంటుంది– అనేవి తప్ప... అన్నీ.

ఫాదర్ టెర్రీ మా గ్లాసులను నింపుతూ సంభాషణను నడిపిస్తున్నారు. ఆయన నా వాదనను గ్రోలుతూనే, తన వాదనను సౌఖ్యంగా నిలిపి ఉంచుకుంటున్నారు. కాలం ఉల్లాసవంతమైన వేగంతో గడిచిపోయింది. వచ్చేవారం కలుద్దాం అనుకున్నాక, బయల్దేరేందుకు మేము లేచి నిలబడ్డాం. ఫాదర్ టెర్రీ మమ్మల్ని ఆపినప్పుడు మేము తలుపు దగ్గర ఉన్నాం.

''మీరు ఆలోచించాలని నేను కోరుకుంటున్న విషయమై ఒక ప్రశ్న నా దగ్గర ఉంది'' అన్నారు. ఆ ప్రశ్నకు సూచనగా చిరునవ్వొకటి విశాలమైన ఆయన గుండ్రటి ముఖం మీద నాట్యమాడింది. ఆయన కళ్లు సూటిగా మావైపే చూస్తున్నాయి. ''మీరిద్దరూ కలిసి ఎందుకు సహజీవనం చేయకూడదు?'' అన్నారు ఫాదర్ టెర్రీ.

మా ముఖాల్లోంచి రక్తం చివ్వున చిమ్మిందేమో నేను కచ్చితంగా చెప్పలేను కానీ, మేమిద్దరం మాత్రం నోట మాట రాక అలా ఉండిపోయాం. నిజం ఏమిటంటే నిషా, నేను అప్పటికే సహజీవనంలో ఉంటూ ఆ వాస్తవాన్ని దాచటానికి ఉద్దేశపూర్వకంగానే ఫాదర్ టెర్రీకి వేర్వేరు చిరునామాలను ఇచ్చాం. అది ఆయన ఊహించారు. అందుకే తన పద్ధతిలో అదేం పెద్ద విషయం కాదన్నట్లు చెప్పారు.



నిషా పూర్తి క్రైస్తవ సంప్రదాయంలో వివాహాన్ని కోరుకుంది. వరుడు క్రైస్తవుడు కాదు అనే విషయాన్ని పట్టించుకోకుండా ఫాదర్ టెర్రీ అందుకు సమ్మతించారు. ఆయన ఉపదేశ వాక్యం అందరి దృష్టిని ఆకర్షించింది. నరకం, అపరాధం, దైవం, సచ్ఛీలత... వీటి గురించి ఆయన ఉపదేశం చలేదు. ''ఐ లవ్ యు'' అనే మూడు చిన్న పదాల గురించి మాట్లాడారు.

''కరణ్, నిషా...'', ''గుర్తుంచుకోండి. 'ఐ' నీ, 'యు' నీ 'లవ్' జత కలుపుతుంది. కానీ అది వేరు కూడా చేస్తుంది. మీరిద్దరూ వేర్వేరు వ్యక్తులని మీరు మరచిపోయిన రోజున మీ బంధం విడిపోతుంది'' అన్నారు ఫాదర్ టెర్రీ.

అదొక వెచ్చని, తేలికపాటి, హృదయపూర్వక సందేశం. లాంఛనప్రాయమైన తంతు కంటే కూడా నిప్పు చుట్టూ కూర్చొని మాట్లాడుకోవటం వంటిది. కానీ అది పావు శతాబ్దం పాటు నా మదిలో వెలుగుతూనే ఉండిపోయింది.

ఆరేళ్ల తర్వాత, ఆసుపత్రిలో నిషా చివరి ఘడియల్లో ఉన్నప్పుడు లైఫ్ సపోర్టును తొలగించటానికి కొన్ని నిమిషాల ముందు ఫాదర్ టెర్రీ ఆమె పక్కనే ఉన్నారు. ఆమెకు చివరి మతకర్మను నిర్వహించారు. అమ్మను కూడా హైందవ సంప్రదాయం ప్రకారం నిషా చెవిలో ప్రార్థనలు వినిపించమని ప్రోత్సహించారు. ఆ తర్వాత యంత్రాలు మెల్లగా, బాధగా మినుకు మినుకుమని కొడిగడుతున్నప్పుడు నిషా అంతిమ శ్వాసలో ఫాదర్ టెర్రీ నా పక్కన నిలబడ్డారు.

నాకు తెలిసిన ఏకైక క్రైస్తవ మత గురువు టెర్రీ గిల్‌ఫెడర్. ఆయన ఒక వింత మనిషి అయినప్పటికీ ఒక గొప్ప వ్యక్తి. ఒరిస్సా, కర్ణాటకలలో క్రైస్తవులపై జరిగిన దాడి గురించి చదివిన ప్రతిసారీ నేను ఆయన గురించి ఆలోచిస్తాను. గాయపడిన హృదయాలను నయం చేసే పదాలను ఆయన కనుగొని ఉంటారని నేను నమ్ముతాను. అందుకు నిస్సందేహంగా ఆయనకు షెర్రీ సహాయపడి ఉంటుంది.

– వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

కార్య సాధన సూత్రాలు

దుర్వాస శాపం వల్ల ఒకానొకప్పుడు దేవతలు తమ రాజ్యాన్నీ, వైభవాన్నీ కోల్పోయారు. వాటిని తిరిగి సాధించుకొనేందుకు సహాయం చేయమని విష్ణుమూర్తిని ప్రార్థించారు.

విష్ణుమూర్తి కాలం వాళ్ళకు అనుకూలమయ్యే దాకా వేచి ఉండమన్నాడు. ఇంతలో క్షీరసాగర మథనం చేసి, అమృతాన్ని సాధిస్తే ఉత్తరోత్తరా ఉపయోగం అన్నాడు. అయితే, ఆ మహాకార్యం రాక్షసులూ, దేవతలూ కలిసి చేస్తే తప్ప సాకారమయ్యేది కాదు. కాబట్టి ఆ పని పూర్తయ్యే దాకా, రాక్షసులకు లొంగిపోయి, వాళ్ళతో సంధి చేసుకోమన్నాడు. ఈ సందర్భంగా మహాకార్యాలు సాధించగోరేవారు గుర్తుంచుకోవాల్సిన మూడు సూత్రాలు దేవతలకు బోధించాడు.



జ్యోతిర్మయం

తలపెట్టిన కార్యం ప్రయోజనం (కార్య –అర్థం) మహత్తరమైనదైనప్పుడు, ఆ కార్య నిర్వహణలో శత్రువులను కూడా కలుపుకొనిపోక తప్పదు. **అరయః అపి సంధేయాః, సతి కార్యార్థ గౌరవే** (భాగవతం, 8–6–20)

అలాగే, **న సంరంభేణ సిధ్యంతి సర్వే– అర్థాః సాంత్వయా యథాః**

అన్ని పనులూ సామమార్గం వల్ల సాధ్యమైనట్టుగా, ఆవేశాల వల్లా, హడావిడి వల్లా సాధ్యపడవు. అంతే కాదు, మహత్తర ఫలితాలు సాధించగోరేవాడికి, స్వల్ప ఫలాల మీద కక్కుర్తి కూడదు. తొలి దశలలో లభించే చిన్న చిన్న ఫలాలకే ఆశపడిపోయి, వాటితో తృప్తి చెందితే, అక్కడే ఆగిపోతారు. మహాకార్య నిర్వహణలో అనుకోకుండా ఇతర వస్తువులు లభించినప్పుడు వాటిమీద వల్లమాలిన కోరికా ఉండకూడదు. అలాంటి చిన్న వస్తువులు మరెవరో ఆరాటపడి తీసేసుకుని మనకు లేకుండా చేశారని రోషమూ, క్రోధమూ కూడా తగవు. లోభః కార్యః నవః జాతు, రోషః కామః మ వస్తుషు. చిన్న ఫలాల గురించి లోభపడకూడదు. అల్ప వస్తువులు కావాలని కోరిక గానీ, అవి దక్కలేదని రోషం గానీ పెట్టుకోవద్దు. అంతిమ లక్ష్యం దాకా ప్రయాస కొనసాగించటమే కార్య శూరత్వం.

– ఎం మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

రేపు టీఎస్ సీపీజీఈటీ-2024 నోటిఫికేషన్



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): టీఎస్ సీపీజీఈటీ–2024 నోటిఫికేషన్ ఈనెల 15న వెలువడనుంది. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఓయూ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా టీఎస్ సీపీజీఈటీ–2024 నిర్వహించనున్నారు. ఉమ్మడి పీజీ కోర్సుల ప్రవేశాల నిర్వహణపై ఈనెల 15న వర్సిటీల వైస్ చాన్స్‌లర్స్‌తో సమావేశం అనంతరం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ సోమవారం ముగిసింది. 11 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి మొత్తం 69 మంది నామినేషన్లు వేశారు. అందులో ఆరుగురి నామినేషన్లు తిరస్కరణకు గురికాగా.. 11 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. చివరికి బరిలో 52 మంది నిలిచారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఈనెల 27న పోలింగ్ జరగనుంది.

నేడు రౌజ్ అవెన్యూ కోర్టుకు కవిత

- జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపుపై విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మంగళవారం రౌజ్ అవెన్యూ కోర్టు ముందు హాజరుపరచనున్నారు. మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు నేపథ్యంలో ఆమె తిహార్ జైల్లో ఉంటున్న విషయం తెలిసిందే. కాగా ఆమె జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలా లేదా అనే అంశంపై మంగళవారం రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టనుంది. ఢిల్లీ మద్యం పాలసీలో కవిత పాత్రను ప్రస్తావిస్తూ ఇటీవల ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకోవాలని ఈడీ తరఫు న్యాయవాది కోర్టును కోరే అవకాశం ఉంది. ఇలావుండగా ఈడీ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఈ నెల 24న విచారణ చేపట్టనుంది.



సకుటుంబ సపరివార సమేతంగా..

సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్‌లోని జెమిని కాలనీకి చెందిన పూస కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. మొత్తం నలుగురు అన్నదమ్ములు, కూతుళ్లు, కుమారులు, కోడళ్లు కలిపి 60 మంది కలిసి 187వ బూత్‌లో ఓటు వేసి ఔరా అనిపించారు.

- ముషీరాబాద్

10 సీట్లు మావే..!

ఆశలపల్లకిలో కమలదళం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి కనీసం పది సీట్లలో గెలిచి సత్తా చాటుతామనే ధీమా కమలదళంలో కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఓటింగ్ జరిగిన తీరును పరిశీలిస్తే బీజేపీ, ప్రధాని మోదీ పట్ల వివిధ వర్గాల ఓటర్లలో సానుకూలత వ్యక్తమైనట్టుగా పార్టీ నాయకులు చెబుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా మహిళలు, యువత పెద్దసంఖ్యలో తమకే ఓట్లు వేశారనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిట్టింగ్ ఎంపీ సీట్లయిన సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లను నిలబెట్టుకుంటామని.. వీటితోపాటు మల్కాజిగిరి, చేవెళ్ల, మహబూబ్‌నగర్, జహీరాబాద్, భువనగిరి, వరంగల్, నాగర్‌కర్నూల్, మెదక్, పెద్దపల్లి స్థానాల్లో కనీసం ఆరు సీట్లు గెలిచే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిపి గెలిచే సీట్ల కంటే కూడా బీజేపీ ఎక్కువ సీట్లు సాధిస్తుందనే విశ్వాసాన్ని ఓ ముఖ్యనేత వ్యక్తం చేయడం గమనార్హం.

ప్రతీ గంటకు నివేదికలు...

సోమవారం ఉదయం పోలింగ్ మొదలైనప్పటి నుంచి సాయంత్రం ముగిసే దాకా ఎప్పటి కప్పుడు ఓటింగ్ సరళిపై క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకోవడంపై రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు. అన్ని బూత్‌ల నుంచి గంటగంటకూ పోలింగ్ సరళిపై బూత్ కమి టీల ద్వారా సమాచారాన్ని తెప్పించి క్రోడీకరించారు. కొన్ని సీట్లలో ఆశించిన మేర ఓటింగ్ శాతం నమోదు కాకపోవడంతో సాయంత్రం 6 గంటల తర్వాత వెల్లడయ్యే తుది ఓటింగ్ శాతాన్ని బట్టి మళ్లీ తాజా అంచనాల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు ఎంతో ముందు నుంచే పార్టీ పట్ల ఓ పాజిటివ్ ప్రచారం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిందని, దానికి తగ్గట్టుగానే బీజేపీ అగ్రనాయకత్వం పూర్తిస్థాయిలో రాష్ట్రంలో ప్రచారంలో నిమగ్నం కావడంవల్ల ప్రయోజనం చేకూరిందని పార్టీ నేతలు చెబుతున్నారు. అదీగాక, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేసినా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వేస్తామనేలా వివిధ వర్గాల ఓటర్ల మనోగతం వ్యక్తమైందని, ఇవన్నీ బీజేపీ మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని ముఖ్యనేతలు భావిస్తున్నారు. పార్టీ అభ్యర్థులు కచ్చితంగా గెలిచే అవకాశాలున్నాయని భావిస్తున్న ఎంపీ స్థానాల్లో... రాష్ట్ర పార్టీ తరఫున కొందరు నాయకులు పర్యటించి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను అంచనా వేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలు, ఇతర పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి, వ్యాపార వర్గాలు, ఉత్తరాది, ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు బీజేపీవైపు మొగ్గు చూపినట్టు కనిపించిందని ధీమా వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పరిమితంగా స్టార్ క్యాంపెయినర్లు ఉండగా, జాతీయస్థాయి ఎన్నికలకు ప్రాధాన్యత కల్పించేలా పెద్దసంఖ్యలో పార్టీ ముఖ్యనేతల ప్రచారం సాగడం కలిసొచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రచారంలో జాతీయ, అంతర్జాతీయ అంశాలు, దేశాభివృద్ధి, తెలంగాణ నుంచి అధికసంఖ్యలో బీజేపీ ఎంపీలను గెలిపిస్తే చేకూరబోయే ప్రయోజనాలు వంటివి ప్రస్తావించడంతో.. మిగతా పార్టీలు, బీజేపీకి ఉన్న తేడా స్పష్టంగా కనిపించిందని పార్టీ నేతలు చెబుతున్నారు.

ఉప్పెనలా ప్రభుత్వ సానుకూలత

▶ మొదటి పేజీ తరువాయి

ఓటింగ్ సరళి, భారీ పోలింగ్ ప్రభుత్వ సానుకూలతను చూపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇది అరుదు' అని చెప్పారు. ఈ ఎన్నికల్లో మంచికి ఓటేయాలని ప్రజలు ముందుగానే నిర్ణయించుకొన్నట్టు ఇది సూచిస్తోందన్నారు. ప్రజాస్వామ్య పటిష్టతకు, రాజకీయ చైతన్యానికి ఇదొక తార్కాణంగా అభివర్ణించారు. ఇంకా ఆయన ఎమన్నారంటే..

సీఎం జగన్ అజెండా పోలింగ్‌లో స్పష్టమైంది

టీడీపీ అజెండా ప్రజల ఆకాంక్షలకు దూరంగా ఉంది. అధికారం, అండ కోసం టీడీపీ కేంద్రంలో ఉన్న పార్టీతో పొత్తు పెట్టుకుని, ఓట్ల కోసం ఓ పెద్ద సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కలుపుకొన్నా ఫలితం శూన్యమైంది. చెప్పుకోవడానికి గతంలో చేసిందేమీ లేకపోవడం, భవిష్యత్తులో చేసే దానిపై స్పష్టత ఇవ్వకుండా పోలింగ్ రోజు వరకు నాటకాలాడారు. సీఎం జగన్‌పై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. వారి పప్పులు ప్రజల దగ్గర ఉడకలేదని తెలిసిన తర్వాత దాడులకు తెగబడ్డారు. సీఎం జగన్ పేద కుటుంబాల అభివృద్ధికి ఎప్పుడైతే యజ్ఞం ప్రారంభించారో అప్పుడే ఆయన అజెండా రూపుదిద్దుకుంది. అప్పటి నుంచి దిగ్విజయంగా కొనసాగుతోంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అజెండా ఉండాలని ప్రజలు భావించడం పోలింగ్‌లో స్పష్టంగా తెలుస్తోంది. సీఎం జగన్ అజెండాతో పోటీపడే శక్తి లేకపోవడంతోనే కృత్రిమ అజెండాలతో ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై దుష్ప్రచారం చేసినా టీడీపీ పాచికలు పారలేదు.

నైరాశ్యంలో టీడీపీ దాడులు

ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ వరకు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేందుకు టీడీపీ దుష్ట పన్నాగాలు చేసింది. వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలు ఓట్లేయడం చూసి టీడీపీ రౌడీ మూకలు నిరాశ, నిస్పృహలతో దాడులకు తెగబడ్డాయి. రాష్ట్రమంతటా టీడీపీ గుండాలు విశృంఖలంగా రోడ్లపై కత్తులు, కర్రలు వంటి మారణాయుధాలతో భీతావహ వాతావరణాన్ని సృష్టించారు. చిత్తూరు, నరసరావుపేట, మాచర్ల, దాచేపల్లి, పెనమలూరు, తాడిపత్రి, పొన్నూరు, జీడీ నెల్లూరు, అద్దంకి, పీలేరు, ఆత్మకూరు, జగ్గయ్యపేట, సత్తెనపల్లిలో విధ్వంసానికి పాల్పడ్డారు. పోలీసు అధికారులు, ఎన్నికల కమిషన్ అబ్జర్వర్ల అండతోనే టీడీపీ హింసాకాండకు పాల్పడింది. ఏదో రకంగా పోలింగ్‌ను అడ్డుకోవాలనే దుస్సాహసం టీడీపీలో కనిపించింది. ఎన్నికల అబ్జర్వర్లు పల్నాడు జిల్లాను బందిఖానా చేసినా.. టీడీపీ గుండాలు ఎలా రెచ్చిపోయారు? ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని వైఎస్సార్‌సీపీ ఎంతో సంయమనంతో వ్యవహరించింది. టీడీపీ మాత్రం ప్రభుత్వ అనుకూల ఓటరు బయటకు రాకూడదని కుట్రలు చేసింది. కచ్చితంగా పోలీసులు టీడీపీతో కుమ్మక్కయ్యారు. ఎన్నికల అధికారుల నుంచి కూడా పోలీసులపై ఒత్తిడి వచ్చింది. మరోవైపు సస్పెన్షన్‌లో ఉన్న పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వర్లు టీడీపీ ఆఫీసులో కూర్చుని అధికారంలోకి వచ్చేస్తున్నామంటూ ఎస్పీలను బెదిరించారు. చివరికి పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో దాడులకు తెగబడ్డారు. మరోవైపు పోలింగ్‌కు ఒక రోజు ముందు కూడా అన్యాయంగా పోలీసులను బదిలీ చేశారు. వారి ఆగడాలకు అడ్డుగా ఉంటారనే ఎటువంటి ఫిర్యాదులూ లేకపోయినా తప్పించేశారు. 2019 ఎన్నికల్లోనూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని చంద్రబాబు దబాయించారు. ఇప్పుడు కేంద్రంతో ఒత్తిడి చేయించి వారి కార్యాన్ని నేరవేర్చుకోవాలని చూశారు. ఎన్నికల కమిషన్‌కు వీలైనంత సపోర్టు ఇవ్వాలనే ఉద్దేశంతోనే వైఎస్సార్‌సీపీ వారి ప్రతి నిర్ణయాన్ని అంగీకరించింది. మేము ఎంత సర్దుకుపోయినా దానిని లోకువగా తీసుకున్నారు.



యాదగిరిగుట్టలో సహాయకురాలి సాయంతో ఓటు వేసేందుకు వెళ్తున్న దివ్యాంగులు

వంద మార్కులొస్తే టాప్ కాలేజీల్లో సీఎస్‌సీ!

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు. అదే 90 నుంచి 100 మార్కులు వస్తే 1500 నుంచి 3600 ర్యాంకు వచ్చే వీలుందని అంచనా వేస్తున్నారు.

ముందే అంచనా వేయాలి

గత కొన్నేళ్ళుగా ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించాలి. ఎన్ని మార్కులకు ఏ ర్యాంకు వస్తుంది? ఏ ర్యాంకు వస్తే ఏ కాలేజీలో ఏయే బ్రాంచిల్లో సీట్లు వస్తున్నాయి? అనేది ముందుగానే అంచనా వేసుకోవాలి. మొదటి దశ కౌన్సెలింగ్‌లో పక్కాగా సీటు వచ్చే కాలేజీని ఎంపిక చేసుకునేందుకు కొంత కసరత్తు చేసి ఆప్షన్లు ఇచ్చుకుంటే కోరుకున్న బ్రాంచిలో సీటు అవకాశం ఉంది.

– ఎంఎన్ రావు (గణితశాస్త్ర సీనియర్ అధ్యాపకుడు)

ఎన్ని మార్కులొస్తే.. ఎంత ర్యాంకు?

మార్కులు	ర్యాంకు		
140పైన	100	90–100	3600–1500
130పైన	200	80–90	6000–3600
120పైన	300	70–80	12000–6000
110–120	800–300	60–70	20000–12000
100–110	1500–800	50–60	35000 – 20000
		40–50	50000 – 35000

పోలింగ్‌ను బహిష్కరించిన మైలారం, ఎదిర వాసులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నాగర్‌కర్నూ లు జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామ స్తులు గుట్టపై మైనింగ్ తవ్వకాలను ఆపాలని డిమాండ్ చేస్తూ ఓటు వేసేందుకు నిరాకరించారు. అచ్చంపేట ఆర్డీవో మాధవి నచ్చజె ప్పేందుకు ప్రయత్నించినా గ్రామస్తులు వినలే దు. గ్రామంలో మొత్తం 783 మంది ఓటర్లు ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి ఆరు గురు మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక అమరరాజా బ్యాటరీ పరిశ్ర మ ఏర్పాటుకు వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ అర్బన్ మండలం నాలుగో వార్డుకు చెందిన ఎదిర వాసులు పోలింగ్‌ను బహిష్కరించారు. ఇక్కడ 3,300 ఓట్లు ఉండగా.. 130 ఓట్లు మాత్రమే పోలైనట్లు సమాచారం.

మాజీ ఎంపీ దామోదర్‌రెడ్డి కన్నుమూత



దామోదర్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ మాజీ ఎంపీ తుమ్మలపల్లి దామోదర్‌రెడ్డి(86) సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ వినయ్‌నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్ల పల్లి మండలం అజ్మాపురం గ్రామం నుంచి విద్యార్థి నేతగా ఎదిగిన ఆయన తొలుత ఎన్ఎస్‌యూఐలో పనిచేశారు. 1969–71 వరకు తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడిగా ,1970–76 వరకు దేవరకొండ పంచాయతీ సమితి ఉపాధ్యక్షుడిగా, 1978 –80 వరకు పంచాయతీ సమితి చైర్మన్‌గా పనిచేశారు. దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా పనిచేశారు.1980లో కాంగ్రెస్ పార్టీ తరఫున నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. 1984లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ చేసి ఓడిపోయారు. ఈయన భార్య సులోచన మూడేళ్ల క్రితం మరణించగా కుమారుడు సుభాష్‌చంద్రారెడ్డి, కుమార్తె ఝాన్సీలక్ష్మి ఉన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఓటు వేసేందుకు వెళ్తూ దుర్మరణం

- రోడ్డు పక్కన టిఫిన్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీ
- ప్రమాదంలో భార్యాభర్తలు, కుమారుడు మృతి



బస్సు డ్రైవర్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇస్తున్న ప్రయాణికుడు

రఘునాథపల్లి: ఓటు వేసేందుకు సొంత గ్రామానికి వస్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. రోడ్డు పక్కన టిఫిన్ చేస్తున్న వారిని.. ఆ మార్గంలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో భార్య అక్కడికక్కడే మరణించగా, తండ్రీకొడుకులు ఆస్పత్రిలో చనిపోయారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి సమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన తెలకలపల్లి రవీందర్ (38), జ్యోతి (32) దంపతులు బీబీ నగర్‌లో చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం స్వగ్రామంలో ఓటు వేసేందుకు ద్విచక్రవాహనంపై కుమారుడు భవిశ్ (9)తో కలసి వరంగల్ బయలు దేరారు. మధ్యలో రఘునాథపల్లి సమీపంలో మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద ఆగి టిఫిన్ చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న వరంగల్ –1 డిపోనకు చెందిన రాజధాని బస్సు అతి వేగంగా ముందు వెళుతున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొడుతూ టిఫిన్ సెంటర్‌పైకి దూసుకొచ్చి రవీందర్ కుటుంబ సభ్యులను ఢీ కొట్టింది. దీంతో జ్యోతి తలపగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, రవీందర్, భవిశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న సంతోష్, శ్రీకాంత్‌లతోపాటు టిఫిన్ చేస్తున్న కెతావత్ రాకేశ్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు బస్సు డ్రైవర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తీవ్రగాయాలైన రవీందర్‌ను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. భవిశ్‌ను వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ప్రమాదంలో తీవ్ర గాయా లైన సంతోష్‌ను హైదరాబాద్‌కు తరలించగా శ్రీకాంత్, రాకేశ్‌లు జనగామ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

సర్కారీ స్కూళ్లకు నిధులెక్కడ?

90 శాతం వేతనాలకే చెల్లు

- నాణ్యత పెంచేందుకు దబ్బులేవి?
- పరీక్షలొచ్చే వరకు పుస్తకాలకు దిక్కే లేదు
- పర్యవేక్షణ పోస్టుల భర్తీకీ అడ్డంకులే
- ఏ స్కూలుకెళ్లినా టీచర్ల కొరతే



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాఠశాల విద్యాశాఖకు నిధులు పెరుగుతున్నా.. ఆశించిన పురోగతి కన్పించడం లేదు. అరకొర మౌలిక వసతులు, నామమాత్రంగానే ఉపాధ్యాయులు, ప్రైవేటు బాట పడుతున్న విద్యార్థులు ... విద్యాశాఖ ప్రతీ ఏటా అధ్యయనంలో వెల్లడయ్యే అంశాలే ఇవి.

- రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పోలిస్తే పాఠశాల విద్యకు బడ్జెట్ కేటాయింపులు 90 శాతంపైగానే పెరిగాయి. 2015–16లో రూ.8,561.61 కోట్ల నిధులు కేటాయిస్తే, 2024–25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ. 17,931.42 కోట్లు కేటాయించారు. మన రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో దాదాపు 23 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. అయితే కేటాయింపుల్లో సింహభాగం టీచర్లు, ఇతర సిబ్బంది వేతనాలకే ఖర్చవుతున్నాయి. దీంతో పాఠశాల అభివృద్ధికి నిధులే సరిపోవడం లేదు. దీంతో పాటు కొన్నేళ్ళుగా చాలీచాలని వేతనాలతో నిర్వహణపరమైన సమస్యలూ వస్తున్నాయి. పేద విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్య, నోట్ పుస్తకాలకు ఇబ్బందులు తప్పడం లేదు. స్కూళ్ళు తెరిచిన కొన్ని నెలల వరకూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్ళనూ తీర్చిదిద్దుతామని చెప్పి మన ఊరు–మనబడి కార్యక్రమం చేపట్టినా తొలి దశలోనే నిధుల కొరత ఎదురవుతోంది.

విద్యార్థులు పెరిగినట్టే పెరిగి...

కోవిడ్ తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. స్కూళ్ళు తెరిచిన మొదట్లో 2 నుంచి 2.5 లక్షల మంది కొత్తగా చేరినట్టు అధికారులు లెక్కలేశారు. కానీ కొన్ని నెలలకే వాళ్ళు తిరిగి ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోయారు. సకాలంలో పాఠ్యపుస్తకాలు రాకపోవడం, క్లాసులు జరగకపోవడం కారణాలుగా విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. రాష్ట్రంలో 11,067 గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూళ్ళున్నాయి. చిన్న స్కూళ్లలో ఫీజులు రూ.30 నుంచి రూ. 40 వేల మధ్య ఉంటున్నాయి. కార్పొరేట్ స్కూళ్ళల్లో రూ. లక్షల్లో ఉంటున్నాయి. అయినా మధ్య తరగతి కుటుంబాలు కూడా ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయించడానికి కారణం ప్రభుత్వ స్కూళ్ళల్లో నాణ్యత కొరవడటమేనని విద్యా రంగ నిపుణులు అంటున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే విద్యా రంగానికి కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

టీచర్లు ఏరీ... సదుపాయాలెక్కడ?

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ 21 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా స్కూళ్ళల్లో సబ్జెక్టు టీచర్లే లేని దుస్థితి ఉంది. పాఠశాలలపై పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. 602 మండలాల్లో కేవలం 17 చోట్ల మాత్రమే రెగ్యులర్ మండల విద్యాశాఖాధికారులున్నారు. అనేక చోట్ల హైస్కూల్ హెచ్‌ఎంలనే ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికీ కనీసం పది మండలాలు అప్పగించారు. 6 వేల పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు పని చేస్తున్నాడు. గతంలో తొలగించిన 12 వేల మంది విద్యా వాలంటీర్లను మళ్లీ తీసుకోలేదు. దీంతో పాఠాలు చెప్పే నాథుడే కన్పించడం లేదు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల వ్యవహారం తేలితే తప్ప కొత్త నియామకాలకు ఆస్కారం లేదు. నిధులు పెంచితే తప్ప ప్రభుత్వ స్కూళ్లు మెరుగయ్యే పరిస్థితి కన్పించడం లేదు.

రాష్ట్రావతరణ నుంచి పాఠశాల విద్యకు బడ్జెట్ కేటాయింపులు

సంవత్సరం	కేటాయింపులు (రూ. కోట్లల్లో)	ఖర్చు (రూ. కోట్లల్లో)
2015-16	8,561.61	7,974.81
2016-17	7,787.32	8,834.46
2017-18	8,744.14	9,411.44
2018-19	9,425.20	9,172.27
2019-20	7,781.57	9,196.96
2020-21	9,486.59	8,688.55
2021-22	10,205.40	8,999.27
2022-23	12,528.51	11.115.07
2023-24	14,488.24	-----------
2024-25	17,931.42	-----------

పోలింగ్ కేంద్రం వద్ద రైతుల నిరసన

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



కనుముకుల పోలింగ్ కేంద్రం సమీపంలో ధర్నా చేస్తున్న రైతులు

భూదాన్ పోచంపల్లి: పోలింగ్ కేంద్రం సమీపంలో తడిసిన ధాన్యం బస్తాలతో రైతులు ధర్నా చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి అధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకు ఓటు వేయమని సోమవారం రోడ్డుపై బైఠాయించి గంటసేపు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు వెంటనే లారీలను పంపించి కనుముకుల కేంద్రంలో తడిసిన 2800 బస్తాల ధాన్యాన్ని లిఫ్టింగ్ చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే రైతులు ధర్నా చేస్తున్న సమయంలో ఓటర్లు లేక పోలింగ్ కేంద్రం వెలవెలబోయింది. ధర్నా అనంతరం గ్రామస్తులు ఓటేశారు. మొత్తం 877 ఓట్లకుగాను 746 ఓట్లు పోలయ్యాయి.

పోలింగ్ వేళ.. విషాదం

- గుండెపోటుతో ఇద్దరు అధికారులు... ముగ్గురు ఓటర్లు మృతి
- పోలింగ్ అధికారికి పాముకాటు.. రిమ్స్‌లో చికిత్స

సాక్షి నెట్‌వర్క్: పోలింగ్ వేళ...రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. సోమవారం గుండెపోటుతో ఇద్దరు అధికారులు, ముగ్గురు ఓటర్లు మృతి చెందారు.



శ్రీకృష్ణ

- భద్రాద్రి కొత్తగూడెంజిల్లా చంద్రుగొండకు చెందిన పోలూరి శ్రీకృష్ణ (55) కొత్తగూడెం జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆయన అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంలోని దివ్యాంగుల ప్రత్యేక బూత్‌కు ఏపీఓగా నియమితులయ్యారు. విధుల్లో ఉండగానే గుండెపోటు వచ్చింది. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు ధ్రువీకరించారు.



విజయలక్ష్మి

- ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన గట్టు విజయలక్ష్మి (65) కాలినడకన భరత్‌నగర్‌లోని ఆంధ్ర యువతి మండలి పోలింగ్ కేంద్రానికి వచ్చింది. ఓటు వేసి బయటకు వస్తూ గేట్ వద్దనే సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా, గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు.
- సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన ఇప్పకాయల సరోజన (75) ఓటు వేసేందుకు పెద్దమ్మగడ్డ బాలుర పాఠశాల పోలింగ్ కేంద్రానికి వచ్చింది. ఓటు వేసి బయటకు వస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే ఆస్పత్రి తరలించగా, అప్పటికే ఆమె గుండెపోటుతో చనిపోయినట్టు వైద్యులు చెప్పారు.



సరోజన



గిర్మవ్వ

- నిజామాబాద్ జిల్లా పోతంగల్‌కు చెందిన శ్రీగంధం గిర్మవ్వ (73) ఆటో దిగి ఓటు వేయడానికి వెళుతుండగా తనకు నీరసంగా ఉందని చెబుతూ, ఆవరణలో కూర్చొని అక్కడే స్పృహ కోల్పోయింది. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్టు డాక్టర్ చెప్పారు.
- చంపాపేట మైనారిటీ పాఠశాలకు చెందిన ప్రిన్సిపల్ నరసింహ (45) ఉదయం రెడ్డి హిల్స్ కాలనీలోని పోలింగ్ బూత్‌కు చేరుకున్నారు. ఎండ వేడికి తట్టుకోలేక ఒక్కసారిగా కుప్పకూలి స్పృహ కోల్పోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు.



రిమ్స్‌లో ప్రఫుల్

- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అందర్‌బంద్ పోలింగ్ కేంద్రంలో ప్రఫుల్‌కూ డ్యూటీ పడింది. ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకున్నాడు. రాత్రి పోలింగ్ కేంద్ర ఆవరణలోని బాత్‌రూంకు వెళ్లే క్రమంలో పాము కాటు వేసింది. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

జైపూర్‌లో స్కూళ్లకు బాంబు బెదిరింపులు

జైపూర్: రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. నగరంలోని 56 స్కూళ్లకు బాంబులతో పేల్చేస్తామంటూ మెయిళ్లు అందడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 2008లో జైపూర్‌లో జరిగిన వరుస బాంబు పేలుళ్లలో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటనకు సోమవారంతో సరిగ్గా 16 ఏళ్లు. ఈ పరిణామం సంభవించడం గమనార్హం. జైపూర్‌లోని 56 స్కూళ్ల ఆవరణలో బాంబులను అమర్చామంటూ మెయిల్స్ అందడంతో యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాయి. తక్షణమే పోలీసులు ప్రత్యేక బృందాలతో అణువణువూ సోధించి, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేవని తేల్చారు.

సీఎం కార్యాలయంలో నాపై దాడి జరిగింది

ఆప్ ఎంపీ మలివాల్ ఆరోపణలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికారిక కార్యాలయంలో వ్యక్తిగత సిబ్బంది తనపై దాడి చేశారని ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్)కు చెందిన రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ ఆరోపించారు. ఇందుకు సంబంధించి పోలీసులకు ఆమె ఎటువంటి ఫిర్యాదు ఇవ్వకపోవడం గమనార్హం. 'సోమవారం ఉదయం 9.34 గంటల సమయంలో ఒక మహిళ సివిల్ లైన్స్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. ఢిల్లీ సీఎం నివాసంలో ఆమెపై దాడి జరిగిందని తెలిపారు. 10 గంటల సమయంలో ఎంపీ ఇక్కడికి వచ్చారు. సీఎం వ్యక్తిగత కార్యాలయం సిబ్బంది దాడి చేశారని ఆమె ఆరోపించారు. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలంటే దాడి జరిగినట్లుగా వైద్య పరీక్ష నివేదిక జత చేయాల్సి ఉంటుందని చెప్పాము. అయిదు నిమిషాలపాటు స్టేషన్‌లో ఉన్నారు. తర్వాత వచ్చి ఫిర్యాదు ఇస్తానంటూ ఆమె వెళ్లిపోయారు' అని నార్త్ జోన్ డీసీపీ ఎంకే మీనా తెలిపారు. అటుతర్వాత తమ ఫోన్‌కాల్స్‌కు, మెసేజీలకు స్వాతి మలివాల్ స్పందించలేదన్నారు. ఈ పరిణామంపై ఆప్ కార్యాలయం నుంచి గానీ, సీఎం నివాసం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడ లేదు.

కేజ్రీవాల్‌పై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కారణంగా ఢిల్లీ సీఎం పదవి నుంచి కేజ్రీవాల్‌ను తొలగించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. '' సీఎం పదవి నుంచి ఒక వ్యక్తిని తొలగించాలని కోరడంలో ఉన్న ఔచిత్యమేంటి? అయినా అరెస్ట్‌ను కారణంగా చూపి సీఎం పదవి నుంచి తొలగించాలన్న చట్ట నిబంధన ఏదీ లేదు. తొలగించాలని భావిస్తే సంబంధిత చర్యలు, నిర్ణయం తీసుకునే అధికారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉంటుంది. ఈ పిటిషన్‌ను మేము విచారణకు స్వీకరించట్లేము'' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల సుప్రీంకోర్టు ధర్మాసనం పిటిషనర్ కాంత్ భాటీ తరఫు న్యాయవాదికి సూచించింది. ఢిల్లీ హైకోర్టు ఇదే తరహా పిటిషన్‌ను కొట్టేస్తూ ఏప్రిల్ 10వ తేదీన ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కాంత్‌భాటీ సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేయడం తెల్సిందే. ఆనాడు ఢిల్లీ హైకోర్టు ఇలాంటి ఒక పిటిషన్‌ను కొట్టేస్తూ.. ' ఒకే విషయంపై పలువురు పిటిషన్లు వేస్తూనే ఉన్నారు. ఇది పార్లమెంట్ పరిధిలోని అంశం. ఇవేమీ జేమ్స్‌బాండ్ సినిమా సీక్వెల్స్ కావు. మళ్లీ మళ్లీ వేయడానికి' అని అసహనం వ్యక్తంచేసింది.

నాకూ బెయిలివ్వండి

సుప్రీంకోర్టులో సోరెన్ పిటిషన్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయడానికి వీలుగా తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందని సోరెన్ ప్రస్తావించారు. అదే తరహాలో తనకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్ జనవరి 31న అరెస్టయిన సంగతి తెలిసిందే. సోరెన్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 17వ తేదీలోగా స్పందించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి సూచించింది.

రాహుల్‌జీ... అభినవ్‌తో చర్చకు సిద్ధమా?

బీజేపీ సీనియర్ నేత తేజస్వీ సూర్య లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కీలక అంశాలు, ప్రజా సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రజల సమక్షంలో చర్చ జరపాలని సూచిస్తూ మాజీ న్యాయమూర్తులు రాసిన లేఖపై బీజేపీ సీనియర్ నేత తేజస్వీ సూర్య స్పందించారు. రాహుల్ గాంధీతో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ మేరకు సోమవారం లేఖ రాశారు. తమ పార్టీ తరఫున బీజేపీ యువమోర్చా ఉపాధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీకి చెందిన అభినవ్ ప్రకాశ్ చర్చలో పాల్గొంటారని ప్రతిపాదించారు. దళితుడైన అభినవ్ ప్రకాశ్ విద్యావంతుడని, ఆయనతో చర్చకు ముందుకు రావాలని లేఖలో రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ నాయకులు పిరికిపందలు

పాకిస్తాన్ అణుబాంబులకు భయపడుతున్నారు ● విపక్ష నేతలకు రాత్రిపూట పీడకలలు వస్తున్నాయి: మోదీ

ముజఫర్‌పూర్/హాజీపూర్/సరణ్: పిరికిపందలైన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాకిస్తాన్ అణుబాంబులకు భయపడుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ సహా విపక్ష 'ఇండియా' కూటమి నేతలు పాకిస్తాన్ అణుశక్తిని తలచుకొని చూసి బెంబేలెత్తిపోతున్నారని, వారికి రాత్రిపూట పీడకలలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. సోమవారం బిహార్‌లోని ముజఫర్‌పూర్, హాజీపూర్, సరణ్ లోక్‌సభ స్థానాల పరిధిలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రతిపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. పిరికిపందలు, భయస్థులైన మన ప్రతిపక్ష నాయకులు ఉగ్రవాదంపై పాకిస్తాన్‌కు క్లీన్‌చిట్ ఇస్తున్నారని మండిపడ్డారు. పాకపాకిస్తాన్ భూభాగంపై మన సైన్యం చేసిన సర్జికల్ దాడుల పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, సైనికుల సాహసాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. అణ్వాయుధాలను వదిలించుకోవాలంటూ వామపక్ష నాయకులు ఇస్తున్న పిలుపును ప్రధాన మంత్రి తప్పుపట్టారు. బహిరంగ సభల్లో ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

గాజులు కూడా లేవా!

''పాకిస్తాన్ గాజులు తొడుక్కోని లేదని మన విపక్ష నాయకులు అంటున్నారు. అయితే, ఆ దేశం గాజులు తొడుక్కునేలా చేస్తాం. కడుపు నింపుకోవడానికి పాకిస్తాన్‌కు తిండి లేదని, ఆహారా ధాన్యాలు లేవని నాకు తెలుసు. పాకిస్తాన్‌కు విద్యుత్ సైతం లేదు. గాజులు కూడా లేవన్న సంగతి ఇప్పుడు తెలిసింది. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికో ప్రధానమంత్రి మారుతారట! ఐదేళ్లకు ఐదుగురు ప్రధానమంత్రులు అనే ఫార్ములాను తీసుకొస్తున్నారు. నిజంగా అలా సంవత్సరానికో ప్రధానమంత్రి మారిపోతే దేశం ముందుకెళ్లడం సాధ్యమేనా? అలాంటి విధానం మనకు సరిపడదు. ప్రపంచదేశాల్లో మన ప్రతిష్ట పెరిగింది. అభివృద్ధి వేగవంతమైంది. మన దేశ ప్రతిష్టను ఇంకా పెంచడంతోపాటు ప్రగతిని కొనసాగించే ప్రభుత్వం కావాలి. అది బీజేపీ కూటమితోనే సాధ్యమవుతుంది. రాజకీయ నాయకుల నివాసాలు, కార్యాలయాల్లో దర్యాప్తు సంస్థలు సోదాలు చేసి, స్వాధీనం చేసుకున్న డబ్బంతా ముమ్మాటికీ పేదలకే చెందుతుంది. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల కార్యాచరణపై ప్రతిపక్ష నాయకులు గగ్గోలు పెడుతున్నారు. వారి అవినీతి, అక్రమ సొమ్మును స్వాధీనం చేసుకోవడమే ఇందుకు కారణం. గతంలో కాంగ్రెస్ పాలనలో ఈడీ కేవలం రూ.35 లక్షలు స్వాధీనం చేసుకుంది. ఒక స్కూల్‌బ్యాగ్‌లో ఆ డబ్బును సర్దొచ్చు. మేము అధికారంలోకి వచ్చాక ఈడీ రూ.2,200 కోట్లు స్వాధీనం చేసుకుంది. ఆ డబ్బును తరలించాలంటే 70 చిన్నపాటి ట్రక్కులు కావాలి. ప్రతిపక్ష నేతలకు వారసులు ఉన్నారు. ఆ వారసుల బాగు కోసమే వారు తపన పడుతుంటారు. నాకు వారసులు లేరు. సామాన్య ప్రజలే నా వారసులు. కాంగ్రెస్, ఆర్జేడీ వంటి విపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత విధించి, ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తున్నాయి. నేను బతికి ఉన్నంతకాలం ఇలాంటి ఆటలు సాగనివ్వను''. అని మోదీ వివరించారు.



పట్నా గురుద్వారాలో భక్తుల సేవలో మోదీ

ప్రధాని మోదీ సోమవారం బిహార్ రాజధాని పట్నాలోని తఖ్త్ శ్రీహరిమందిర్‌జీ పట్నా సాహిబ్ గురుద్వారాను దర్శించుకున్నారు. సంప్రదాయ తలపాగా ధరించి, దర్బార్ సాహిబ్‌లో సిక్కుల పవిత్ర గ్రంథం ఎదుట ప్రణమిల్లారు. ప్రార్థనలు చేశారు. అనంతరం వంటశాలలో గరిటె తిప్పారు. కూర వండారు. రొట్టెలు కాల్చారు. లంగర్‌లో భక్తులకు స్వయంగా ఆహారం వడ్డించారు. పట్నా సాహిబ్ గురుద్వారాను దర్శించుకోవడం, ఇక్కడ ప్రార్థనలు చేయడం గొప్ప ఆధ్యాత్మిక అనుభూతినిచ్చాయని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. సిక్కు గురువుల బోధనలు మనకి ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని, మనల్ని ముందుకు నడిపిస్తాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

నాలుగో దశలో 67.70% పోలింగ్

10 రాష్ట్రాలు,యూటీల్లోని 96 స్థానాల్లో పూర్తయిన ఎన్నికలు

స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో దశ పోలింగ్ స్వల్ప ఘర్షణ ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సోమవారం 10 రాష్ట్రాల్లోని 96 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రాత్రి 11.45 గంటల వరకు 67.70 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నిర్ణీత పోలింగ్ సమయం లోపు పోలింగ్ కేంద్రాల వద్ద వరసల్లో నిల్చున్న ఓటర్లను పోలింగ్‌కు అనుమతించారు. దీంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశముందని ఈసీ పేర్కొంది. పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 78.37 శాతం పోలింగ్ నమోదైంది. ''శ్రీనగర్ నియోజకవర్గంలో 37.98 శాతం పోలింగ్ రికార్డయింది. ఆర్టికల్ 370 రద్దుతర్వాత కశ్మీర్ లోయలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి. శ్రీనగర్‌లో 36 శాతం స్థాయిలో పోలింగ్ నమోదవడం ఇటీవలి దశాబ్దాల్లో ఇదే తొలిసారి'' అని ఈసీ ప్రకటించింది. ఈసారి లోక్‌సభ ఎన్నికలు ఏడుదశల్లో జరుగుతుండగా తొలి దశలో 66.14, రెండో దశలో 66.71, మూడో దశలో 65.68% పోలింగ్ నమోదైంది. నాలుగో దశలో 96 స్థానాలతో కలిపి ఇప్పటిదాకా 543 స్థానాలకుగాను 23 రాష్ట్రాలు,యూటీల్లో 379 స్థానాలకు పోలింగ్ ముగిసింది. వీటితోపాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం అసెంబ్లీ స్థానాలకు, ఒడిశాలో 28 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. 2019 ఎన్నికల్లో నాలుగో దశలో 71 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా 65.51% పోలింగ్ నమోదైంది.

పశ్చిమబెంగాల్‌లో ఘర్షణలు

పశ్చిమబెంగాల్‌లోని 8 నియోజకవర్గాల పరిధిలోని కొన్ని చోట్ల తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఘర్షణలకు దిగారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట దాకా ఈవీఎంల మొరాయింపు, పోలింగ్ ఏజెంట్ల అడ్డగింత తదితరాలకు సంబంధించి దాదాపు 1,700 ఫిర్యాదులు ఈసీకి అందాయి. ఓటర్లను మభ్యపెట్టారని, ఏజెంట్లపై దాడులు చేశారని టీఎంసీ, కాంగ్రెస్, బీజేపీ పరస్పరం వందలాది ఫిర్యాదులు చేశాయి. బర్ధమాన్‌లో బీజేపీ సీనియర్ నేత దిలీప్ ఘోష్‌పై రాళ్ల దాడి ఘటనలో ఇద్దరు సీఐఎస్ఎఫ్ జవాన్లు గాయపడ్డారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారని ఒడిశాలో ఇద్దరు పోలింగ్ అధికారులను ఈసీ సస్పెండ్ చేసింది. ఒడిశాలో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. జార్ఖండ్‌లో మారుమూల గ్రామాల ప్రజలు ఓట్లేయకుండా మావోయిస్టులు రోడ్లపై చెట్లు నరికి పడేయగా భద్రతాసిబ్బంది సమయానికి అన్నీ తొలగించారు. ఐదో దశ మే 20, ఆరో దశ మే 25, ఏడో దశ జూన్ ఒకటో తేదీన జరగనుంది. అన్నింటి ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపడతారు.

రాష్ట్రం	పోలింగ్ శాతం
ఆంధ్రప్రదేశ్	76.50
తెలంగాణ	64.93
బిహార్	57.06
జార్ఖండ్	65.20
మధ్యప్రదేశ్	70.98
మహారాష్ట్ర	59.64
ఒడిశా	73.97
ఉత్తరప్రదేశ్	58.05
పశ్చిమబెంగాల్	78.37
జమ్మూకశ్మీర్	37.98

రాయ్‌బరేలీ కోసం మేము.. అదానీ, అంబానీ కోసం మోదీ

రాయ్‌బరేలీ సభలో రాహుల్

రాయ్‌బరేలీ: రాయ్‌బరేలీ నియోజకవర్గ ప్రజల కోసం తన కుటుంబం మొత్తం పని చేస్తే, అదానీ, అంబానీల కోసం మోదీ చాలా చెమటోడ్చారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం రాయ్‌బరేలీలో జరిగిన సభలో రాహుల్ ప్రసంగించారు. '' రాయ్‌బరేలీలో నామినేషన్ వేశాక రాహుల్ ఆ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఇదే తొలిసారి. '' నానమ్మ ఇందిరా గాంధీ, నాన్న రాజీవ్‌గాంధీ, అమ్మ సోనియాగాంధీ అందరూ రాయ్‌బరేలీ ప్రజల జీవితాలను బాగుచేసేందుకు పాటుపడ్డారు. మా కుటుంబమంతా మీ కోసం పనిచేస్తే, మోదీ మాత్రం అదానీ, అంబానీల ప్రయోజనాలే పరమావధిగా పనిచేశారు. ఉపాధిహామీ పథకానికి 24 ఏళ్లకాలానికి ఖర్చయ్యే మొత్తానికి సరిసమానమైన బడాపారిశ్రామికవేత్తల రూ.16 లక్షల కోట్ల రుణాలను మోదీ ఒక్కదెబ్బతో మాఫీచేశారు. మోదీ హయాంలో రైతులు, నిరుద్యోగ యువత సమస్యలను జాతీయ మీడియా ఉద్దేశపూర్వకంగా చూపించలేదు. పారిశ్రామికవేత్తల కుటుంబాల ఆడంబర వివాహాలకే అగ్రతాంబూలం ఇచ్చాయి. ఆ వేడుకలనే ప్రసారంచేశాయి'' అని ఆరోపించారు.

పెళ్లి ఎప్పుడంటే?

సోమవారం రాయ్‌బరేలీలో జరిగిన ప్రచార సభలో రాహుల్ మళ్లీ అదే ప్రశ్నను ఎదుర్కొన్నారు. రాహుల్ మాట్లాడేటప్పుడు సభావేదికపై సోదరి ప్రియాంకా గాంధీ కూడా ఉన్నారు. 'నిన్ను వీళ్లేదో ప్రశ్న అడుగుతారట. సమాధానం చెప్పు' అని ప్రియాంక చెప్పగా, ఏంటా ప్రశ్న అని రాహుల్ సభికులను అడిగారు. పెళ్లి ఎప్పుడు? అని ఒక కార్యకర్త అడిగిన ప్రశ్నకు రాహుల్ ఈసారి కొత్త సమాధానం చెప్పారు. ''తొందరపడాలిక. త్వరలోనే చేసుకుంటా'' అని అందరినీ ఆశ్చర్యపరిచారు. గతంలో పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడల్లా '' ఇన్నాళ్లు ఎందుకో పెళ్లి గురించి అంతగా పట్టించుకోలేదు', ' పెళ్లి మీదకు మనసు పోలేదు', ' మీరే అమ్మాయిని చూడండి', ' అమ్మకు నచ్చితే ఓకే' అంటూ వేర్వేరు సమాధానాలు చెప్పిన రాహుల్ సోమవారం ఇలా కొత్త సమాధానం చెప్పారు. తర్వాత ప్రియాంకను పొగిడారు.'' దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేస్తూ ఎట్టకేలకు రాయ్‌బరేలీకి వచ్చా. కానీ ప్రియాంక మాత్రం మొదట్నుంచీ రాయ్‌బరేలీలో ప్రచార బాధ్యతలు దగ్గరుండి చూసుకుంటోంది. ఆమెకు నా కృతజ్ఞతలు' అని ఆమెను అభినందించారు.



'వాళ్లేదో అడుగుతారట.. జవాబు చెప్పు' అంటూ రాహుల్‌ను ఆటపట్టిస్తున్న ప్రియాంక

ముంబై అతలాకుతలం

బీభత్సం సృష్టించిన గాలివాన
- పెట్రోల్ బంక్‌పై కుప్పకూలిన భారీ హోర్డింగ్
- 9 మంది దుర్మరణం, 65 మందికి గాయాలు
- హోర్డింగ్ కిందే కనీసం మరో 30 మంది!

ముంబై: అకాల వర్షాలు, దుమ్మూ ధూళితో కూడిన బలమైన ఈదురుగాలులతో ముంబై సోమవారం అతలాకుతలమైంది. నగరంలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. ముంబైవ్యాప్తంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు గంటల పాటు నరకం చవిచూశారు. దుమ్ముతో కూడిన గాలి దుమారం ధాటికి చాలామంది వాహనాలను వదిలి తలదాచుకోవడానికి చెల్లాచెదురయ్యారు. ఎక్కడ చూసినా వరద నీరు రోడ్లను ముంచెత్తడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘట్కోపర్ ప్రాంతంలోని చెద్దానగర్ జంక్షన్ వద్ద 100 అడుగుల భారీ అక్రమంగా హోర్డింగ్ ఈదురుగాలుల ధాటికి సాయంత్రం కుప్పకూలింది. అది పక్కనే ఉన్న పెట్రోల్ బంకుపై పడటంతో తొమ్మిది మంది దుర్మరణం పాలయ్యారు. హోర్డింగ్ కింద 100 మందికి పైగా చిక్కుకున్నట్లు అధికారులు చెబుతున్నారు! గాయపడ్డ 65 మందిని ఆసుపత్రికి తరలించారు. ఇంకా హోర్డింగ్ కిందే చిక్కుకున వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్టు బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషణ్ గగ్రానీ చెప్పారు. జాతీయ విపత్తు స్పందన బృందంతో పాటు అధికార యంత్రాంగం హుటాహుటిన రంగంలోకి దిగింది. భారీ హైడ్రా క్రేన్లు తదితరాలతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఘటన జరిగినప్పుడు పెట్రోల్ బంక్‌లో కనీసం 30కి పైగా ఆటోలు, బస్సులు, లగ్జరీ కార్లున్నట్టు ఒక కానిస్టేబుల్ తెలిపారు. వాటిలో పలు వాహనాలు హోర్డింగ్ కిందే చిక్కుకుపోయినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగేలా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రమాదస్థలిని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు.



పక్కకు ఒరుగుతున్న హోర్డింగ్



నేలకూలిన హోర్డింగ్

రైళ్లు, విమానాలకు అంతరాయం

గాలివాన ధాటికి ముంబైలో పలు ఇతర చోట్ల కూడా బిల్ బోర్డులు, హోర్డింగులు కూలిపడ్డాయి. వడాల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెటల్ పార్కింగ్ టవర్ కూలి ముగ్గురు గాయపడ్డారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. చెట్లు నేలకొరిగిన ఉదంతాల్లో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కనీసం మరో నలుగురు మరణించినట్టు సమాచారం. ప్రతికూల వాతావరణం వల్ల సోమవారం గంటపాటు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. గాలి దుమారం ధాటికి ఏమీ కనిపించని పరిస్థితి నెలకొనడంతో పలు విమానాలను దారి మళ్లించారు. మెట్రో, లోకల్ రైళ్ల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. నగరంలో సోమవారం అర్ధరాత్రి దాకా ఈదరగాలులు, ఉరుములు, మెరుపులతో వాన కొనసాగింది. థానె, పాల్ఘర్ తదితర ప్రాంతాల్లోనూ గాలివాన బీభత్సం సృష్టించింది.

రష్యా నూతన రక్షణ మంత్రిగా ఆంద్రీ బెలౌసోవ్

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా ఐదో విడత బాధ్యతలు చేపట్టిన వ్లాదిమిర్ పుతిన్ మంత్రివర్గాన్ని పునర్ వ్యవస్థీకరించారు. రాజ్యాంగం ప్రకారం శనివారం మంత్రివర్గం మొత్తం రాజీనామా చేసింది. పాత కేబినెట్‌లో రక్షణ మంత్రి సెర్గీ షోయిగుకు మాత్రమే అవకాశమివ్వలేదు. రక్షణ శాఖ సహాయ మంత్రి తిమూర్ ఇవనోవ్ అవినీతి ఆరోపణలతో అరెస్ట్ కావడంతో షోయిగుకు పదవీ గండం తప్పదని కొన్ని రోజులుగా వస్తున్న వార్తలు నిజమయ్యాయి. ఆదివారం అధ్యక్షుడు పుతిన్ నూతన రక్షణ మంత్రిగా ఆంద్రీ బెలౌసోవ్(65)ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. షోయిగుకు రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించారు. ఆంద్రీ బెలౌసోవ్ 2020 నుంచి ఫస్ట్ డిప్యూటీ ప్రధానమంత్రిగా కొనసాగుతున్నారు. అంతకుముందు ఏడేళ్లపాటు పుతిన్ సలహాదారుగా ఉన్నారు. కొత్త ఆవిష్కరణలకు, నూతన ఆలోచనలకు అనుగుణంగా రక్షణ శాఖను తీర్చిదిద్దేందుకే బెలౌసోవ్‌ను నియమించినట్లు అధ్యక్ష భవనం తెలిపింది.

హెచ్‌డీ రేవణ్ణకు బెయిల్

బెంగళూరు: కిడ్నాప్ కేసులో అరెస్టయిన మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు, జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఈనెల 4న రేవణ్ణను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

ఓటుకు 'గుర్తు'గా




బిహార్‌లోని సమస్తిపూర్‌లో..



పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌లో..



తిరుపతిలో..



మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో రెండు చేతులూ లేని దివ్యాంగుడు.. కాలికి ఉన్న సిరా గుర్తును చూపిస్తున్న దృశ్యం

ఎలక్షన్ బీట్

మహిళలకు 'మహాలక్ష్మి' గ్యారెంటీ: సోనియా

న్యూఢిల్లీ: ప్రస్తుత కష్టకాలంలో మహిళలు పడుతున్న అవస్థలను కాంగ్రెస్ పార్టీ తొలగిస్తుందని, ఇదే పార్టీ గ్యారెంటీ అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ చెప్పారు. ఈ మేరకు సోమవారం సోనియా ఒక వీడియో సందేశం ఇచ్చారు. '' ప్రియమైన సోదరీమణులారా.. మహిళలు దేశ స్వాతంత్రోద్యమం నుంచి నవభారత నిర్మాణం దాకా తమ వంతు అద్భుత తోడ్పాటునందించారు. అయితే మహిళలు ప్రస్తుతం ద్రవ్యోల్బణం మాటున సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. మహిళల కష్టానికి సరైన న్యాయం దక్కేలా కాంగ్రెస్ విప్లవాత్మకమైన గ్యారెంటీని ఇస్తోంది. కాంగ్రెస్ మహాలక్ష్మీ పథకం ద్వారా పేద కుటుంబంలోని మహిళకు ఏటా రూ.1లక్ష సాయం అందించనుంది. ఇప్పటికే అమలవుతున్న పథకాలతో కర్ణాటక, తెలంగాణలో ప్రజల జీవితాలు మెరుగయ్యాయి. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం, ఆహార భద్రతా చట్టాలలాగే కాంగ్రెస్ తాజాగా కొత్త పథకాన్ని ముందుకు తేనుంది. కష్టకాలంలో ఎల్లప్పుడూ కాంగ్రెస్ ఆపన్నహస్తం అందిస్తుంది' అని ముగించారు. సోనియా సందేశాన్ని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీ 'ఎక్స్'లో షేర్‌చేశారు. సోనియా సందేశంపై రాహుల్ స్పందించారు. '' పేద కుటుంబాల మహిళలు ఒక్కటి గుర్తుంచుకోండి. మీ ఒక్క ఓటు ఏటా మీ ఖాతాలో జమ అయ్యే రూ.1 లక్షతో సమానం. పెరిగిన ధరవరలు, నిరుద్యోగ కష్టాల్లో కొట్టుమిట్లాడుతున్న పేద మహిళలకు మహాలక్ష్మీ పథకం గొప్ప చేయూత. అందుకే ఓటేయండి' అని అన్నారు.

నేడు వారణాసిలో మోదీ నామినేషన్

హాజరవనున్న 12 మంది సీఎంలు, కేంద్ర మంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ మంగళవారం యూపీలోని వారణాసి లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అట్టహాసంగా జరిగే ఈ కార్యక్రమంలో బీజేపీ పాలిత, మిత్రపక్షాల రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

సీఎంలకు ఆహ్వానాలు

వారణాసిలో ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆహ్వానాలు అందుకున్న ముఖ్యమంత్రుల్లో యోగి (ఉత్తరప్రదేశ్), నితీశ్ కుమార్ (బిహార్), పుష్కర్ ధామి (ఉత్తరాఖండ్), మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్), విష్ణు దేవ్ సాయ్ (ఛత్తీస్‌గఢ్), ఏక్‌నాథ్ షిండే (మహారాష్ట్ర), భజన్ లాల్ శర్మ (రాజస్తాన్), హిమంత బిశ్వ శర్మ (అస్సాం), నయాబ్ సైనీ (హరియాణా), ప్రమోద్ సావంత్ (గోవా), ప్రేమ్ సింగ్ తమంగ్ (సిక్కిం), మాణిక్ సాహా (త్రిపుర) ఉన్నారు. ఎన్డీఏ పక్షాల నేతలు, కేంద్ర మంత్రులు పాల్గొననున్నారు.

ప్రజలు ఎన్‌డీఏతో ఉన్నారు: మోదీ

న్యూఢిల్లీ: నాలుగో దశలో 64 శాతానికిపైగా పోలింగ్ నమోదవడంపై ప్రధాని మోదీ స్పందించారు. '' ఈరోజు(సోమవారం) ఓటేసిన ఓటర్లకు నా కృతజ్ఞతలు. ఇంతటి చక్కటి పోలింగ్ శాతం చూస్తుంటే సుస్థిరాభివృద్ధి ప్రభుత్వం వైపే ఓటర్లు మొగ్గుచూపుతున్నట్లు అర్థమవుతోంది. ప్రజలు ఎన్‌డీఏతోనే ఉన్నారు. విపక్షాల కూటమి గురించి జనం మాట్లాడుకోవడం మానేశారు. గతంలో ఎన్నడూలేనంతగా శ్రీనగర్‌లో జనం మెరుగైన పోలింగ్‌ను నమోదుచేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ప్రజలు తమ ఆకాంక్షలు నెరవేరబోతున్నాయని ఇలా పోలింగ్ ద్వారా వ్యక్తపరిచారు' అని అన్నారు.

మోదీ గెలిస్తే ఇక ఎన్నికలుండవు: ఖర్గే

హజారీబాగ్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ప్రధాని మోదీ గెలిస్తే భవిష్యత్తులో ఇక ఎన్నికలనేవే ఉండవని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రాథమిక హక్కులు లేకుంటే బానిసలుగా మారిపోతారన్నారు. జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ఖర్గే మాట్లాడారు. మాజీ సీఎం హేమంత్‌ను జైలుకు పంపించారు.. చేతనైతే అదానీ, అంబానీలను అరెస్ట్ చేయాలని మోదీకి సవాల్ విసిరారు. తాము అధికారంలోకి వస్తే బీజేపీ అరెస్ట్ చేయించిన కూటమి నేతలకు స్వేచ్ఛ కల్పిస్తామన్నారు.

సుశీల్ కుమార్ మోదీ కన్నుమూత

పట్నా: బిహార్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోదీ(72) సోమవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. రాజ్యసభ ఎంపీగాను, 2004 ఎన్నికల్లో భాగల్పూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2005లో ఎంపీ పదవికి రాజీనామా చేసి, ఎమ్మెల్సీగా ఎన్నికై, డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. సుశీల్‌కుమార్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 14 | మే | 2024


కరీంనగర్ నగరపాలక కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటేసిన కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు


మొదటిసారి ఓటేసిన యువతుల సెల్ఫీ


ఈవీఎంలతో వస్తున్న సిబ్బంది

ఓటెత్తిన జనం!


వీణవంకలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

- కరీంనగర్‌లో 72.33శాతం నమోదు
- పెద్దపల్లిలో 68.80 శాతం పోలింగ్
- ఆ తర్వాత నిజామాబాద్‌లో అత్యధికంగా..
- మూడు ఎంపీ స్థానాల్లో ఎన్నికలు ప్రశాంతం
- ఉదయం భారీగా.. ఆ తర్వాత క్రమంగా తగ్గిన వైనం
- మంథనిలో సాయంత్రం నాలుగు గంటలకే ముగిసిన ఎన్నికలు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- భారీ భద్రత మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంల తరలింపు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: సార్వత్రిక పార్లమెంటు ఎన్నికలు ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు 5 గంటల వరకు పెద్ద ఎత్తున ప్రజలు ఓటేసేందుకు ఆసక్తి చూపారు. అన్ని నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు గ్రామీణులు భారీగా కదలివచ్చి ఓటేశారు. కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పరిధిలోని 13 నియోజకవర్గాల పరిధిలో ఉదయం పూట భారీగా ఆసక్తి చూపించారు. ఎండతీవ్రత కారణంగా మధ్యాహ్నం మందకొడిగా సాగిన ఓటింగ్.. సాయంత్రానికి తిరిగి ఊపందుకుంది. భారీ బందోబస్త్ మధ్య జరిగిన ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోవడం విశేషం. కొన్ని మండలాల్లో అక్కడక్కడా సాంకేతిక సమస్యలతో ఈవీఎంలు మొరాయింపులు మినహా ఎన్నికలు సజావుగా సాగాయి. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన మంథనిలో ఎన్నికలు సాయంత్రం 4 గంటలకే ముగిశాయి. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు సాగాయి. మొత్తం మీద కరీంనగర్‌లో 72.33 శాతం, పెద్దపల్లిలో 68.80 శాతం నిజామాబాద్ 67.96 శాతం పోలింగ్ నమోదైంది. అనంతరం భారీ బందోబస్తు మధ్య ఈవీఎంలను జీపీఎస్ కలిగిన వాహనాలలో స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ఈవీఎంలను మూడంచెల భద్రత మధ్య పహారా ఏర్పాటు చేశారు.

మొరాయించిన ఈవీఎంలు..

జగిత్యాల: జిల్లాలోని పెగడపల్లి మోడల్ పోలింగ్ కేంద్రంలో కంట్రోల్ యూనిట్ ప్యాడ్ సమస్యతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. దోమలకుంట 251 నంబరు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది.

కోరుట్ల: అల్లమయ్యగుట్ట ప్రాంతంలోని 160 నంబరు పోలింగ్ కేంద్రంలోని ఏవీఎం పనిచేయలేదు. ఎన్నికల అధికారులు మరో ఈవీఎం సాయంతో పోలింగ్ నిర్వహిస్తున్నారు.

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కిసాన్‌దాస్‌పేట్‌లో మాక్ పోలింగ్ సందర్భంగానే ఈవీఎం మొరాయించింది. దానిస్థానంలో మరోటి ఏర్పాటు చేయగా ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ముస్తాబాద్‌లోనూ ఇదే పరిస్థితి ఎదురైంది.

వేములవాడ: పట్టణంలోని 165, 176 నంబర్ పోలింగ్ కేంద్రాల్లో అర్ధగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. రుద్రంగిలో 93, కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో 225, 228, చందుర్తి మండలం మర్రిగడ్డలో 101, కట్టలింగంపేట లో 111 పోలింగ్ కేంద్రాల్లో కాసేపు ఈవీలు పనిచేయలేదు. అధికారులు సమస్య పరిష్కరించడంతో పోలింగ్ సజావుగా సాగింది.

మానకొండూరు: వేగురుపల్లిలో 0.15గంటల పాటు ఈవీఎం మొరాయించింది. శంకరపట్నం మండలం మొలంగూర్‌లో గంటపాటు ఈవీఎం పనిచేయలేదు. దానిస్థానంలో కొత్తది ఏర్పాటుచేశారు. గన్నేరువరంలోని 190, 192 పోలింగ్ కేంద్రాల్లోనూ ఈవీఎంలు మొరాయించాయి. కాసింపేట 208 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించగా.. 0.45గంటల పాటు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. చిగురుమామిడి మండలం సీతారాంపూర్ చిన్నములుకనూరులో రెండు ఈవీఎంలు కాసేపు నిలిచిపోయాయి.

హుజూరాబాద్: సైదాపూర్ మండలం బొమ్మకల్‌లో మూడు ఈవీఎంలు పోలింగ్ ప్రారంభంలో మారాయించగా అర్ధగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.

చొప్పదండి: రాగంపేట గ్రామంలోని 121వ పోలింగ్ కేంద్రంలో వీవీ ప్యాట్ మొరాయించింది. సుమారు గంటసేపు పోలింగ్ నిలిచిపోయింది. అధికారులు సమస్య పరిష్కరించి పోలింగ్ పునరుద్ధరించారు.

పెద్దపల్లి జిల్లా: పెద్దపల్లి, రామగుండం, మంథనిలో పలుచోట్ల ఈవీఎంలు కాసేపు మొరాయించచాయి. అధికారులు సాంకేతిక సమస్యను వెంటనే సరిచేయడంతో పోలింగ్ సజావుగా సాగింది.

ఆసక్తి చూపిన యువత

ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువత ఆసక్తి చూపింది. ముఖ్యంగా తొలిసారిగా ఓటు హక్కు వచ్చిన యువతి, యువకులు ఉత్సాహంగా ఓటు వేశారు. మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మహిళల క్యూలైన్లు ఎక్కువగా కనిపించాయి. గతంతో పోల్చితే మహిళలు ఓటింగ్‌లో ఎక్కువగా పాల్గొనటంతోనే పోలింగ్ శాతం పెరిగనట్లు తెలుస్తోంది. దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణాలు, వీల్‌చైర్స్ ఏర్పాట్లు ఆటోల ద్వారా రవాణా, వలంటీర్ల సహాయం ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.


చైతన్యపురి సాధన స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్


క్రిస్టియన్‌కాలనీ శ్రేయ ఒకేషనల్ కాలేజీలో కుటుంబ సభ్యులతో ఓటేసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్


ముకరంపుర స్కూల్‌లో ఓటేసిన బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ కుటుంబం


క్రిస్టియన్‌కాలనీ శ్రేయ ఒకేషనల్ కాలేజీలో ఓటేసిన కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కుటుంబం


పచ్చునూర్‌లో ఓటేసిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబం


గంగాధర మధురానగర్‌లో ఓటు వేస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కరీంనగర్ భగత్‌నగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్ సునీల్‌రావు కుటుంబం


వీణవంకలో కుటుంబ సభ్యులతో ఓటు వేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

పోలింగ్ శాతం (రెండు గంటలకోసారి)

కరీంనగర్:

నియోజకవర్గం	ఓటర్లు	9.00	11.00	1.00	3.00	5.00
కరీంనగర్	367353	10.23	20.78	37.95	47.45	60.35
చొప్పదండి	233546	10.9	29.09	48.4	61.58	75.71
వేములవాడ	226188	12.1	30.17	50.11	62.45	74.43
సిరిసిల్ల	246547	7.23	27.8	46.19	55.67	74.83
మానకొండూర్	225386	10.06	24.96	49.1	62.55	77.73
హుజూరాబాద్	250429	9.45	22.89	39.66	60.15	73.01
హుస్నాబాద్	247701	11.84	30.35	48.83	63.98	76.93

నోట్: కరీంనగర్ నియోజకవర్గంలో సగటు పోలింగ్ 72.33 శాతం నమోదైంది.

పెద్దపల్లి :

నియోజకవర్గం	ఓటర్లు	9.00	11.00	1.00	3.00	5.00	6.00
చెన్నూరు	19,3778	9.49	26.35	45.45	58.65	68.00	68.13
బెల్లంపల్లి	17,6514	12.12	30.52	50.42	63.00	70.53	70.53
మంచిర్యాల	27,8738	10.49	24.87	41.40	52.97	59.78	59.78
ధర్మపురి	23,0786	8.70	28.11	47.15	60.23	69.83	73.34
రామగుండం	21,9723	7.64	21.46	38.78	47.10	55.18	61.59
మంథని	23,9699	10.17	27.41	48.21	56.2	61.55	69.90
పెద్దపల్లి	25,7192	9.24	25.57	44.40	55.6	64.80	71.34
మొత్తం	15,96,430	9.69	26.33	45.12	56.25	63.86	68.80

నిజామాబాద్ :

నియోజకవర్గం	ఓటర్లు	9.00	11.00	1.00	3.00	5.00
కోరుట్ల	245249	10.75	29.1	47.77	60.44	70.07
జగిత్యాల	236675	10.42	30.1	45.94	58.93	68.55

నోట్: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో సాయంత్రం 5.00 గంట వరకు సగటు పోలింగ్ 67.96 శాతం నమోదైంది.


సుభాష్‌నగర్‌లోని కేంద్రంలో ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి


ఈవీఎంలను ఎస్సారార్ కళాశాలలో అప్పగిస్తున్న సిబ్బంది


కేశవపట్నం పోలింగ్ బూత్‌లో మహిళా ఓటర్లకు పసుపుకుంకుమతో మర్యాదపూర్వకంగా స్వాగతం పలుకుతున్న సిబ్బంది


వెదిరలో ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద కుటుంబ సభ్యులు

న్యూస్‌రీల్

నేడు అమెరికాకు పొన్నం



కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. మంగళవారం అమెరికాకు వెళ్లనున్న పొన్నం ప్రభాకర్ తిరిగి వచ్చేనెల ఒకటి హైదరాబాద్ రానున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'నవోదయ' ప్రతిభ

చొప్పదండి: సీబీఎస్ఈ ఫలితాల్లో చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయం వంద శాతం ఉత్తీర్ణతను నమోదు చేసింది. పదో తరగతి, పన్నెండవ తరగతి 2023–24 సీబీఎస్ఈ ఫలితాలను సోమవారం ప్రిన్సిపాల్ మంగతాయారు విడుదల చేశారు. పదో తరగతి తెలుగులో ఆరుగురు, గణితంలో ఏడుగురు, సాంఘీక శాస్త్రంలో ఇద్దరు విద్యార్థులు వందకు వంద మార్కులు సాధించారు. వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

కరీంనగర్‌లో కమల వికాసం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్‌లో కమల వికాసం కనిపించిందని, బీజేపీకి బంపర్ మెజార్టీ ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే తెలంగాణలోనూ మెజార్టీ సీట్లు తథ్యమన్నారు. బీజేపీ గెలుపును సీఎం రేవంత్‌రెడ్డే ధ్రువీకరించారని పేర్కొన్నారు. ఓటమి ఖాయమనే టెన్షన్ సీఎం ముఖంలోనే కన్పించిందన్నారు. ఆ కోపంతోనే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మాట్లాడారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలని హితవుపలికారు.

ఎన్నికల సిబ్బంది భేష్

- ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి


ఓటేసిన కలెక్టరేట్ యువ ఉద్యోగులు, అధికారులు

కరీంనగర్ అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో సిబ్బంది పనితీరు బాగుందని ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల తీరును పరిశీలించారు. నగరంలోని మహిళా డిగ్రీ కళాశాల, ముకరంపురలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వాణినికేతన్ డిగ్రీ కళాశాలతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సుభాష్‌నగర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలో ఉన్న ట్రాన్స్‌జెండర్లంతా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. డీఆర్డీవో శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, స్వీప్ నోడల్ అధికారి రామానుజచారి ఉన్నారు.

ప్రశాంత పోలింగ్‌కు ప్రత్యేక చర్యలు

- సీపీ అభిషేక్ మహంతి


హుజూరాబాద్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరుగగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీపీ ఆదేశాల మేరకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. 2,500 మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా 54 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా పలు కేంద్రాలను సీపీ సందర్శించారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్ ప్రభుత్వ పాఠశాల, సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాల తదితర పోలింగ్ కేంద్రాలను సీపీ అభిషేక్ మహంతి సందర్శించి సిబ్బందిగి తగు సూచనలు చేశారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. పోలింగ్‌కేంద్రాల వద్ద సమస్యలు ఎదురయితే వాటి పరిష్కారానికి రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను కేటాయించినట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టినట్లు సీపీ వెల్లడించారు.

స్ట్రాంగ్‌రూంలో భవితవ్యం


ఈవీఎంకు సీల్ వేస్తున్న పోలింగ్ సిబ్బంది

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తవ్వడంతో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠకు తెరలేచింది. బయటకు ధీమాగా ఉన్న లోలోపల అన్ని పార్టీల అభ్యర్థులకు ఎక్కడో ఓటమి భయం వెంటాడుతూనే ఉంది. జూన్4న జరిగే కౌంటింగ్‌లో విజేతలెవరో, వెనుకబడేదెవరో తేలనుంది. ఇక జిల్లాలో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగడంతో అధికారులు ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాలను జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం


భూమయ్య (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తుర్కపల్లికి చెందిన అంకని భూమయ్య(56) అనే రైతు రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. భూమయ్య సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై పొలం పనులకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా వాహనం అదుపుతప్పి, కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి(రామగుండం): మండలంలోని ఈసాలతక్కళ్లపల్లికి చెందిన బానోతు తిరుపతి(35) ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసే తిరుపతికి రామగుండంకు చెందిన సరితతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సరిత 15 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తిరుపతి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి ఇంటి ఎదుట ఉరేసుకున్నాడు. స్థానికులు సోమవారం ఉదయం గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కానీ, మృతదేహం వేలాడి ఉన్న తీరు, మృతుడి కాలికి గాయం ఉండటంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, పోలీసులు తిరుపతి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం అతని మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని బిహార్‌వాసి మృతి


సంజీవ్ మిశ్రా (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని పశ్చిమ చంపారన్ జిల్లాకు చెందిన సంజీవ్ మిశ్రా హుజూరాబాద్‌లోని ఓ సీడ్ కంపెనీలో ప్రొడక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులతో స్థానికంగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు విధుల్లో భాగంగా జమ్మికుంట మండలంలోని నగురం గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా రాంపూర్‌లో హుజూరాబాద్–జమ్మికుంట ప్రధాన రహదారిపై వాహనం అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజీవ్ మిశ్రా ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంట ఉన్న తోటి ఉద్యోగులు అతని భార్య మమత మిశ్రాకు సమాచారం అందించారు. అనంతరం బాధితుడిని హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపడి ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మల్ల్యాపల్లెలో బీరం లింగారెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దు ఆదివారం రాత్రి పిడుగుపడి, మృతి చెందింది. దీంతో బాధితుడు కంటతడి పెట్టాడు. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం సాయం చేసి, ఆదుకోవాలని కోరాడు.

పోలింగ్ బూత్‌లో సెల్ఫీ దిగిన వ్యక్తిపై కేసు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వేములకుర్తిలో ఓ వ్యక్తి ఓటు వేస్తూ సెల్ఫీ దిగడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములకుర్తికి చెందిన రెడ్డవేన జయరాజు సోమవారం 8వ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళ్లాడు. ఈవీఎంల వద్ద తన ఫోన్‌లో సెల్ఫీ తీసుకొని, వెళ్లిపోయాడు. ఈ దృశ్యం అక్కడ అమర్చిన వెబ్ కెమెరాలో కనిపించడంతో కలెక్టరేట్ అధికారులు విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో జయరాజును అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓటు వేస్తూ తీసిన వీడియోలు వైరల్

- ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం 7.40 గంటలకు సమీరొద్దీన్ ఓటు వేస్తూ ఈవీఎం కనిపించేలా ఫోన్‌లో వీడియో తీశాడు. దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి కుమారస్వామి ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. అలాగే, జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ఖిలాగడ్డ ప్రాంతానికి చెందిన నదీమ్ అర్షన్ ఓటు వేస్తూ వీడియో తీసుకున్నాడు. దాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ చేశాడు. దీంతో అతనిపైనా కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

హరిదాస్‌నగర్‌లో పోలీసుల లాఠీచార్జి

- బీజేపీ బూత్ అధ్యక్షుడితోపాటు ఇద్దరిపై దాడి
- పోలీసులతో గ్రామస్తులు, నాయకుల వాగ్వాదం
- సీఐ నచ్చజెప్పడంతో సద్దుమణిగిన వివాదం


లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్‌లో ఇద్దరు బీజేపీ నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ సంఘటన గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. హరిదాస్‌నగర్‌లో సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సై నరేశ్ ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రం సమీపంలో బీజేపీ బూత్ అధ్యక్షుడు మహేశ్, నాయకుడు పూర్ణచందర్ తమ పార్టీ అభ్యర్థి బండి సంజయ్‌కి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు. దీంతో వారు సమీపంలోని ఓ ఇంటికి వెళ్లారు. ఎస్సై, పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి, లాఠీలతో ఆ ఇద్దరిపై దాడి చేశారు. ఓ మహిళతో దురుసుగా ప్రవర్తించి, నెట్టివేశారు. ఆగ్రహించిన గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, గ్రామస్తులు ఒక్కటై, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒకానొక స్థితిలో దాడి చేసే వరకు వెళ్లారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో సీఐ శ్రీనివాస్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని, మాట్లాడారు. ట్రాఫిక్ ఎస్సైని అక్కడి నుంచి పంపించేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఎస్సై తీరు, సంఘటనకు సంబంధించిన వివరాలపై ఎస్పీ విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ కార్యకర్తపై 'సీఆర్‌పీఎఫ్' దాడి


ఫిరోజ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న విప్ శ్రీనివాస్

వేములవాడ: సీఆర్పీఎఫ్ పోలీసుల దాడిలో వేములవాడ సుభాష్‌నగర్ చౌరస్తాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఫిరోజ్ గాయపడ్డాడు. బాధితుడి వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఫిరోజ్, అతని సోదరుడు ఇంతియాజ్ తమ ఇంటి ముందు కూర్చున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన పోలీసులను చూసి, లోపలికి వెళ్లారు. ఎస్పీ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు అక్కడికి చేరుకొని, ఫిరోజ్‌పై దాడి చేశాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బాధితుడిని హుటాహుటిన స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అకారణంగా దాడి చేసిన పోలీసు బలగాలపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఫోన్‌లో బాధితుడిని పరామర్శించారు. పోలీసులు దాడి చేయడం, ఎస్పీ వాహనం నిలిచిన సీసీ కెమెరా ఫుటేజీలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

బీజేపీ కార్యకర్తను ఢీకొన్న టాటాఏస్

- జెడ్పీటీసీ సభ్యుడు, మరో ముగ్గురిపై కేసు


కాలు విరిగిన మల్లేశం

కథలాపూర్(వేములవాడ): టాటాఏస్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ బీజేపీ కార్యకర్త కాలు విరిగింది. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. బాధితుడి వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలంలోని చింతకుంటకు చెందిన బీజేపీ కార్యకర్త నేతుల మల్లేశంను సోమవారం స్థానిక పోలింగ్ కేంద్రం సమీపంలో టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులే ఈ పని చేయించారని ఆరోపిస్తూ బాధితుడు ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. మల్లేశంను చికిత్స నిమిత్తం కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. చింతకుంటకే చెందిన బీజేపీ కార్యకర్త కమలాకర్ ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్‌కు చెందిన కథలాపూర్ జెడ్పీటీసీ సభ్యుడు నాగం భూమయ్య, చింతకుంటకు చెందిన టాటాఏస్ డ్రైవర్ మహేశ్, గంగమల్లయ్య, గంగాధర్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు గ్రామానికి చేరుకొని, కార్యకర్తలతో చర్చించారు. ప్రమాదానికి కారణమైనవారిపై కఠినచర్యలు తీసుకోవాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

3 కిలోమీటర్లు వెళ్లి.. ఓటేశారు


ఓటు వేసేందుకు వెళ్తున్న గ్రామస్తులు

- మొల్లపల్లి గ్రామస్తులకు పాపయ్యపల్లిలో పోలింగ్ బూత్ ఏర్పాటు
- ఇబ్బంది పడుతున్నామని ఆవేదన

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని బిజిగిరిషరీఫ్ పంచాయతీ పరిధి మొల్లపల్లికి చెందిన 170 మంది ఓటర్లు సోమవారం 3 కిలోమీటర్లు వెళ్లి, పాపయ్యపల్లిలో ఓటు వేశారు. గ్రామంలోగానీ, బిజిగిరిషరీఫ్ పంచాయతీ పరిధిలో గానీ పోలింగ్ బూత్ ఏర్పాటు చేయకపోవడంతో ఎన్నికల సమయంలో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని గ్రామ కో–ఆప్షన్ మాజీ మెంబర్ నయీమొద్దీన్, గ్రామస్తులు కోరుతున్నారు.

'సహారా' ఏజెంట్‌పై ఫిర్యాదు

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ నిరుపేదల నుంచి డిపాజిట్ల రూపంలో డబ్బులు సేకరించి, చేతులెత్తేసిన సహారా ఇండియా పరివార్ ఏజెంట్ సిరిసిల్ల ప్రవీణ్‌పై శివంగాలపల్లి గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన ప్రవీణ్ తమ నుంచి డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు పెద్ద మొత్తంలో సేకరించాడన్నారు. కొన్ని డబ్బులు వాపస్ రాకపోవడంతో ఫోన్ చేస్తున్నామని తెలిపారు. కానీ, సమాధానం ఇవ్వకపోవడంతో సోమవారం అతని ఇంటికి వెళ్లి, ఆందోళన చేపట్టామన్నారు. అనంతరం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సిబ్బంది, నాయకులపై ఫిర్యాదు


కలెక్టరేట్‌లో ఏవో రాంరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల విద్యుత్ సిబ్బందిపై సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. వారి వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్‌ను బద్‌నాం చేసే ఉద్దేశంతో కొందరు నాయకులు ఆదివారం కరెంట్ కట్ చేయించారు. దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. సదరు సిబ్బంది, నాయకులపై చర్య తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, పీసీసీ కో–ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పట్టణ కార్యదర్శి కాసర్ల రాజు పాల్గొన్నారు.

ఓటర్లకు డబ్బులు పంచినవారిపై కేసు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని చల్లూరు, ఎల్బాక గ్రామాల్లో సోమవారం ఓటర్లకు డబ్బులు పంచినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. చల్లూరులో బీజేపీ నాయకుడు ఆదిరెడ్డి ఓటర్లకు రూ.11 వేలు పంపిణీ చేస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి ఐలయ్య పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. అలాగే, ఎల్బాకలో మాజీ ఉపసర్పంచ్ ఊట్ల దేవయ్య రూ.14 వేలు పంచుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రామ్‌కుమార్ పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీబీఎస్‌ఈలో 'పారమిత' విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి(కరీంనగర్): సీబీఎస్‌ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో పద్మనగర్‌లోని పారమిత విద్యార్థులు ప్రతిభ కనబరిచి, వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు తెలిపారు. 10వ తరగతిలో మన్నా మెహ్వష్ 97.47, లక్ష్మీహాసిని 95.6, నందన్ ప్రణవ్ 95.2, స్ఫూర్తి 95, ఆశిష్ 94.6 శాతం మార్కులు, 46 శాతం విద్యార్థులు 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే, 12వ తరగతి ఎంపీసీలో గట్టు మనస్విని 94, నిర్మల కృష్ణతేజ 91 , దేశిని సహర్ష 90 శాతం, బైపీసీలో బొమ్మడి శివ 95, అయాన్ 91 శాతం, బీఈఏలో శ్రేష్ఠ 82 శాతం మార్కులు తెచ్చుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలను ఆయన అభినందించారు.

హనుమాన్ దీక్ష వస్త్రాలతో ప్రచారంపై..

- బీజేపీ నాయకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ వద్ద సోమవారం బీజేపీకి చెందిన ఓ నాయకుడు హనుమాన్ దీక్ష తీసుకోకుండా సంబంధిత వస్త్రాలు ధరించి, ప్రచారం చేస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలు పాటించకుండా బీజేపీకి ఓటు వేయాలంటూ ఓటర్లను కోరుతున్నాడని పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఆ నాయకుడిని అదుపులోకి తీసుకొని, ఠాణాకు తరలించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు తరలిరావడంతో టౌన్ సీఐ రవి సర్ది చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమణిగిందని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి 'వెలిచాల'పై కేసు

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై కేసు నమోదైంది. ఆయన 4వ నంబర్ కలిగిన టీషర్ట్ ధరించి, కాంగ్రెస్‌కు ఓటేయాలంటూ పలు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేశారని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు సోమవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజేందర్‌రావుపై క్రైం నం.369/2024, అండర్ సెక్షన్ 188, 171ఎఫ్ ఐపీసీ కింద కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపలకు వెళ్లి.. అనంతలోకాలకు

- చెరువులో మునిగి వ్యక్తి మృతి
- రాచర్లగొల్లపల్లిలో విషాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాచర్లగొల్లపల్లికి చెందిన ఆలకుంట రాజు(40) ఆదివారం సాయంత్రం తన స్నేహితుడు వేముల శేఖర్‌తో కలిసి గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. శేఖర్ చెరువు కట్టపై ఉండగా రాజు నీటిలోకి దిగాడు. కొంత దూరం వెళ్లాక, ఊబిలో చిక్కుకొని ఊపిరాడక చనిపోయాడు. అతను బయటకు రాకపోవడంతో శేఖర్ గ్రామంలోకి వెళ్లి, రాజు కుటుంబసభ్యులకు విషయాన్ని తెలిపాడు. వారు చెరువు వద్దకు వెళ్లగా అప్పటికే చీకటి కావడంతో రాజు ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓటేసేందుకు దుబాయ్ నుంచి..



ఓటు వేసిన బాబూరావు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎన్నికల్లో ఓటు వేసేందుకు దుబాయ్ నుంచి వచ్చాడు ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్‌కు చెందిన బాబూ రావు. ఆయన దుబాయ్‌లో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మాతృ దేశంలో ఓటు వేయాలన్న సంకల్పంతో వచ్చి, వేశాడు. ఓటుహక్కు వినియోగించుకోవడం గొప్పగా భావిస్తున్నానని తెలిపాడు.

కోరుట్లలో యువకుడిపై కత్తితో దాడి


- గాయపడిన అబ్దుల్లా

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన అబ్దుల్లాపై అతని స్నేహితుడు సుభాన్ కత్తితో దాడి చేశాడు. స్థానికుల కథనం ప్రకారం.. అబ్దుల్లా తన కుటుంబ వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్నాడన్న కోపంతో సుభాన్ సోమవారం రాత్రి కత్తితో అతనిపై దాడి చేశాడు. ఈ ఘటనలో అబ్దుల్లా వీపు భాగంలో గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు


బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట(హుజూరాబాద్): కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని బేగంపేటకు చెందిన శ్రీనివాస్–రమ దంపతులు వరంగల్‌లో ఉంటున్నారు. సోమవారం స్వగ్రామంలో ఓటు వేసేందుకు తమ కూతురితో కలిసి కారులో వెళ్తున్నారు. జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. పోలింగ్ కేంద్రాల సందర్శనలో భాగంగా వావిలాల నుంచి జమ్మికుంట వైపు వస్తున్న కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, నాయకులు సంఘటన స్థలం వద్ద ఆగారు. బాధితులను 108 వాహనంలో వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడికి మేయర్ ప్రథమ చికిత్స


చికిత్స అందిస్తున్న మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్ రోడ్డుపై పడిపోయిన ఓ యువకుడికి ప్రథమ చికిత్స అందించారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి రోడ్డులో అన్నపూర్ణకాలనీకి చెందిన సతీశ్ బైక్‌పై వెళ్తూ కింద పడ్డాడు. ఈ ఘటనలో అతనికి గాయాలై, స్పృహతప్పాడు. అక్కడే ఉన్న మేయర్ వెంటనే ఆ యువకుడికి ప్రథమ చికిత్స అందించారు. తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించిన ఆయనను కార్పొరేటర్ ఎన్వీ.రమణారెడ్డి, స్థానికులు అభినందించారు.

అప్పుడు మనీతో.. ఇప్పుడు మద్యంతో

- సిరిసిల్లలో పట్టుబడ్డ కౌన్సిలర్
- డబ్బులు పంచిన మరో కౌన్సిలర్ భర్త
- ఇద్దరిపై కేసు


మద్యం బాటిళ్లతో పట్టుబడ్డ కౌన్సిలర్ శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు పంచుతూ పట్టుబడితే.. తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లో ఇంట్లో మద్యం నిల్వ చేసి, పట్టుబడ్డారు సిరిసిల్లకు చెందిన ఓ కౌన్సిలర్. మరో కౌన్సిలర్ భర్త డబ్బులు పంచుతున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల రెడ్డివాడకు చెందిన 16వ వార్డు కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ డబ్బులు, మద్యం పంపిణీ చేస్తున్నట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సోమవారం ఆయన ఇంట్లో సోదాలు జరుపగా సుమారు రూ.25 వేల విలువైన మద్యం బాటిళ్లు లభించాయి. వాటిని సీజ్ చేసి, ఆయనపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. 37వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త దిడ్డి రాజు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయడంతో స్థానికులు వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



నాగారంలో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పించకపోతే కూలిపోయే ప్రమాదముందని మహారాష్ట్ర మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి సీహెచ్.విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోనరావుపేట మండలం నాగారంలో కుమారుడు వికాస్‌రావుతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. యువతను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. వారిలోని నైపుణ్యతను వెలికితీసి ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని అభిప్రాయపడ్డారు. యువతకు ఉపాధికల్పన అంశంపై ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు.

కలల రహ'దారి' సాకారం

- దశాబ్దాలకు ఫలిస్తున్న పల్లెవాసుల రోడ్డు కల
- సిద్ధమవుతున్న మరిమడ్ల–మానాల రహదారి
- రూ.8.50కోట్లతో 9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం
- వన్యప్రాణుల కోసం ప్రత్యేక వంతెనలు


మరిమడ్ల–మానాల మధ్య అడవిలో రహదారి నిర్మాణం

మానాల–మరిమడ్ల రోడ్డు స్వరూపం

రోడ్డు పొడవు :	9 కిలోమీటర్లు
మంజూరైన నిధులు :	రూ.8.50 కోట్లు
పెద్ద వంతెనలు :	4
బాక్స్ కల్వర్టులు :	6

సిరిసిల్ల: రోడ్డు... పల్లెల అభివృద్ధికి చిహ్నం. అటవీ గ్రామాలకైతే అదో వరం. మూడు దశాబ్దాలుగా మారుమూల పల్లెప్రజల నిరీక్షణకు తెరదించుతూ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతి లభించింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం మరిమడ్ల, రుద్రంగి మండలం మానాల మధ్య రహదారి నిర్మాణానికి అవాంతరాలు తొలగిపోయాయి. దట్టమైన అటవీ కావడంతో రోడ్డుతోపాటు వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగేందుకు, రోడ్డు దాటేందుకు వీలుగా, వాటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక వంతెనలు నిర్మించాలని అటవీశాఖ స్పష్టం చేసింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో మరిమడ్ల–మానాల రోడ్డుకు మోక్షం లభించింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో తొలిసారిగా ఓ రోడ్డుతోపాటు వన్యప్రాణుల రాకపోకలకు వీలుగా ప్రత్యేక వంతెనలు నిర్మించనున్నారు.

అడవి మధ్యలో నుంచి రోడ్డు

మానాల–మరిమడ్ల.. రహదారి. ఇది స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన కచ్చారోడ్డు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ మానాలకు ప్రత్యేక స్థానం ఉంది. మానాల కేంద్రంగా గెరిల్లా పోరాటాలు సాగాయి. 2016 కంటే ముందు మానాల గ్రామం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం పరిధిలో ఉండేది. కొత్త జిల్లాల ఏర్పాటుతో రాజన్నసిరిసిల్ల జిల్లా పరిధిలోకి వచ్చింది. మరిమడ్ల–మానాల మధ్య పచ్చని దట్టమైన అడవి ఉంటుంది. 9 కిలోమీటర్లు ఎత్తయిన గుట్టలు, లోతైన ఒర్రెలతో కనువిందు చేసే ప్రకృతి ఉంటుంది. 1995లో తొలిసారి పంచాయతీరాజ్‌శాఖ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించింది. అటవీశాఖ అభ్యంతరాలతో రోడ్డుకు మోక్షం లభించడం లేదు. ఈ రోడ్డు పూర్తయితే.. మానాల పరిధిలోని ఏడు గ్రామాలకు, మరో పది గిరిజన తండాలకు, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల పరిధిలోని పాతిక గ్రామాలకు రహదారి భాగ్యం కలుగుతుంది. వన్యప్రాణులు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు వేస్తే.. వాటి స్వేచ్ఛను హరించినట్లు అవుతుంది, నల్లమల అటవీ తరహాలో వాటికి ప్రత్యేక మార్గాలు(వంతెనలు) నిర్మించాలని అటవీశాఖ స్పష్టం చేసింది. దీంతో ఆ నిబంధనలను అంగీకరిస్తూ.. నాలుగు భారీ వంతెనలు, మరో ఆరు బాక్స్ కల్వర్టుల నిర్మాణాలకు అంగీకరించడతో రోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించాయి.

రెండు జిల్లాల అధికారుల సమన్వయంతో..

మానాల నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం పరిధిలో ఉంది. 2022లో అప్పటి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కావడంతో మానాల–మరిమడ్ల రోడ్డు నిర్మాణానికి అనుమతులు, నిధులు సాధించారు. మానాల పరిధిలోని అటవీ ప్రాంతం నిజామాబాద్ జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండగా.. మరిమడ్ల శివారు రాజన్నసిరిసిల్ల జిల్లా పరిధిలో ఉంది. రెండు జిల్లాల ఆర్‌అండ్‌బీ అధికారులను సమన్వయపరచడంతో మానాల–మరిమడ్ల అడవిలో వంతెనలతో కూడిన బాటలు పడుతున్నాయి.


మహిళా ఓటర్లను బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న సిబ్బంది


ఓటు హక్కు వినియోగించుకున్న కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు


వృద్ధులను ఆటో నుంచి దించుతున్న సిబ్బంది


ఇరుకుల్లలో ఓటు వేశామంటున్న గ్రామస్తులు


రజ్వీచమన్‌లోని జెమ్స్‌స్కూల్‌లో..


రామయ్యపల్లిలో బారులుతీరిన ఓటర్లు


ఓటు వినియోగించుకున్న ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్


ఓటు హక్కు వినియోగించుకున్న జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్‌కుమార్



నగునూరులో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్ వైష్ణవి


సప్తగిరికాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు

తరలి వచ్చి.. ఓటేసి

బారులు తీరిన ఓటర్లు - ప్రశాంతంగా పోలింగ్

కరీంనగర్: కరీంనగర్‌తో పాటు కరీంనగర్, కొత్తపల్లి మండలాల్లో సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే జనం ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడం కనిపించింది. ఆయా పార్టీల అభ్యర్థులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్, వెలిచాల రాజేందర్‌రావులు నగరంలోని పలు కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

నిర్మానుష్యంగా మారిన నగరం

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నగరంలోని ప్రధాన రహదారులన్నీ సోమవారం బోసిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీనికి తోడు ఉద్యోగులందరూ ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా తరలివెళ్లడం, ఓటు వినియోగించుకున్న ఇళ్లలోనే ఉండటంతో వీధులు నిర్మానుష్యంగా మారాయి. నగరంలో జనసందడి కనిపించలేదు. పోలీసు శాఖ పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచి బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులతో పాటు పారా మిలటరీ దళాలు, పారామిలటరీ బలగాలు కూడా మొహరించాయి.

కరీంనగర్ మండలంలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో మొత్తం ఓటర్లు 53,534 ఉండగా 38,286 ఓట్లు పోలయ్యాయి. 71.52 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కావడంతో పెద్దసంఖ్యలో ఓటేసేందుకు గ్రామీణ ప్రజలు తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వాతావరణం చల్లగా ఉండటంతో కేంద్రాల వద్ద బాలురుతీరారు. మధ్యాహ్నం తర్వాత ఎండవేడికి ఓటర్లు ముందుకురాలేదు. చేగుర్తిలోని 112 పోలింగ్ కేంద్రంలో ఓటర్ల కోసం పోలింగ్ సిబ్బంది ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. చల్మెడ ఆనంద రావు కళాశాల వైద్య విద్యార్థుల ఓట్లున్న గుంటూరుపల్లిలోని పోలింగ్ కేంద్రం–125లో 706 ఓట్లుండగా 250, 126 పోలింగ్ కేంద్రంలో 413 ఓట్లుండగా 72 మంది మాత్రమే ఓటేశారు. మహిళా ఆదర్శ కేంద్రం–127లో 1058 ఓట్లకు 804 పోలయ్యాయి. నగునూరులోని మహిళా ఆదర్శ కేంద్రం–80లో 1,093 ఓట్లకు 751 పోలయ్యాయి. ట్రాన్స్‌జెండర్ వైష్ణవి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ప్రధాన పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆయా అభ్యర్థులకు ఓటేయాల్సిందిగా ప్రచారం నిర్వహించారు. అయితే 144 సెక్షన్ అమలులో ఉండటంతో కార్యకర్తలను పోలీసులు అక్కడి నుంచి తరిమివేశారు. కరీంనగర్‌రూరల్ ఏసీపీ వెంకటరమణ, సీఐ ప్రదీప్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.


పోల్ చీటీలు తీసుకుంటున్న ప్రజలు

కొత్తపల్లి మండలంలో 68.60 శాతం పోలింగ్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 57,115 ఓటర్లకు 39,180 ఓట్లతో 68.60 శాతం ఓట్లు పోలయ్యాయి. చింతకుంటలోని 23 పోలింగ్ కేంద్రంలో 20 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించగా అధికారులు వెంటనే టెక్నీషియన్‌ను పిలిపించి పోలింగ్‌ను ప్రారంభించారు. కొత్తపల్లి ప్రధాన రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న జయశ్రీ సిలివేరి వీల్ చెయిర్‌పై వచ్చి ఓటు వేసి స్ఫూర్తిని చాటగా.. రేకుర్తిలో కుమారుడి సాయంతో వీల్ చెయిర్‌పై 2 కిలోమీటర్లు దూరం నుంచి వచ్చిన వృద్ధురాలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బావుపేటలో ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ కుటుంబసభ్యులతో జెడ్పీ కోఆప్షన్ సాబీర్ పాషా, ఏఎంసీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్‌లు వారివారి పోలింగ్ కేంద్రాల్లో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.


రేకుర్తిలో ఓటు వేసేందుకు 2 కిలోమీటర్లు వీల్‌ఛైర్‌పై వచ్చిన వృద్ధురాలు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి


ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ మేయర్ దంపతులు


రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోయినా కొత్తపల్లిలో ఓటు వేసేందుకు వచ్చిన జయశ్రీ


నగునూరులో పోషక పదార్థాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


చేగుర్తిలో ఓటర్ల కోసం ఎదురుచూస్తున్న పోలింగ్ సిబ్బంది


బొమ్మకల్‌లో ఓటువేసేందుకు బారులు తీరిన ఓటర్లు


వృద్ధుడిని తీసుకెళ్తున్న సిబ్బంది


గుంటూరుపల్లి మహిళా ఆదర్శ కేంద్రంలో ఓటు వేశామంటున్న మహిళలు

ఫస్ట్ టైం.. హ్యాపీ

తొలి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతీయువకులు


సీతారాంపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న యువత

సప్తగిరికాలనీ/కరీంనగర్‌రూరల్: 18 ఏళ్లు ఎప్పుడు వస్తాయా.. మేం ఎప్పుడు ఓటేస్తామా.. అంటూ ఎదురుచూసిన వారు కొందరు కాగా.. 2019లో అన్ని రకాల ఎన్నికలు ముగిసిన తర్వాత 18 ఏళ్లు నిండి ఓటు కోసం దరఖాస్తు చేసుకొని ఓటెయ్యాలని నాలుగేళ్లు ఎదురుచూసిన వారు మరికొందరు.. ఇలా తొలి ఓటు ఎప్పుడు సంధిస్తామా.. వాట్సప్ స్టేటస్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో ఐ కాస్టడ్ మై ఓట్ అని ఎప్పుడు పెట్టుకుందామా అని ఎదురుచూసిన వారందరూ సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేశారు. కొండంత ఆనందంతో రెట్టింపు ఉత్సాహంతో తొలి ఓటును సగౌరవంగా వినియోగించుకున్నామన్నారు. ఇక నుంచి ఏ ఎన్నికలు వచ్చిన మేం ఓటేస్తామని, ఎన్నికలప్పుడు ఎక్కడ ఉన్నా వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటామని తెలిపారు. తొలిసారి ఓటు వేసిన యువతను సాక్షి పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మంచి సమాజానికి వేశా



హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న. ఓటేసేందుకు కరీంనగర్‌కు వచ్చా. లైఫ్‌లో ఫస్ట్ ఓటు మంచి సమాజం కోసం వేశా. ప్రజలకు మంచి పాలన అందించే వారిని ఎంపిక చేసుకొని తొలి ఓటు వేశా. నా ఓటును సక్రమంగా వినియోగించుకున్నా అని అనుకుంటున్నా. ఆనందంగా ఉంది. – నిఖిల

ఎదురు చూశా



హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చేస్తున్న. ప్రత్యేకంగా ఓటేసేందుకు వచ్చా. ఫస్ట్ ఓటు ఎప్పుడెప్పుడు వేస్తానా అంటూ ఎదురుచూసిన క్షణాలు రానేవచ్చాయి. ఉత్సాహంగా సెంటర్‌కు వెళ్లి తొలి ఓటు వేశా. సో హ్యాపీ. నా ఓటు ఒక మంచి వ్యక్తిత్వానికి వేశా అనుకుంటున్న. – అఖిల

నిజాయితీకి వేశా



కరీంనగర్‌లో ఇంజినీరింగ్ చేస్తున్నా. నిస్వార్థ, నిజాయితీ పరులకు నా తొలి ఓటు వినియోగించా. సమాజంలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా కృషి చేస్తాడనిపించిన వ్యక్తికి ఓటు వేశా. ఎంతో ఆత్రుతతో ఎదురుచూశా. చాలా హ్యాపీగా ఉంది. ఇక నుంచి ప్రతి ఎన్నికల్లో ఓటేస్తా. – శ్రీ విద్య

హైదరాబాద్ నుంచి వచ్చా



ఫస్ట్ టైమ్ ఓటు హక్కు వచ్చింది. హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్న. తొలి ఓటు వేసేందుకు వచ్చా. సంతోషంగా ఉంది. మంచి నాయకుడినికి నా తొలి ఓటు వేశా. రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు ఓటు. వజ్రాయుధం లాంటి ఓటును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి. – విరాజ్

చాలా హ్యాపీ



ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఎప్పుడు ఓటేద్దామా అంటూ ఎదురుచూశా. ఫస్ట్ టైం ఓటేవా. చాలా హ్యాపీగా ఉంది. తొలి ఓటు సక్రమంగా వినియోగించుకున్నా. ఈ ఎన్నికలు నాకు లైఫ్‌లో గుర్తిండిపోతాయి. చాలా మంది కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం మంచి పరిణామం. – సాక్షి

అభివృద్ధికి ప్రాధాన్యం



దేశం అభివృద్ధితో పాటు రక్షణకు పాటుపడే పార్టీకి ఓటేశా. ఓటు వజ్రాయుధం లాంటిది. మార్పునకు నాంది పలుకుతోంది. ప్రతిఒక్కరూ నిజాయితీగా ఓటు వేసినపుడే దేశం అభివృద్ధి సాధిస్తోంది. యువతీయువకులు ప్రలోభాలకు లొంగకుండా ఓటేస్తేనే గుర్తింపు ఉంటుంది. – దామరపల్లి ఆశీష్‌రెడ్డి, విద్యార్థి, నగునూరు

ఉపాధి అవకాశాలు కల్పించాలి



భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడికి ప్రాధాన్యం ఇచ్చి ఓటేశా. నాయకుల హామీలు కార్యరూపం దాల్చడం లేదు. యువత ఓటు హక్కును వినియోగించుకుంటూ ఇతరులను చైతన్యం చేయాలి. – వేముల ఆదిత్య, ఇంజినీరింగ్ విద్యార్థి, దుర్శేడ్

సంతోషంగా ఉంది



పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారిగా ఓటేయ్యడం ఎంతో సంతోషంగా ఉంది. మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం వచ్చింది. యువ ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటేయ్యాలి. యువత,దేశ భవిష్యత్ కోసం ప్రాధాన్యం ఇచ్చే పార్టీకి ఓటేశా. – రాచకట్ల విప్తి, డిప్లొమా విద్యార్థి, ఆదర్శనగర్

తొలి ఓటు వేయడం మరిచిపోలేని రోజు



ఫస్ట్ టైం ఓటు వేయడం మరిచిపోలేని రోజు. నా తొలి ఓటును సక్రమంగా వినియోగించుకున్న. లైఫ్ లాంగ్ గుర్తుంటుంది. ఆదివారం 'సాక్షి'లో చెప్పాను గ్వాలియర్ నుంచి ఓటేసేందుకు వస్తున్నానని. ఇప్పుడు వచ్చి ఓటేశా. సో హ్యాపీ. – సాకేత్

క్లుప్తంగా

ఆసుపత్రి నుంచి వచ్చి..



కరీంనగర్: నగరానికి చెందిన శ్రీసేవా మార్గ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు మనిపల్లి ఫణిత–అమిత్‌బాబు దంపతులు ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఆస్పత్రి నుంచి నేరుగా కరీంనగర్‌లోని పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.

విజయంపై ధీమాలో బీఆర్ఎస్

కరీంనగర్: కరీంనగర్ ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కట్టనున్నారని, జూన్ 4న ఫలితాల్లో విజయం మాదేనంటూ బీఆర్ఎస్ నేతలు ధీమాతో ఉన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన అనంతరం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, నగర అధ్యక్షుడు చల్ల శంకర్‌లు నగరంలోని టవర్‌సర్కిల్‌లో చాట్ బండార్ వద్ద సరదాగా నాయకులతో కలిసి పానీ పూరి తిని, చాయ్ తాగి సరదాగా గడిపారు. వీరితో పాటు చిట్టుమల్ల శ్రీనివాస్, రూప్‌సింగ్, యూసుఫ్, కర్ర సూర్య శేఖర్, మిడి దొడ్డి నవీన్, నేతి రవి వర్మ,సంపత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంబురాలు

కరీంనగర్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ ఎంపీగా గెలువబోతున్న సందర్భంగా సోమవారం వన్‌టౌన్ చౌరస్తాలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వం సాంకేతికమయం

- పోలింగ్ విధానం.. ప్రత్యక్ష ప్రసారం
- జిల్లా టు స్టేట్, సెంట్రల్

కరీంనగర్ అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సర్వం సాంకేతికమయమే. పోలింగ్ కేంద్రాల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలైన్ టీంలు అత్యంత ఆధునిక కెమెరాలను వినియోగించగా కలెక్టరేట్ ప్రధాన విభాగంతో పాటు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి నిరంతరం వీక్షిస్తుండగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఎన్నికల విభాగం వీక్షించేలా అనుసంధానించారు. పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో ఇదే తొలిసారి కాగా ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని వినియోగించారు. సోమవారం జరిగిన పోలింగ్‌పై ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, పోలీస్ పరిశీలకులు, ఎన్నికల అధికారి పర్యవేక్షణ చేయగా ఎప్పటికప్పుడు పోలీస్, ఎన్నికల అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో 1,343 పోలింగ్ కేంద్రాలకు గాను 1,012 కేంద్రాల్లో ఇన్‌సైడ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయగా మిగతా కేంద్రాల్లో ఔట్ సైడ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో గొడవలు, ఎక్కువగా మంది గుమిగూడటం, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఏర్పాట్లు, ఈవీఎంల పనితీరును పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు.

వెబ్‌కాస్టింగ్‌లో మార్పులు

గతంలో వెబ్‌కాస్టింగ్‌కు విద్యార్థులను వినియోగించగా వారి వారి ల్యాప్‌టాప్‌లతో సేవలను వినియోగించిన విషయం తెలిసిందే. కాగా ఈ సారి తక్కువ సంఖ్యలో విద్యార్థులను వినియోగించగా లాప్‌టాప్‌ల అవసరం లేకుండానే ఆధునిక యంత్రంతో వెబ్ కాస్టింగ్ నిర్వహించారు. కరీంనగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పర్యవేక్షించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం సమస్యాత్మక కేంద్రాల్లో మాత్రమే వెబ్‌కాస్టింగ్ నిర్వహించగా సార్వత్రిక సమరంలో అన్ని కేంద్రాల నుంచి ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు.

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు లైవ్ స్ట్రీమింగ్ నిర్వహణకు ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒకరి చొప్పున ప్రత్యేకాధికారిని నియమించారు. పోలింగ్ క్రతువు మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు ప్రత్యేకాధికారి పర్యవేక్షిస్తారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల లోపల, వెలుపల సీసీ కెమెరాలు అమర్చారు. సాధారణ కేంద్రాలకు లోపలి వైపు నిఘానేత్రాలు బిగించగా గతంలో సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించగా ప్రస్తుతం అన్ని కేంద్రాల్లో ఈ పద్ధతి అవలంబించారు. దీనిని వెబ్ కాస్టింగ్ బదులు లైవ్‌స్ట్రీమింగ్‌గా పేర్కొంటున్నారు. సీసీ కెమెరాల నిర్వహణకు జిల్లాకు ఒకరి చొప్పున నోడల్ అధికారిని నియమించారు.


పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్

వీక్షణకు కలెక్టరేట్ వేదిక

పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఓటింగ్ క్రతువును వీక్షించేందుకు సంబంధిత కలెక్టరేట్లలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజు కలెక్టర్, ఇతర ఎన్నికల సిబ్బంది పర్యవేక్షించేందుకు సదుపాయాలు కల్పించారు. సమస్యాత్మక కేంద్రాలు, తనిఖీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల ద్వారా అక్కడి తంతును ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. పారదర్శక పోలింగ్‌లో లైవ్ స్ట్రీమింగ్ కీలక భూమిక పోషించిందని అధికారులు చెబుతున్నారు.

ఈవీఎం టు జీపీఎస్

ఈవీఎంలపై ఎన్నికల సంఘం పక్కా నిఘా ఏర్పాటు చేసింది. ఈ సారి సదరు యంత్రాలకు జీపీఎస్ అనుసంధానం చేయగా వాటి కదలికలు తక్షణమే తెలిసేలా కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించారు. ఈవీఎం గోడౌన్ నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించగా అనుక్షణం వీడియో నిక్షిప్తం చేశారు. ఈవీఎం తీసుకెళ్లే వాహనాలను అనుసంధానించగా ఎక్కడ ఏలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం స్ట్రాంగ్ రూంకు తరలింపు, కౌంటింగ్ తదుపరి గోడౌన్ చేరేవరకు జీపీఎస్ సిస్టం ద్వారా పర్యవేక్షించనున్నారు. రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా అనుసంధానించారు. కలెక్టర్ ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, భవిష్యత్ తరాల తలరాతలను మార్చే ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం కుటుంబసభ్యులతో కలిసి గంగుల కమలాకర్ విలేకరులతో మాట్లాడారు. ఓటు హక్కు ద్వారానే పనిచేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చని అన్నారు. దేశం సన్మార్గంలో నడవాలన్న.. దేశంతో పాటు రాష్ట్రం అభివృద్ధి కావాలంటే అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిని ఎన్నుకునే విధానం ప్రజాస్వామ్యం ద్వారానే సాధ్యమని అన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మేచినేని అశోక్ రావు, బత్తుల శ్రీధర్, లంక రవీందర్, గంటల రేణుక, పవన్, రాజు తదితరులు ఉన్నారు.

సెల్ఫీ పాయింట్స్ టు వాట్సాప్ డీపీ

కరీంనగర్ అర్బన్: సార్వత్రిక ఎన్నికల క్రమంలో ఎన్నికల సంఘం ఈ సారి కొత్తగా సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసింది. సోమవారం జరిగిన పోలింగ్‌లో అన్ని నియోజకవర్గాల్లోని పట్టణాలు, ప్రధాన పల్లెల్లోని కేంద్రాల వద్ద సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయగా ఓటర్లు ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. ఓటేసిన అనంతరం తాము ఓటేశామని, మరి మీరు అంటూ సెల్ఫీ పాయింట్ల వద్ద దిగిన ఫొటోను వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్‌లలో పోస్ట్ చేశారు.



బల్దియా ట్రాక్టర్‌లో భోజనం పంపిణీ


ట్రాక్టర్‌లో తరలిస్తున్న భోజనాల బాక్స్‌లు

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు మున్సిపల్ కార్పొరేషన్ ట్రాక్టర్‌లో భోజనాలు అందచేయటం వివాదాస్పదంగా మారింది. నగరపాలకసంస్థకు చెందిన కార్మికులు సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించారు. ఈ కార్మికులకు నగరపాలక సంస్థకు చెందిన ట్రాక్టర్ లో భోజనాల బాక్స్ లు పంపిణీ చేశారు. అయితే కార్మికులకు చెత్త ట్రాక్టర్‌లో భోజనాలు పంపిణీ చేసి అవమానించారని, సంబంధిత అధికారులపై చర్యతీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు సోహాన్ సింగ్ డిమాండ్ చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం వైఎస్ జగన్, భారతమ్మ





పులివెందుల: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని భాకరాపురంలోని పోలింగ్ కేంద్రంలో తన సతీమణి వైఎస్ భారతి రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఓటు వేశారు. పులివెందులలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి కూడా ఓటు వేశారు. కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఇడుపులపాయలోని మల్లేలమ్మ తల్లి నగర్‌లో ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల, అనిల్‌కుమార్ ఓటు వేశారు.

ఓటేసి వచ్చేశారు..



చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ ఏర్పడింది. ప్రధానంగా హైదరాబాద్ మార్గంలో వాహనాలు బారులుదీరి వెళ్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంట్‌తోపాటు అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్నవారు ఓటు వేసేందుకు సొంతూర్లకు వెళ్లి తిరుగు పయనమవుతున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ మొదలైంది.

పచ్చ ముఠాల విధ్వంసకాండ

ఓటమి భయంతో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు



పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి ముందు ఉన్న కార్లపై కర్రలు, రాళ్లతో దాడిచేస్తున్న టీడీపీ గూండాలు



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పల్లంలో టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఓటమి భయంతో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఫ్యాక్షన్, రౌడీ మూకలతో కలిసి బీభత్సం సృష్టించారు. కర్రలతో దండెత్తారు. కత్తులతో విరుచుకుపడ్డారు. ఏకంగా బాంబు దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్య ఓటర్లపై యథేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు బరితెగించి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. ఇళ్లు, వాహనాలపై దాడులకు తెగబడి విధ్వంస కాండతో చెలరేగిపోయారు. సామాన్య ప్రజానీకాన్ని హడలెత్తించారు. పల్నాడు, అన్నమయ్య, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం.. ఇలా దాదాపు అన్ని జిల్లాల్లోనూ విధ్వంసానికి దిగారు. ఈ గొడవలన్నింటికీ కర్త, కర్మ, క్రియ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ, జనసేన పార్టీలు దాదాపు 15 రోజులుగా రాష్ట్రంలో కుట్రలకు తెరతీసిన విషయం తెలిసిందే. ఓటర్లను యథేచ్ఛగా ప్రలోభాలకు గురి చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను కవ్విస్తూ దాడులకు పాల్పడుతూ వచ్చాయి. ఆ విధ్వంసకర కుట్రను పోలింగ్ సందర్భంగా సోమవారం పతాక స్థాయికి తీసుకువెళ్లాయి. ఉదయం పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే పోలింగ్ సరళి టీడీపీకి వ్యతిరేకంగా ఉందనే విషయం స్పష్టం కావడంతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ బెంబేలెత్తిపోయారు. దాంతో ముందస్తు పన్నాగంతో సిద్ధం చేసిన తమ రౌడీమూకలకు పచ్చ జెండా ఊపారు. ఆ వెంటనే టీడీపీ, జనసేన రౌడీలు యథేచ్ఛగా దాడులకు తెగబడి రాష్ట్ర వ్యాప్తంగా బీభత్సం సృష్టించారు. ఉదయం మొదలైన ఈ దాడులు, దౌర్జన్య కాండ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేలా చూడాల్సిన ఎన్నికల కమిషన్(ఈసీ).. వైఎస్సార్‌సీపీ ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ టీడీపీ, జనసేన గుండాల దాడులపట్ల ఉదాసీనంగా ఉండటం విస్మయ పరుస్తోంది.

హడలెత్తిన టీడీపీ, జనసేన

ప్రతిష్టాత్మకమైన ఈ ఎన్నికల్లో పోలింగ్ సరళి ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ మొదటి నుంచీ వ్యక్తమైంది. సోమవారం ఉదయం పోలింగ్ మొదలు కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వారిలో మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు అత్యధికంగా ఉండటం విశేషం. ఆ వర్గాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్నారని జాతీయ చానళ్లతోపాటు అన్ని సర్వేలు వెల్లడించాయి. అంటే ఓటింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందన్నది స్పష్టమైంది. దాంతో బెంబేలెత్తిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు.. ఓటింగ్ ప్రక్రియను దెబ్బతీసే కుట్రకు తెరతీశారు. పోలింగ్ సరళి తమకు అనుకూలంగా లేకపోతే విధ్వంసం సృష్టించేందుకు ముందుగానే ఆ రెండు పార్టీలు పన్నాగం పన్నాయి. అందుకోసం టీడీపీలోని రౌడీ షీటర్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి రౌడీలను ముందుగానే రప్పించాయి. కర్రలు, కత్తులతోపాటు పెట్రోల్ బాంబులు కూడా ముందుగానే సమకూర్చుకోవడం టీడీపీ, జనసేన కుట్రకు నిదర్శనం. చంద్రబాబు ఆదేశించగానే.. టీడీపీ, జనసేన రౌడీలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు తెగబడ్డారు.

చోద్యం చూసిన ఈసీ

టీడీపీ, జనసేన గూండాలు బరితెగించి విధ్వంసానికి పాల్పడి పోలింగ్‌కు ఆడ్డంకులు సృష్టించినా ఎన్నికల కమిషన్(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం నివ్వెర పరుస్తోంది. వారం రోజుల ముందు నుంచే టీడీపీ ఎన్నికల ప్రలోభాలపై వైఎస్సార్‌సీపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ప్రధానంగా వ్యూ యాప్ పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుండటంపై పూర్తి ఆధారాలను కూడా సమర్పించింది. టీడీపీ గూండాలు దాడులకు పాల్పడిన ఉదంతాలను.. పోలింగ్ రోజున విధ్వంసం సృష్టించేందుకు పదును పెడుతున్న కుట్రలను కూడా ఈసీ దృష్టికి తీసుకువెళ్లింది. అయినా సరే పోలింగ్ ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ఈసీ పూర్తిగా విఫలమైంది. అసలు టీడీపీ, జనసేన గూండాలు వీధుల్లోకి వచ్చి చెలరేగిపోతున్నా, పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్నా.. ఈవీఎంలను ధ్వంసం చేసినా.. ఏకంగా బాంబు దాడులకు పాల్పడినా సరే ఈసీ మాత్రం క్రియాశీలంగా స్పందించనే లేదు. పైగా వైఎస్సార్‌సీపీ నేతలనే కట్టడి చేసేందుకు యత్నించడం విభ్రాంతి కలిగిస్తోంది.

గుంటూరు జిల్లా తెనాలిలో పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అన్నబత్తున శివకుమార్‌ను టీడీపీ కార్యకర్త గొట్టిముక్కల సుధాకర్ పరుష పదజాలంతో దూషించారు. మాల, మాదిగలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ నోరు పారేసుకున్నారు.

దీనిపై ఎమ్మెల్యే అన్నాబత్తున శివ కుమార్ అభ్యంతరం చెప్పినా వినిపించుకోకుండా మరింతగా దూషించడంతో ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపించి వేశారు. ఈసీ మాత్రం ఎమ్మెల్యే అన్నా బత్తున శివ కుమార్‌ను పోలింగ్ ముగిసే వరకు గృహ నిర్బంధంలో ఉంచాలని పోలీసులను ఏకపక్షంగా ఆదేశించడం విస్మయ పరిచింది. ఆయన్ను దూషించిన టీడీపీ కార్యకర్తపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసంపై టీడీపీ రౌడీలు దాడికి పాల్పడి, అక్కడ ఉన్న వాహనాలను ధ్వంసం చేశాయి. కానీ ఈసీ మాత్రం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచమని పోలీసులను ఆదేశించడం విడ్డూరంగా ఉంది.

కత్తిపోటు నుంచి బాంబు దాడుల వరకూ..

పోలింగ్ మొదలైన కాసేపటికే టీడీపీ రౌడీలు చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై కత్తితో దాడి చేశారు. అనంతరం పోలింగ్ శాతం పెరుగుతున్న కొద్దీ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన దాడుల తీవ్రతను అమాంతం పెంచుకుంటూ పోయాయి.

బాపట్ల జిల్లా చీరాలలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నప్పటికీ ఆమంచి శ్రీనివాస్.. టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య యాదవ్‌కు అనుకూలంగా పని చేశారు. పోలింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆయన తీవ్ర అసహనానికి గురైన ఆయన రెడ్డిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నేత అంకమ్మగారుపై దాడి చేసి చెంపపై దాడి చేశారు. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య యాదవ్ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీ నేత, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారు.

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, ఆయన వర్గీయులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేయడంతో సుధీర్‌రెడ్డికి గాయమైంది. ఎర్రగుంట్ల 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షాహిద్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు.

వీరపునాయునిపల్లె మండలంలోని యు.వెంకటాపురం, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. కడపలో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ముస్లింలపై టీడీపీ గూండాలు రాళ్ల దాడికి తెగబడ్డాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడకు చేరుకుని ఉద్రిక్తతలను మరింతగా రెచ్చగొట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడటంతో వైఎస్సార్‌సీపీ నేత తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. దప్పేపల్లి గ్రామం మేడిమాకల గుంతరెడ్డివారిపల్లె పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. ఇదే సమయంలో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్, స్పెషల్ పార్టీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయుల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైమరీ స్కూల్ వద్ద టీడీపీ నాయకులు కండువా, పసుపు చొక్కాలు ధరించి టీడీపీకి ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. దీన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.

మచ్చుకత్తితో దాడి

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లిలో స్లిప్పుల పంపిణీ కోసం టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శిబిరం వద్దకు ఓటర్లు వెళ్లడంతో ఓర్చుకోలేని టీడీపీ కార్యకర్త ఇడగొట్టు రంగప్ప మచ్చుకత్తితో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంద్రప్పను పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై పేగులు బయటకు వచ్చాయి. ఈ సంఘటనతో భయభ్రాంతులకు గురైన ఓటర్లు చెల్లాచెదురయ్యారు. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామంలో పోలింగ్ సరళిని పరిశీలించి తిరిగి వెళ్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఘటనలో పురుషోత్తం రెడ్డి ప్రయాణిస్తున్న కారు ధ్వంసమైంది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నవీన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఒప్పిచర్లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌లపై హత్యాయత్నం

పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రిలీవ్ ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పాలకీర్తి నరేంద్ర, అతడి తమ్ముడిపై టీడీపీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశారు. ప్రాణ భయంతో వారు తప్పించుకుని బయటకు పరుగులు తీశారు. దాదాపు 300 మంది టీడీపీ గూండాలు వెంటపడటంతో కారెంపూడి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటన అనంతరం పొట్టి శ్రీరాములు కాలనీలోని ఎన్నికల బూత్‌ల వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగి రాళ్ల దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. కారెంపూడిలోని 288 నెంబర్ బూత్‌లో ఎన్నికల ఏజెంట్‌గా ఉన్న గోగుల సాంబశివరావు తమ్ముడిపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యానికి పాల్పడడంతో దాడిని అడ్డుకునే యత్నంలో సాంబశివరావు తలకు గాయమైంది. వైఎస్సార్ జిల్లా వేముల మండలం మబ్బుచింతలపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న నూలి భాస్కర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకోవడంతో టీడీపీ వర్గీయులు పథకం ప్రకారం రాళ్ల దాడి చేశారు. కాగా, టీడీపీ వర్గీయుల రాళ్ల దాడిలో జల్లా సునంద అనే మహిళకు చేయి విరిగింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

పూతలపట్టులో తెలుగు తమ్ముళ్ల వీరంగం

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని మూడు పోలింగ్ బూత్‌లతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై పచ్చ మూక దాడులకు పాల్పడింది. పేటగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవినాయుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సమయంలో టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేశారు. అనంతరం పేటపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుస్వామినాయుడుపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో గురుస్వామి నాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వావిల్‌తోట పంచాయతీ సీఎం కండ్రిగ పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా వున్న హరిబాబుపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే జిల్లా సోమల మండలం కందూరు పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌రెడ్డిపై టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు దాడికి పాల్పడ్డాడు. పోలింగ్ కేంద్రంలో వద్ద ఏర్పడిన వివాదంతో సుబ్రమణ్యం నాయుడు తన అనుచరులతో కలసి దాడి చేశాడు. గంగాధర్ నెల్లూరు మండలం జంగాలపల్లి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకులు గ్రామస్తులపై దౌర్జన్యం చేశారు. చిత్తూరు మండలం పెరుమాళ్ళ కండ్రిగలో టీడీపీ నాయకులు రెచ్చిపోయి వైఎస్సార్సీపీ నాయకుడి ఇంటిపై దాడి చేశారు. కారును ధ్వంసం చేసి ఓ నాయకుడిని తీవ్రంగా గాయపరిచారు. తొలుత టీడీపీ నాయకులు ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తూ రోడ్డుకు అడ్డంగా పందిరి వేశారు. దీనిని పోలీసులు తీసి వేయడంతో జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. ఇనుప రాడ్లు, కొయ్యలతో పలువురిని తీవ్రంగా గాయపరిచారు.

పసుపు కండువాతో 'గంటా' హల్‌చల్

భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పసుపు కండువాతో హల్‌చల్ చేశారు. తన అనుచరులతో కలిసి పోలింగ్ స్టేషన్‌లోకి వెళుతుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్నపల్లి పోలింగ్ బూత్‌లో ఏజెంట్ల మధ్య తలెత్తిన వివాదం టీడీపీ, వైఎస్సార్‌సీపీల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ జీవరత్నం, యతేంద్ర, సంపతిరావు సూర్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పోలింగ్ బూత్ వద్దకు వెళ్లడంతో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన మల్లాడి చిన ధర్మారావు, మల్లాడి నర్సింహులు, అరదాని శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ నేతలు దాడులు చేశారు. రామకృష్ణారావుపేటలో కొందరు టీడీపీ సానుభూతిపరులు చేసిన దాడిలో మాజీ కార్పొరేటర్ రోకళ్ళ సత్యనారాయణతో పాటు మరికొందరు గాయపడ్డారు. రూరల్ కరప మండలం పెదకొత్తూరులో పోలింగ్ బూత్ వద్ద జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీకి చెందిన చింతా సత్యనారాయణపై దాడి చేసి మొబైల్ ఫోన్ లాక్కొని వివాదం సృష్టించారు. పిఠాపురం నియోజకవర్గం విరవ, విరవాడ ప్రాంతాల్లో కూడా జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగారు.

'చింతమనేని' వర్గీయులు కత్తెరతో దాడి

పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో వైఎస్సార్‌సీపీకి చెందిన చలపాటి రవిపై చింతమనేని అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన రవి భుజంపై కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడిన రవి ఆసుపత్రిలో విషమ పరిస్థితుల్లో ఉన్నాడు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆసుపత్రికి చేరుకుని రవిని పరామర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని లాలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూలులో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా వచ్చారు. అప్పుడే అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవ పెట్టుకునేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలపై లాఠీఛార్జి చేశారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్ పాఠశాల బూత్‌లో డీఎస్పీ మల్లికార్జునరావు వైఎస్సార్ సీపీకి చెందిన బూత్ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారు. వారి గుర్తింపు కార్డులను లాక్కొని బయటకు వెళ్లాలంటూ ఆదేశించారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు.



ఓటేసిన చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి

ఫ్యాన్ సునామీ

▶ మొదటి పేజీ తరువాయి

పోలింగ్ కొనసాగింది. రాత్రి 10 గంటల సమయానికి 76.50 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. నగర, పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎండల ప్రభావం తగ్గడం కూడా పోలింగ్ శాతం పెరగడానికి దోహదం చేసింది.

నిర్దేశించేది మహిళలు, గ్రామీణ ఓటర్లే..

పోలింగ్ సరళిపై ఇండియాటుడే ఛానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ సోమవారం రాత్రి టీవీలో చర్చ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో తాను విస్తారంగా పర్యటించానని.. మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లు ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తారని రాజ్‌దీప్ సర్దేశాయ్ పేర్కొన్నారు. ఈ చర్చలో పాల్గొన్న సెఫాలజిస్ట్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించే యాక్సిస్ మై ఇండియా సీఎండీ ప్రదీప్ గుప్తా దీనిపై ఏకీభవించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల ఫలితాలను మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లే నిర్ణయిస్తారని చెప్పారు. రోడ్ల గురించి కాకుండా ప్రభుత్వ సేవలు ఎలా ఉన్నాయన్నదే ప్రామాణికంగా తీసుకుని 80 శాతం మంది మహిళలు ఓటు వేస్తారని తెలిపారు.

ఇంటింటి అభివృద్ధిని ప్రతిబింబించిన పోలింగ్ సరళి..

నవరత్నాల పథకాలను గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు, సుపరిపాలనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి అభివృద్ధి మరింతగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఓట్లు వేసేందుకు స్వచ్ఛందంగా వచ్చారు. ప్రభుత్వ సానుకూలత సునామీలా ఓటెత్తిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికలను పెత్తందారులు – పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా బడుగు, బలహీన వర్గాలు భావించడం వల్లే భారీగా పోలింగ్ నమోదైందని పేర్కొంటున్నారు.

మరిన్ని వివరాలు, వార్తల కోసం ఈ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయండి

ఈవీఎంలలో భవితవ్యం

- స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరుకున్న ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- జూన్ 4న రామగిరి జేఎన్‌టీయూలో ఓట్ల లెక్కింపు
- పెరిగిన పోలింగ్ శాతంతో అభ్యర్థుల్లో టెన్షన్



పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంలకు సీల్ వేస్తున్న సిబ్బంది

సాక్షి, పెద్దపల్లి: పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ముగిశాయి. అందరి దృష్టి ఫలితాలపై పడింది. ఈవీఎంలల్లో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది. జూన్ 4వ తేదీన కౌంటింగ్ జరగనుంది. ఫలితాలపై అభ్యర్థులతోపాటు ప్రజల్లో కూడా ఉత్కంఠ నెలకొంది. గెలుపు ఎవరి అంచనాలకూ అందడం లేదు. ఓటింగ్ శాతం అనూహ్యంగా పెరగడంతో ఫలితాలు ఎలా ఉంటాయోనని అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని 1,850 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల సిబ్బంది ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం, వీవీప్యాట్)లను పోలింగ్ కేంద్రాల నుంచి రామగిరిలోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాట్లు చేశారు. అలాగే సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. రేపు, ఎల్లుండి ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ముఖ్యనాయకులు, బూత్ కన్వీనర్‌లతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవటానికి సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ఓటింగ్ తీరు తెన్నలతో పాటు పార్టీ విజయావకాశాలను ఎంపీ అభ్యర్థులు విశ్లేషించుకోనున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న సింగరేణి సీఎండీ



ఓటు వేసిన సీఎండీ బలరాం, జీఎంలు శ్రీనివాస్, సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి సీఎండీ బలరాం సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. సింగరేణి బొగ్గు గనులు విస్తరించిన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని పలువురు అధికారులు కూడా ఆయా ప్రాంతాల్లో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గోదావరిఖనిలో ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ దంపతులు, ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ దంపతులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆయా విభాగాల్లోని ఉన్నతాధికారులు నిర్దేశిత సమయంలో సమీప పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేశారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: పోలింగ్ రోజు కూడా రాజన్నను దర్శించుకునేందుకు భక్తులు సోమవారం భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకొని.. ఓటేసేందుకు త్వరగా స్వగ్రామాలకు తిరిగి వెళ్లారు.

రోడ్డేస్తేనే ఓటేస్తాం

- ఎన్నికలను బహిష్కరించిన అల్లంపల్లి వాసులు
- కలెక్టర్ హామీతో తిరిగి ఓటింగ్



ఓటర్లు రాకపోవడంతో ఖాళీగా కూర్చున్న ఎన్నికల సిబ్బంది



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్

కడెం: తమ గ్రామానికి బీటీ రోడ్డేస్తేనే ఓటేస్తామని నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లి వాసులు సోమవారం లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించారు. తమది మారుమూల ఆటవీ గ్రామమని, కనీసం బీటీ రోడ్డు, వైద్యం, మౌలిక సౌకర్యాలు లేవని తెలిపారు. 70 ఏళ్లుగా ఓటు వేస్తున్నా తమను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లంపల్లి, బాబానాయక్‌తండా బూత్‌లలో ఉదయం నుంచి ఓటేయడానికి గ్రామస్తులు రాకపోవడంతో తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ గ్రామానికి చేరుకుని మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని నచ్చజెప్పినవా వారు వినలేదు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గ్రామానికి చేరుకుని రోడ్డు వేయిస్తానని తెలిపారు. రోడ్డు వేశాకనే గ్రామానికి వస్తానని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో మాట్లాడించారు. అయినా గ్రామస్తులు వినలేదు. అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ గ్రామానికి చేరుకుని డీఎఫ్‌వో, పంచాయతీరాజ్ ఉన్నాతాధికారులతో మాట్లాడారు. సమస్యను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి తీసుకెళ్లారు. అల్లంపల్లికి తప్పకుండా బీటీరోడ్డు వేయిస్తామని కలెక్టర్ ఫోన్‌లో గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మూడు రోజుల్లో కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేస్తామని, గ్రామస్తులు రావాలని సూచించారు. కలెక్టర్ హామీతో మధ్యాహ్నం 2:30 గంటలకు గ్రామస్తులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటుహక్కు వినియోగించుకున్నారు.



అల్లంపల్లిలో ఓటేసేందుకు బారులు తీరిన గ్రామస్తులు

ఈసారి యూట్యూబ్ హవా!

డిజిటల్ ఎన్నికల ప్రచారంలో దుమ్మురేపుతున్న వైనం

- ఈసారి పార్టీలు, నేతలు, కంటెంట్ క్రియేటర్లకు కీలక వేదిక
- గత నెల రోజుల్లో భారీగా పెరిగిన వ్యూస్, సబ్‌స్క్రయిబర్లు
- 2014 ఎన్నికల్లో ఫేస్‌బుక్, 2019లో వాట్సాప్ జోరు



సార్వత్రిక ఎన్నికల వేడి సోషల్ మీడియాలోనూ సెగలు పుట్టిస్తోంది. ఫేస్‌బుక్.. వాట్సాప్.. ఇన్‌స్టా.. ఎక్స్.. యూట్యూబ్.. ఇలా సోషల్ ప్లాట్‌ఫామ్‌ల్లోనే మునిగి తేలుతున్న నెటిజన్లకు చేరువయ్యేందుకు పార్టీలు కూడా ఆ వేదికలనే అడ్డాగా మలచుకుంటున్నాయి. రాజకీయ విశ్లేషకులతో పాటు కంటెంట్ క్రియేటర్లు కూడా జోరు పెంచడంతో రెండు నెలలుగా డిజిటల్ ప్రచారం దుమ్ము రేగిపోతోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు ఎక్కువగా ఫేస్‌బుక్‌పై దృష్టి పెట్టగా 2019కు వచ్చేసరికి ప్రధానంగా వాట్సాప్‌ను నమ్ముకున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం డిజిటల్ క్యాంపెయినింగ్‌కు యూట్యూబ్ కీలక వేదికగా మారింది...

– సాక్షి, నేషనల్ డెస్క్

సాధారణంగా యూట్యూబ్‌లో వినోదాత్మక కంటెంట్‌కు మంచి గిరాకీ ఉంటుంది. ఎన్నికల పుణ్యమా అని నెల రోజులుగా సీరియస్ రాజకీయ కంటెంట్‌కు ఒక్కసారిగా వ్యూస్ విపరీతంగా పెరిగిపోతున్నాయి. సబ్‌స్క్రయిబర్లు భారీగా ఎగబాకుతున్నారు. సోషల్ మీడియా డేటాను విశ్లేషించే సోషల్ బ్లేడ్ గణాంకాల ప్రకారం రాజకీయ థీమ్‌తో కంటెంట్ క్రియేట్ చేస్తున్న ధ్రువ్ రాఠీకి ఒక్క ఏప్రిల్ నెలలోనే ఏకంగా 25 లక్షల మంది యూజర్లు దక్కడమే ఇందుకు నిదర్శనం! ఇక డిజిటల్ న్యూస్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారిన రవీశ్ కుమార్, అభిసార్ శర్మ వంటి టీవీ జర్నలిస్టుల యూట్యూబ్ ఛానెల్స్ కూడా మూడు లైక్‌లు, ఆరు షేర్లుగా దూసుకెళ్తున్నాయి. వీరిద్దరి ఛానెల్స్ నెలవారీ వ్యూస్ వరుసగా 175 శాతం, 115 శాతం చొప్పున ఎగబాకాయి!

షార్ట్ వీడియోలే ట్రెండింగ్..

గత ఎన్నికల్లో వాట్సాప్ గ్రూపుల ద్వారా డిజిటల్ మెసేజ్‌లను పార్టీలన్నీ బాగా వాడుకున్నాయి. ఇందుకోసం కొన్ని పార్టీలైతే ఏకంగా 2 లక్షలకు పైగా వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసినట్లు రషీద్ చెబుతున్నారు! కానీ ఇప్పుడు నెటిజన్ల అభిరుచులతో పాటు ట్రెండ్ కూడా మారిపోయింది. ముఖ్యంగా 30 సెకన్ల కంటే తక్కువ నిడివిగల చిన్నపాటి వీడియో క్లిప్‌లకు భలే క్రేజ్ ఉంది. వాస్తవానికి ఈ ట్రెండ్ టిక్‌టాక్‌తో మొదలైంది. దాన్ని బ్యాన్ చేయడంతో యూట్యూబ్ షార్ట్స్, ఇన్‌స్టా రీల్స్ ఇప్పుడు దుమ్ము రేపుతున్నాయి. స్మార్ట్ ఫోన్ యూజర్లు భారీగా పెరగడం, డేటా చౌకగా లభించడం, మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్ పెరగడం కూడా దీనికి ప్రధాన కారణాలే. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత చౌక డేటా ప్లాన్లు ఉన్న దేశాల్లో భారత్‌ది ఏడో స్థానం. స్మార్ట్ ఫోన్‌లోనే ఈజీగా కంటెంట్ క్రియేట్ చేయగల వీడియో ఎడిటింగ్ యాప్‌లు అందుబాటులోకి రావడం షార్ట్ వీడియోలకు బాగా కలిసొస్తోంది. కేవలం ఫొటో, మెసేజ్‌లతో కాకుండా చిన్న వీడియోలతో పార్టీలు తమ అభిప్రాయాలను మరింత ప్రభావవంతంగా ఓటర్లకు చేరవేసేందుకు వీలవుతుండటం వల్లే యూట్యూబ్ ఈ ఎన్నికల్లో కీలక ప్రచార వేదికగా మారింది. అంతేగాక ప్రధాన టీవీ ఛానెళ్లలో ముఖ్యమైన ప్రజా సమస్యలకు తగిన కవరేజీ దక్కడం లేదని యూట్యూబ్ క్రియేటర్లు అంటున్నారు. దాంతో అలాంటి వార్తలు చూపించే యూట్యూబ్ ఛానెళ్లకు డిమాండ్ బాగా పెరుగుతోందని చెబుతున్నారు.

యూజర్లు రయ్.. రయ్..

ఎన్నికల హడావుడి మొదలైన ఫిబ్రవరి నుంచి చూస్తే... చాలామంది నాయకులు, పార్టీల యూట్యూబ్ సబ్‌స్క్రయిబర్లు 2 నుంచి ఏకంగా 4 రెట్లు పెరగడం విశేషం. వీరిలో రాఘవ్ చద్దా (ఆప్–4.2 లక్షల యూజర్లు), శివరాజ్ సింగ్ చౌహాన్ (బీజేపీ– 2.7 లక్షలు), రేవంత్ రెడ్డి (కాంగ్రెస్– 2.05 లక్షలు) వంటి నేతలు ప్రధానంగా ఉన్నారు. పార్టీలపరంగా ప్రస్తుతం యూట్యూబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీదే హవా! ఏకంగా 63.4 లక్షల సబ్‌స్క్రయిబర్లతో ఆప్ దేశంలోనే టాప్‌లో ఉంది. బీజేపీకి 59.1 లక్షల మంది యూజర్లుండగా కాంగ్రెస్ సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 48 లక్షలు.

రాజకీయ యాడ్లకూ తగ్గేదేలే...



యూట్యూబ్ డిజిటల్ ప్రచార హవా పార్టీల అడ్వర్టయిజింగ్ వ్యయాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 5 నుంచి మే 4 మధ్య బీజేపీ, కాంగ్రెస్ గూగుల్ యాడ్స్ కోసం కేవలం వీడియోలపైనే అత్యధిక నిధులను వెచ్చించాయి. వివిధ ఫార్మాట్ల ద్వారా మెటా యాడ్స్‌కు ఖర్చు చేసిన దానికంటే ఇది మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. వీడియో కంటెంట్‌కు సంబంధించి కాషాయ పార్టీ గూగుల్ యాడ్స్‌కు రూ.50.4 కోట్లు ఖర్చు చేయగా, మెటా యాడ్స్‌కు రూ. 15.4 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఇక కాంగ్రెస్ గూగుల్ యాడ్స్‌కు రూ.24.5 కోట్లు, మెటాకు రూ.8.1 కోట్ల చొప్పున వెచ్చించింది.

ఫేస్‌బుక్ టు యూట్యూబ్.. వయా వాట్సాప్!

2019 ఎన్నికల్లో డిజిటల్ ప్రచారానికి వాట్సాప్ ప్రధాన వేదికైంది. అదే సమయంలో నిజానిజాలతో పనిలేకుండా ఫేక్ న్యూస్ పెరిగిపోవడానికి కూడా ఇది కారణమైంది. వాట్సాప్ ద్వారా ఫార్వర్డ్ అయ్యే సమాచార ప్రామాణికతను చెక్ చేసే యంత్రాంగం లేకపోవడం ఈ మాధ్యమంపై బాగా ప్రతికూల ప్రభావం చూపింది. ఈ ప్రతికూలత ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. దీనికి తోడు వాట్సాప్‌లో మెసేజ్ ఫార్వార్డ్‌లను 5 యూజర్లకు పరిమితం చేయడం కూడా ఈ ప్లాట్‌ఫాం వినియోగానికి బ్రేక్ వేసిందనే చెప్పాలి. పైగా వాట్సాప్ ఫార్వార్డ్‌లు లేనిపోని సమస్యలు తెచ్చిపెడుతుండటంతో ఈసారి ఎన్నికల ప్రచారంలో యూట్యూబ్ కీలక ప్లాట్‌ఫామ్‌గా ఆవిర్భవించిందని కంటెంట్ రీసెర్చర్ విజేత



దహియా చెబుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో యూట్యూబ్‌కు 50 కోట్ల మందికి పైగా యాక్టివ్ యూజర్లుండటం కూడా దీనికి ఊతమిస్తోంది. రాజకీయ విశ్లేషకులు, ప్రభుత్వ విధానాలపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే విమర్శకులతో పాటు పార్టీలు కూడా ఏడాదిగా యూట్యూబ్‌లో జోరు పెంచాయి. యూట్యూబ్‌లో తప్పుడు సమాచారాన్ని చెక్ చేసే యంత్రాంగం సమర్థంగా పని చేస్తుండటం కూడా పార్టీలు, నేతలు దీనికి అధిక ప్రాధాన్యమిచ్చేందుకు మరో కారణంగా నిలుస్తోంది. లైవ్ స్ట్రీమ్‌లను, ర్యాలీ వీడియోలను, ఇంటర్వ్యూలను యూజర్లకు చేరువ చేసేందుకు చాలా మంది నేతలు తమ సొంత యూట్యూబ్ ఛానెల్స్‌ను ప్రారంభించారు. అంతేగాక డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, పాడ్‌కాస్టర్ల సహకారంతో నేతలు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారని రాజకీయ వ్యూహకర్త, డిస్కోర్స్ కన్సల్టింగ్ సహ వ్యవస్థాపకుడు తల్హా రషీద్ పేర్కొన్నారు. ''దశాబ్దకాలంగా సార్వత్రిక ఎన్నికల్లో పార్టీల సోషల్ ట్రెండ్ రకరకాలుగా మారుతోంది. 2014లో ఫేస్‌బుక్ పేజీలను, ఈవెంట్లను పార్టీలు బాగా వాడుకున్నాయి. ఆ ఎన్నిలకప్పుడు పోలింగ్ రోజున ఫేస్‌బుక్ అలర్టులు సైతం అందించింది'' అని ఆయన గుర్తు చేశారు.

ఐదో విడతలోనూ మహిళలు అంతంతే

- బరిలో 695 మంది అభ్యర్థులు
- వారిలో మహిళలు 12 శాతమే
- 23 శాతం మందిపై కేసులు

తొలి నాలుగు విడతల మాదిరే లోక్‌సభ ఎన్నికల ఐదో విడతలోనూ మహిళలకు సముచిత ప్రాధాన్యం దక్కలేదు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా 49 స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొత్తం 695 మంది అభ్యర్థులు బరిలో ఉంటే వీరిలో మహిళలు 82 మందే! అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్ (ఏడీఆర్) సంస్థ ఈ మేరకు గణాంకాలను విడుదల చేసింది. మొదటి, రెండో విడతలో 8 శాతం చొప్పున, మూడో విడతలో 9 శాతం, నాలుగో విడతలో 10 శాతం మహిళా అభ్యర్థులు పోటీ చేశారు.

ఐదో విడత బరిలో ఉన్న అభ్యర్థుల్లో 23 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 18 శాతం మంది హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాల వంటి తీవ్ర అభియోగాలకు సంబంధించిన కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారు. పార్టీలవారీగా చూస్తే మజ్లిస్‌లో 50 శాతం, సమాజ్‌వాదీలో 40 శాతం, కాంగ్రెస్‌లో 39 శాతం, శివసేనలో 33 శాతం, బీజేపీలో 30 శాతం, టీఎంసీలో 29 శాతం, ఆర్జేడీలో 25 శాతం, శివసేన (ఉద్ధవ్)లో 13 శాతం మంది అభ్యర్థులపై తీవ్ర క్రిమినల్ కేసులున్నాయి. మొత్తమ్మీద 29 మంది అభ్యర్థులు మహిళలపై నేరాలకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.



33 శాతం కోటీశ్వరులు

ఐదో విడత అభ్యర్థుల్లో 33 శాతం మంది కోటీశ్వరులని ఏడీఆర్ నివేదిక తెలిపింది. యూపీలోని ఝాన్సీ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి అనురాగ్ శర్మ అత్యధికంగా రూ.212 కోట్ల ఆస్తులు ప్రకటించారు. మహారాష్ట్రలోని బివాండీ స్వతంత్ర అభ్యర్థి నీలేశ్ భగవాన్ సాంబ్రే రూ.116 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. తర్వాత రూ.110 కోట్లతో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ (మహారాష్ట్ర ముంబై నార్త్) మూడో స్థానంలో ఉన్నారు. సురేష్ గోపీనాథ్ మాత్రే (ఎన్సీపీ–ఎస్పీ) రూ.107 కోట్లు, కృష్ణానంద్ త్రిపాఠీ (కాంగ్రెస్) రూ.70 కోట్లు, సంగీత కుమారీ సింగ్‌దేవ్ (బీజేపీ) రూ.67 కోట్లు, రవీంద్ర దత్తారాం వైఖర్ (శివసేన) రూ.54 కోట్లు, కపిల్ మోరేశ్వర్ పాటిల్ (బీజేపీ) రూ.49 కోట్లు, కరణ్ భూషణ్ సింగ్ (బీజేపీ) రూ.49 కోట్లు, సంజయ్ మఫత్‌లాల్ మొరాఖియా (స్వతంత్ర) రూ.48 కోట్లతో టాప్ 10లో ఉన్నారు.

విద్యార్హతలు

42 శాతం మంది అభ్యర్థుల విద్యార్హత ఐదు నుంచి పన్నెండో తరగతిలోపే. వీరిలో 21 మంది ఐదో తరగతి వరకే చదివారు. 64 మంది ఎనిమిదో తరగతి, 97 మంది పదో తరగతి గట్టెక్కారు. 50 శాతం మందికి గ్రాడ్యుయేషన్, అంతకంటే ఉన్నత విద్యార్హతలున్నాయి. 26 శాతం మంది డిప్లొమా చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇండోర్‌లో ఉచిత పోహా, జిలేబీ..

ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఎవరి స్థాయిలో వారు పనిచేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉచితంగా పోహా, జిలేబీ పంచారు. రాష్ట్రంలో 29 లోక్‌సభ స్థానాలకు గాను.. చివరి 8 స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. అందులో ఇండోర్ నియోజకవర్గం కూడా ఉంది. అయితే.. ఇక్కడ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రఖ్యాత ఫుడ్ స్ట్రీట్ '56 దుకాణ్' చొరవ తీసుకుంది. ఓటేసి వచ్చినవారికి పోహా, జిలేబీ ఉచితంగా పంచుతామని ప్రకటించింది. అన్నట్టుగానే సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9.30 వరకు ఓటేసిన వారికి పోహా, జిలేబీని అందించింది. దాదాపు 3 వేల మంది ఉచితంగా తిన్నారు. అందుకోసం ఐదు క్వింటాళ్ల పోహా అవసరమైందని వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గుంజన్ శర్మ చెప్పారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతకు, ఓటేసిన వృద్ధులకు అదనంగా ఐస్‌క్రీమ్ కూడా అందించారు. 25 లక్షలకు పైగా ఓటర్లున్న ఇండోర్ లోక్‌సభ స్థానం రాష్ట్రంలోనే పెద్దది. ఇక్కడ 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 1989 నుంచి ఇది బీజేపీ కంచుకోటగా ఉంది.

ఓటేస్తే ఉచిత బైక్ రైడ్

అవును! పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటేసి.. తిరిగి ఇంటికి వెళ్లేప్పుడు ర్యాపిడో బుక్ చేసుకుంటే చాలు. ఉచితంగా ఇంటికి తీసుకెళ్లి దింపేస్తారు. ఓహో సూపరని ఆనందిస్తున్నారా? అయితే ఈ ఆఫర్ మన రాష్ట్రంలో కాదు. దేశ రాజధాని ఢిల్లీలో. అక్కడ ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ సంస్థలు పాటుపడుతున్నాయి. ర్యాపిడో ఈ ప్రక్రియలో భాగస్వామ్యమైంది. ఓటర్లు ఓటేసిన అనంతరం పోలింగ్ బూత్‌ల నుంచి ఇంటికి చేరుకునేందుకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బైక్ టాక్సీ కంపెనీతో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మే 25న ఢిల్లీ లోక్‌సభ పోలింగ్ రోజున జరగనుంది. ఆ రోజు ఓటేసిన అనంతరం ప్రయాణికులు బైక్ బుక్ చేసుకుని ఉచితంగా ప్రయాణించవచ్చు. ఢిల్లీలో 80 లక్షల మంది ర్యాపిడో సబ్‌స్క్రైబర్లు ఉండగా.. ఆ సంస్థకు ఎనిమిది లక్షల మంది బైక్ డ్రైవర్లు ఉన్నారు.



రా రమ్మని.. రారా రమ్మని

ఓటర్లకు టెక్ కంపెనీల పిలుపు

భారీ సంఖ్యలో ఉపాధికి నెలవైన ఐటీ, టెక్నాలజీ కంపెనీలు కీలకమైన లోక్‌సభ ఎన్నికల్లోనూ తమ వంతు బాధ్యత నిర్వహిస్తున్నాయి. తమ ఉద్యోగులతో పాటు ప్రజలను కూడా ఓటేలా ప్రోత్సహిస్తున్నాయి. ఓటేయడం పౌరుల బాధ్యత మాత్రమే కాదని, సామూహిక సంకల్ప శక్తికి సంకేతమని పేర్కొంటున్నాయి. భవిష్యత్ మార్గనిర్దేశకుల్ని ఎంచుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని గుర్తు చేస్తున్నాయి. ఇప్పటిదాకా ముగిసిన నాలుగు విడతల పోలింగ్‌లోనూ టెక్ కంపెనీల ప్రచారం చెప్పుకోదగ్గ రీతిలో పని చేసింది.

ఫ్లిప్‌కార్ట్

''మీ ఓటును ధ్రువీకరించుకున్నారా?'' అంటూ ప్రముఖ ఈ కామర్స్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్ పోలింగ్ తేదీల్లో 'ఎక్స్' వేదికగా యూజర్లను అప్రమత్తం చేస్తూ వస్తోంది.

ఈజ్ మై ట్రిప్

''రోడ్డెక్కండి. లోక్‌సభ ఎన్నికల వేళ మీ మూలాలకు (నియోజకవర్గాలకు) తిరిగి వెళ్లండి. చూడని ప్రదేశాలను అన్వేషించండి'' అంటూ ఆన్‌లైన్ ట్రావెల్ సేవల బుకింగ్ కంపెనీ ఈజ్ మై ట్రిప్ పిలుపునిచ్చింది.

మొబిక్విక్

''డిజిటల్ ఆవిష్కరణల నుంచి దేశ భవిత దాకా అన్నీ కేవలం ఒక్క ట్యాప్‌తోనే'' అంటూ ఫిన్‌టెక్ సంస్థ మొబిక్విక్ 'ఎక్స్' పోస్ట్ ద్వారా ఓటింగ్ హక్కు వినియోగ ప్రాధాన్యతను గుర్తు చేసింది.

జొమాటో

''ఎవరు నాయకత్వం వహించాలో ఓటుతో నిర్ణయించడం కంటే ఏం తినాలో నిర్ణయించుకోవడం అంత ముఖ్యమేమీ కాదు'' అంటూ ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం జొమాటో కూడా ఎక్స్ ద్వారా తన కస్టమర్లకు ఓటు సందేశం ఇచ్చింది.

ఓలా

''మన తాతలు స్వాతంత్ర్యం కోసం పోరాడారు. మన తల్లిదండ్రులు రోటీ, కపడా, మకాన్ కోసం పోరాటం చేశారు. మన కలలకు తగ్గట్టుగా దేశాన్ని నిర్మించడం మన తరం బాధ్యత'' అంటూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓలా సీఈవో భవీశ్ అగర్వాల్ ఎక్స్ ద్వారా కోరారు.

స్విగ్గీ

''తర్వాత ఏం తినాలా అంటూ గంటల తరబడి సమయం వెచ్చించేవారు తదుపరి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు సైతం అంతే సమయాన్ని కేటాయించాలి'' అని ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ పిలుపునిచ్చింది. ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేసింది.

ఓయో

''సరైన ప్రభుత్వం కొలువుదీరేలా చూడండి. వెళ్లి ఓటు వేయండి'' అని హోటల్ బుకింగ్ సేవల యాప్ ఓయో కోరింది.

ర్యాపిడో

క్యాబ్ సేవల సంస్థ ర్యాపిడో పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వారి కోసం ఉచిత రైడ్లు ఆఫర్ చేస్తోంది. ఇందుకోసం వోట్‌నౌ కూపన్ వాడుకోవాలని సూచించింది. ''ఓటేయడం మీ బాధ్యత. మిమ్మల్ని పోలింగ్ బూత్‌కు చేర్చడం మా బాధ్యత'' అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

నమ్మ యాత్రి

''మీ దేశ తదుపరి గమ్యస్థానం కేవలం ఒక ప్రెస్ (క్లిక్) దూరంలోనే ఉంది'' అంటూ క్యాబ్ సేవలను ఆఫర్ చేసే బెంగళూరు కంపెనీ నమ్మయాత్రి ఓటర్లకు ఇచ్చిన సందేశానికి నగరంలో పోలింగ్ సందర్భంగా బాగా ఆదరణ లభించింది.

ఇన్‌స్టాగ్రామ్

ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సోషల్ మీడియా యాప్ ఇన్‌స్టాగ్రామ్ సైతం ప్రయత్నిస్తోంది. పోలింగ్ రోజున ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో సందేశాల ద్వారా యూజర్లను అప్రమత్తం చేస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

మాజీ మామా అల్లుళ్ల సవాల్

శ్రీరాంపూర్‌లో పర్సనల్ ఫైట్

సిట్టింగ్ ఎంపీ బెనర్జీపై మాజీ అల్లుడు కబీర్ పోటీ

గట్టి పోటీ ఇస్తున్న సీపీఎం యువ అభ్యర్థి దీప్సిత

కీలకం

పశ్చిమబెంగాల్లోని శ్రీరాంపూర్ లోక్‌సభ స్థానంలో ఎన్నికలు మాజీ మామా అల్లుళ్ల మధ్య పోరుగా మారాయి. టీఎంసీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ కళ్యాణ్ బెనర్జీపై ఆయన మాజీ అల్లుడు కబీర్ శంకర్ బోస్‌ను బీజేపీ బరిలోకి దింపింది. మూడుసార్లు నెగ్గిన కళ్యాణ్ పట్టు నిలుపుకునే ప్రయత్నాల్లో ఉంటే ఇక్కడ ఎలాగైనా ఖాతా తెరవాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. శ్రీరాంపూర్ ఒకప్పుడు పారిశ్రామిక కేంద్రంగా, కమ్యూనిస్టుల కంచుకోటగా విలసిల్లింది. అక్కడ కాంగ్రెస్ మద్దతుతో మళ్లీ ఎర్రజెండా ఎగరేసేందుకు యువ నాయకురాలు దీప్సితా ధర్‌ను సీపీఎం రంగంలోకి దింపింది...

– సాక్షి, నేషనల్ డెస్క్

హుగ్లీ నది.. శ్రీరాంపూర్ సంక్షిప్తమైన చరిత్రకు సాక్షి. ఇదే ఇక్కడి ఒండ్రుమట్టిని అన్నం గిన్నెగా మార్చింది. జనపనార, పత్తి, కాగితం పరిశ్రమల ఏర్పాటుతో స్థిరమైన పారిశ్రామికీకరణ జరిగింది. కానీ ఇప్పుడు హింద్ మోటార్స్ మూతబడింది. పత్తి మిల్లులు చరిత్ర పుటల్లోనే మిగిలాయి. జూట్, పేపర్ మిల్లులు లాక్‌డౌన్లను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు వ్యవసాయ, పారిశ్రామిక శక్తిగా వేలాది మంది వలసదారులకు ఉపాధి కల్పించిన ఈ నేల నుంచి ఇప్పుడు వలసలు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు జరిగిన 17 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం ఏడుసార్లు, టీఎంసీ, కాంగ్రెస్ నాలుగేసి సార్లు, సీపీఐ రెండుసార్లు చొప్పున శ్రీరాంపూర్‌ను గెలుచుకున్నాయి. దేశంలో బీజేపీ ఎన్నడూ గెలవని లోక్‌సభ స్థానాల్లో ఇదీ ఒకటి.



బెనర్జీది దిగజారుడుతనం: బోస్..

కేవలం ఎన్నికల విజయం కోసం వ్యక్తిగత విషయాలను వక్రీకరించి ప్రజల ముందు పెట్టే స్థాయికి బెనర్జీ దిగజారిపోయారంటూ కబీర్ దుయ్యబడుతున్నారు. ఆయన సానుభూతి డ్రామా ఫలించదని, ప్రజలకు అంతా తెలుసని చెప్పుకొచ్చారు. ''కేవలం బెనర్జీ వల్లే ఆయన కూతురితో నా వైవాహిక బంధం విచ్ఛిన్నమైంది. తను మళ్లీ పెళ్లి కూడా చేసుకుంది. అలాంటప్పుడు కూతురి గత జీవితాన్నే ఇలా ప్రచారానికి వాడుకోవడం చౌకబారుతనం'' అంటూ మండిపడ్డారు. మాజీ మామకు గట్టి పోటీ ఇచ్చి తీరతానని కబీర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ''బెంగాల్లో పరిస్థితి మారింది. మమత ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న పురోగతి, అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. సామాన్యులంతా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బెనర్జీ లక్ష పైచిలుకు ఓట్ల తేడాతో నా చేతిలో ఓడటం ఖాయం. బీజేపీకి బెంగాల్లో 35 లోక్‌సభ స్థానాలకు పైగా వస్తాయి'' అని బోస్ జోస్యం చెబుతున్నారు.

ప్రజల విచక్షణపై నమ్మకముంది: బెనర్జీ

న్యాయశాస్త్ర పట్టభద్రుడైన కళ్యాణ్ బెనర్జీ సీఎం మమతకు నమ్మకస్తుడు. 2001లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తరువాత శ్రీరాంపూర్ నుంచి మూడుసార్లు ఎంపీ అయ్యారు. తన కూతురిని వేధించి చివరికి విడాకులు తీసుకున్న వ్యక్తికి టికెటివ్వడం బీజేపీ కుత్సిత మనస్తత్వానికి నిదర్శనమని బెనర్జీ మండిపడ్డారు. బోస్‌కు తన మాజీ అల్లునిగా తప్ప మరో గుర్తింపే లేదంటూ ఎద్దేవా చేశారు. ''నేను మాట నిలుపుకునే వ్యక్తినని నియోజకవర్గ ప్రజలకు తెలుసు. వాళ్లు ఈసారీ నన్నే గెలిపిస్తారు. శ్రీరాంపూర్ నుంచి అత్యధికసార్లు ఎంపీగా గెలిచిన రికార్డు నాకు కట్టబెడతారు'' అని అన్నారాయన.

తక్షణావసరం 'భారత్ బచావో'

సీపీఎం అభ్యర్థి దీప్సితా ధర్ జేఎన్‌యూ విద్యార్థి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బాలీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకురాలిగా, సామాజిక కార్యకర్తగా, మోటివేషనల్ స్పీకర్‌గా, రెడ్ వాలంటీర్‌గా బాగా పేరు సంపాదించారామె. సీఏఏ, ఎన్ఆర్సీ పేరుతో ప్రజలను మత ప్రాతిపదికన విభజించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు బెంగాల్లో ఫలించబోవని అంటున్నారు. ''3 కోట్ల ఉద్యోగాలిస్తానన్న మోదీ మాటలు బూటకమని తేలిపోయింది. ప్రజలు అన్నివిధాలా మోసపోయారు. పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధి, మహిళల సాధికారత, భద్రత, యువతకు ఉద్యోగావకాశాలు, అవినీతిరహిత అభివృద్ధి సీపీఎంతోనే సాధ్యం'' అంటూ దీప్సిత చేస్తున్న ప్రచారానికి మంచి స్పందన వస్తోంది.

మోదీకి ఆయన స్టైల్లోనే బదులిస్తా

ప్రజాస్వామ్యంలో ఏకగ్రీవాలు సరికాదు ● పోటీ ఉండాల్సిందే: శ్యాం రంగీలా

ఇంటర్వ్యూ

శ్యామ్ రంగీలా. మిమిక్రీ సంచలనం. ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ వంటి నేతలను అనుకరిస్తూ 2017లో ఆయన చేసిన వీడియోలు తెగ వైరల్ అయ్యాయి. సరిగ్గా ఏడేళ్ల తరవాత ఆయన స్వతంత్ర అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతున్నారు. అది కూడా వారణాసిలో మోదీపైనే పోటీ చేస్తున్నారు! రాజస్తాన్‌లోని శ్రీగంగానగర్‌కు చెందిన శ్యామ్ యూట్యూబ్ చానల్‌కు దాదాపు కోటిమంది సబ్‌స్క్రైబర్లున్నారు. మోదీని అనుకరిస్తూ 'ధంగ్ కీ బాత్' షో కూడా నడుపుతున్నారాయన. ఒకప్పుడు మోదీకి మద్దతు పలికిన శ్యామ్ ఆయనపైనే ఎందుకు పోటీ చేయాలనుకుంటున్నారు? ఇలాంటి పలు ప్రశ్నలకు ఆయన ఇచ్చిన సమాధానాలు... – సాక్షి, నేషనల్ డెస్క్

ప్రధానిపై ఎందుకు పోటీ చేయాలనుకుంటున్నారు?

ఇటీవల సూరత్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో బీజేపీ ఏకగ్రీవంగా గెలిచింది. అది సరికాదనిపించింది. ఎన్నికల ప్రక్రియే ప్రజాస్వామ్యానికి ప్రాణం. పోటీ ఉండాలి. అలా కాకుండా బీజేపీ తన ప్రత్యర్థుల నామినేషన్లను విత్‌డ్రా చేయిస్తోంది. అందుకే నేను పోటీ చేస్తున్నా. ఒక సామాన్యుడు ప్రధానిపైనే పోటీలో నిలబడ్డాడనే సందేశాన్ని ప్రజలకు ఇవ్వాలనుకుంటున్నా.

మీది రాజకీయ ప్రధాన హాస్యం. ప్రస్తుతం దేశ రాజకీయాల తీరుపై ఏమంటారు?

ఇప్పుడు రాజకీయాలే అతి పెద్ద కామెడీ. రాజకీయాల్లో హాస్యానికి కొదవే లేదు. కమెడియన్లను నిషేధించి రాజకీయాలు చేస్తున్నారు.

ఎన్నికల్లో పోటీ ఖర్చుతో కూడింది. మరి మీకు డబ్బులెలా...?

నా దగ్గర ఏమీ లేవు. నేనేం చేసినా ప్రజల సాయంతోనే. 'అభీ తో జోలా హై బస్. ఉఠాకే చల్ దేంగే, ఔర్ క్యా?' (నా దగ్గరున్నది జోలె మాత్రమే. అది తీసుకుని రోడ్డున పడతానంతే)

'జోలా ఉఠాకే' అన్నది ప్రధాని మోదీ డైలాగ్ కదా! ఒకప్పుడు ప్రధాని మద్దతుదారుగా ఉన్న మిమ్మల్ని మార్చిందేమిటి?

2016 దాకా ప్రధానికి అభిమానినే. బీజేపీ అధికారంలోకి రాగానే ఇక అవినీతి పోతుందని, పెద్ద మార్పు వస్తుందని చాలామందిమి భావించాం. అందుకే ఆయనకు మద్దతుగా పోస్టులు పెట్టేవాన్ని. ద గ్రేట్ ఇండియన్ లాఫ్టర్ చాలెంజ్‌కు ఎంపికైనప్పుడు ఎగిరి గంతేశా. మోదీని అనుకరిస్తూ నేను చేసిన వీడియోకు ప్రశంసలొచ్చాయి. కానీ అది ప్రసారమే కాలేదు. ప్రభుత్వం వద్దందని చానల్ వాళ్లు చెప్పారు. నేను మోదీని అనుకరించానంతే. ఎందుకు వద్దన్నారో అర్థం కాలేదు.

రాజకీయాలపై హాస్యానికి చాలా దేశాల్లో ఆదరణ ఉంది. భారత్‌లో పరిస్థితి ఏమిటనుకుంటున్నారు?

ఇక్కడ వ్యంగ్యాన్ని, హాస్యాన్ని అర్థం చేసుకోవడంలో లోపం ఉంది. రాజకీయాలపై హాస్యం ఇక్కడ పని చేయదు. అందుకే చానళ్లలో పొలిటికల్ కామెడీ షోలే ఉండవు. రాహుల్ గాంధీపై జోకేస్తే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆహ్వానించవు, మోదీ మీద కామెడీ చేస్తే బీజేపీ ఊరుకోదు. అందుకే నా యూట్యూబ్‌లో వీడియోలు చేయాలని నిర్ణయించుకున్నా.

వారణాసిలో ప్రచారమెలా ఉంది?

బాగా సాగుతోంది. నలుగురైదుగురు స్నేహితులు నా వెంట వచ్చారు. ఇక్కడ మరింతమంది కలిసొస్తున్నారు.

మీకు వారణాసి ప్రజల మద్దతు ఉందనుకుంటున్నారా?

కచ్చితంగా. పోటీ చేస్తానని ప్రకటించినప్పటి నుంచే నాకు మద్దతుగా సందేశాలు వస్తున్నాయి. వరుస కాల్స్ వస్తున్నాయి.

ప్రచారంలోనూ మోదీని మీ స్టయిల్లో అనుకరిస్తారా?

తప్పకుండా. మోదీకి ఆయన శైలిలోనే బదులిస్తానని ఇప్పటికే చెప్పా కూడా.




కొడంగల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



చింతమడకలో ఓటు వేసేందుకు వచ్చి స్థానికులను పలకరిస్తున్న మాజీ సీఎం కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ


నందినగర్ కమ్యూనిటీ హాల్‌లో భార్య, కుమారుడితో కలిసి ఓటువేసి వేలిపై సిరా గుర్తును చూపిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్


కుమారుడు, భార్యతో కలిసి సిద్దిపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

దౌడు తీసి.. ఓటేసి


సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం రేబల్లె గ్రామ మాజీ సర్పంచ్ నరసింహమూర్తి సోమవారం గుర్రంపై పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.
- హుజూర్‌నగర్ (చింతలపాలెం)

వైకల్యాన్ని 'కాళ్ల' రాశాడు


మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి రామకృష్ణాపూర్‌కు చెందిన దివ్యాంగుడు సతీశ్‌కు రెండు చేతులూ లేవు. సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాలి వేళ్లతోనే సంతకం చేసి ఓటు వేశాడు. ఎన్నికల సిబ్బంది కాలి వేలికే సిరా చుక్క వేశారు.
- రామకృష్ణాపూర్

శభాష్ బామ్మ


సంగారెడ్డిలో లేవలేని స్థితిలో ఉన్న 95 ఏళ్ల వృద్ధురాలు రాజరాజేశ్వరి కుటుంబ సభ్యుల సాయంతో వచ్చి ఓటు వేసింది.

ఇది పోలింగ్ కేంద్రమే..


నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని రాయలేటిపెంటలో చెంచులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్–శ్రీశైలం రహదారిలో ఉన్న వటవర్లపల్లి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ చెంచు ఆవాసంలోని 33 మంది చెంచు ఓటర్ల కోసం ఎన్నికల సంఘం పోలింగ్ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయగా 29 మంది ఓటు వేశారు.
- సాక్షి, నాగర్ కర్నూల్

పెళ్లి సమయం మార్చుకుని ఓటేసిన నవదంపతులు


పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజైన సోమవారం ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా కామారెడ్డి జిల్లా బోర్లంలో పెళ్లి సమయాన్ని మార్చారు. ఉదయం 10 గంటలకు జరగాల్సిన వివాహాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు జరిపారు. పెళ్లికూతురు నుస్రత్ బేగం ఉదయం బోర్లం గ్రామంలో ఓటు వేయగా, పెళ్లి కుమారుడు షేక్ ఆసిఫ్ జీర్కూర్ గ్రామంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఓట్ల పండుగలో తాము పాలుపంచుకున్నందుకు సంతోషంగా ఉందని వారు చెప్పారు.
- బాన్సువాడ రూరల్

64.93% పోలింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తలేదని వికాస్‌రాజ్ వివరించారు. 115 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో సమస్యలు వస్తే.. వాటిని మార్చామని తెలిపారు. కచ్చితమైన పోలింగ్ శాతంపై మంగళవారం స్పష్టత వస్తుందన్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడలేదన్నారు.

వాతావరణం సహకరించడంతో..

రాష్ట్రంలో ఇటీవలి వానలతో వాతావరణం చల్లబడింది.ఉదయమే వడివడిగా ప్రారంభమై రోజంతా స్థిరంగా పోలింగ్ కొనసాగింది. ఉదయం 9 గంటల కల్లా 9.4 శాతం, 11 గంటలకు 24.31 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 40.38, 3 గంటలకు 52.34 శాతం, సాయంత్రం 5 గంటలకల్లా 61.16 శాతానికి చేరినట్టు అధికారులు ప్రకటించారు. కొన్నిచోట్ల ఓటర్లు బారులు తీరడంతో రాత్రి 8, 9 గంటల దాకా పోలింగ్ కొనసాగింది. దీంతో లెక్కలపై స్పష్టత రాలేదు. రాత్రి 12 వరకు వేసిన అంచనాల మేరకు 64.93 శాతం పోలింగ్ నమోదైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 62.69 శాతం పోలింగ్ నమోదైంది, గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 71.97 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి గత లోక్‌సభ ఎన్నికలకన్నా ఎక్కువగా పోలింగ్ నమోదైంది.

వందల కొద్దీ ఫిర్యాదులు

పోలింగ్ రోజైన సోమవారం నేషనల్ గ్రీవెన్స్ పోర్టల్‌కు 415, టోల్ ఫ్రీ నంబర్‌కు 21, సీ–విజిల్ యాప్ ద్వారా 225 ఫిర్యాదులు వచ్చాయని.. వాటిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్నామని సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. పోలింగ్ రోజు జరిగిన వేర్వేరు ఘటనలకు సంబంధించి 38 కేసులు నమోదు చేశామన్నారు. ఇంకా కొన్ని ఫిర్యాదులపై పరిశీలన జరుగుతోందని, కేసుల సంఖ్య పెరగవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల గుర్తింపును తనిఖీ చేసే అధికారం అభ్యర్థులకు ఉండదని.. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఓటర్ల గుర్తింపును తనిఖీ చేసిన ఓ అభ్యర్థి (బీజేపీ అభ్యర్థి మాధవీలత)పై కేసు నమోదు చేశామన్నారు. జహీరాబాద్, నిజామాబాద్‌లలో జరిగిన ఘటనపైనా కేసులు పెట్టామన్నారు. ఎన్నికలకు సంబంధించి మార్చి 1 నుంచి ఇప్పటివరకు రూ.330 కోట్ల నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర సాయుధ బలగాలతో తొలి అంచె, రాష్ట్ర సాయుధ పోలీసు బలగాలతో రెండో అంచె, స్థానిక పోలీసులతో మూడో అంచె బందోబస్తు నిర్వహిస్తారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పరిస్థితిని సీసీ కెమెరాల ద్వారా నిరంతరం ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. రాజకీయ పార్టీలు తమ ప్రతినిధులను స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కాపలాగా పెట్టాలనుకుంటే.. వారికి అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ముగిసిన తర్వాత 45 రోజుల వరకు ఈ భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయి. ఎన్నికల ఫలితాల తర్వాత వాటిని సవాల్ చేస్తూ 45రోజుల్లోగా కోర్టులో ఎలక్షన్ పిటిషన్లు వేయడానికి అవకాశం ఉండటమే దీనికి కారణం.

నేడు 'పరిశీలకుల' ఆధ్వర్యంలో ఈవీఎంల తనిఖీలు

పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రిసైడింగ్ అధికారులు ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని సంబంధిత రిసెప్షన్ కేంద్రంలో అందజేస్తారు. అక్కడ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రికి ప్రాథమిక పరిశీలన నిర్వహిస్తారు. ఫారం–17సీ, ఈవీఎం, వీవీ ప్యాట్స్‌ను పరిశీలించి చూస్తారు. మొత్తం ఓట్లు, పోలైన ఓట్లను సరిచూసుకుంటారు. అన్నీ సవ్యంగా ఉన్నట్టు నిర్ధారించుకున్న తర్వాత ఎన్నికల పరిశీలకుడు ఈ అంశాలను ధ్రువీకరిస్తూ సంతకం చేస్తారు. తర్వాత ప్రిసైడింగ్ అధికారులను పంపించివేస్తారు. ఈవీఎంలను సంబంధిత నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారు. కొన్నిచోట్లలోని రిసెప్షన్ కేంద్రాల్లోనే స్ట్రాంగ్ రూమ్‌లు ఉండగా.. మరికొన్ని చోట్ల వేరే ప్రాంతాల్లో ఉన్నాయి. అలా ఉన్న చోట కేంద్ర బలగాల భద్రత నడుమ జీపీఎస్ సదుపాయమున్న వాహనాల్లో ఈవీఎంలను తరలించి భద్రపరుస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పోలింగ్ బృందాలు.. రిసెప్షన్ సెంటర్‌కు వచ్చి, అప్పగింత ప్రక్రియ పూర్తి చేసే సరికి.. మంగళవారం తెల్లవారుజాము 5 గంటల వరకు పట్టే అవకాశం ఉందని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. తర్వాత మంగళవారం ఉదయం 11 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాధారణ పరిశీలకులు ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రి, ప్రిసైడింగ్ అధికారుల నుంచి వచ్చిన రిపోర్టులు, డైరీలను తనిఖీ చేసి అంతా సవ్యంగా ఉన్నట్టు నిర్ధారిస్తారని వివరించారు. ఏదైనా ప్రాంతంలో రిపోలింగ్ అవసరం ఉంటే.. అప్పుడే నిర్ణయం తీసుకుంటారని, ఇప్పటివరకు అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాలేదని వెల్లడించారు.


పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఓ పోలింగ్ బూత్‌లో బారులు తీరిన మహిళా ఓటర్లు

రాత్రి 12 గంటలకల్లా పోలింగ్ శాతం అంచనాలివీ..

లోక్‌సభ స్థానం	పోలింగ్ శాతం
ఆదిలాబాద్	72.96
పెద్దపల్లి	67.88
కరీంనగర్	72.33
నిజామాబాద్	71.50
జహీరాబాద్	74.54
మెదక్	74.38
మల్కాజ్‌గిరి	50.12
సికింద్రాబాద్	48.11
హైదరాబాద్	46.08
చేవెళ్ల	55.45
మహబూబ్‌నగర్	71.54
నాగర్‌కర్నూల్	68.86
నల్లగొండ	73.78
భువనగిరి	76.47
వరంగల్	68.29
మహబూబాబాద్	70.68
ఖమ్మం	75.19
రాష్ట్ర సగటు	64.93

మళ్లీ బద్ధకించిన హైదరాబాదీలు!

ఓటేసేందుకు హైదరాబాద్–సికింద్రాబాద్ జంటనగరాల ప్రజలు మళ్లీ బద్ధకించారు. రాత్రి 12 గంటలకు ప్రకటించిన పోలింగ్ శాతం అంచనాల మేరకు.. రాష్ట్రంలోనే అత్యల్పంగా హైదరాబాద్ స్థానం పరిధిలో 46.08 శాతం పోలింగ్ నమోదైంది. తర్వాత సికింద్రాబాద్ పరిధిలో 48.11 శాతం, మల్కాజ్‌గిరి పరిధిలో 50.12 శాతం, చేవెళ్ల పరిధిలో 55.45 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. అత్యధికంగా భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలో 76.47 శాతం, జహీరాబాద్ పరిధిలో 74.54 శాతం పోలింగ్ నమోదయ్యాయి. అయితే హైదరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారని.. దీనికితోడు సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయం పెంచడంతో.. ఈసారి పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని సీఈవో వికాస్‌రాజ్ పేర్కొన్నారు.


ఓటర్లు రాకపోవడంతో చంపాపేటలో బోసిపోయిన ఓ పోలింగ్ కేంద్రం


కాచిగూడ లింగంపల్లిలోని దీక్షా మోడల్‌స్కూల్‌లో ఓటు వేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు



మధిరలో ఓటేసిన భట్టి విక్రమార్క, కుటుంబ సభ్యులు

→ తల్లితో కలిసి ఓటేసేందుకు వస్తున్న బండి సంజయ్

తొమ్మిది సీట్లు పక్కా.. ఒకటి ఎక్స్‌ట్రా!

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళిపై కాంగ్రెస్ లెక్కలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళి తమకు అనుకూలంగానే ఉందని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. ఇక్కడి 17 లోక్‌సభ స్థానాలకు తొమ్మిది సీట్లలో విజయం ఖాయమని.. అదనంగా మరో స్థానమూ వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పోలింగ్ ముగిసిన అనంతరం ఓటింగ్ సరళిపై లెక్కలు వేసుకున్నారు. మొత్తమ్మీద పది చోట్ల బీజేపీతో, ఆరు స్థానాల్లో బీఆర్‌ఎస్‌తో గట్టి పోటీ జరిగిందని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆరు సీట్లలో కారుతో పోరు..

రాష్ట్రంలోని ఆరు స్థానాల్లో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌తోనే ఫైట్ జరిగిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. నాగర్‌కర్నూల్, నల్లగొండ, మహబూబాబాద్, ఖమ్మం, మెదక్, పెద్దపల్లి స్థానాల్లో గులాబీ పార్టీ, కాంగ్రెస్ మధ్య పోరు జరిగిందని చెప్తున్నారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బీజేపీకి సంస్థాగత బలం లేకపోవడం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ బలహీనం కాకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు. నల్లగొండ, ఖమ్మం, పెద్దపల్లి, మహబూబాబాద్‌లలో బీజేపీ అభ్యర్థులు బలహీనంగా ఉన్నారని.. నాగర్‌కర్నూల్‌లో కాస్త పోటాపోటీ ఉండవచ్చని పేర్కొంటున్నారు. మెదక్‌లో మాత్రం మూడు పార్టీల మధ్య హోరాహోరీ పోరు జరిగిందని.. ఇక్కడ బీఆర్‌ఎస్ సంస్థాగతంగా బలంగా ఉన్న నేపథ్యంలో బీజేపీ మూడో స్థానంలోకి వెళుతుందని అంచనా వేస్తున్నారు.

ఆ పది చోట్ల మరోలా పోటీ!

రాష్ట్రంలోని పది లోక్‌సభ స్థానాల్లో బీజేపీతోనే ముఖాముఖి పోరు జరిగిందని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. భువనగిరి, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, జహీరాబాద్ స్థానాల్లో బీజేపీతో ప్రధాన పోటీ జరిగిందని చెప్తున్నాయి. ప్రాథమిక అంచనాల మేరకు ఇందులో కరీంనగర్, నిజామాబాద్, మల్కాజ్‌గిరి స్థానాల్లో గెలుపునకు కొంత దూరంలో ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి. సికింద్రాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్‌లలో తీవ్ర పోటీ జరిగిందని.. ఆ సీట్లలో ఎవరు గెలుస్తారన్నది ఉత్కంఠగా ఉందని అంటున్నాయి. పోలింగ్ తీరుపై పరిశీలన సోమవారం జరిగిన లోక్‌సభ ఓటింగ్ సరళిని కాంగ్రెస్ పార్టీ నిశితంగా పరిశీలించింది. గాంధీభవన్‌లోని వార్ రూం వేదికగా టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ ఎప్పటికప్పుడు పోలింగ్ తీరును గమనిస్తూ.. పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లకు తగిన సూచనలు చేసింది. మరోవైపు కొడంగల్‌లో ఓటు వేసి వచ్చిన అనంతరం క్యాంపు కార్యాలయం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని సమీక్షించారు. పార్టీ అభ్యర్థులు, కీలక నేతలతో సంప్రదిస్తూ, సూచనలిస్తూ గడిపారు.

పోలింగ్ తీరుపై పరిశీలన

సోమవారం జరిగిన లోక్‌సభ ఓటింగ్ సరళిని కాంగ్రెస్ పార్టీ నిశితంగా పరిశీలించింది. గాంధీభవన్‌లోని వార్ రూం వేదికగా టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ ఎప్పటికప్పుడు పోలింగ్ తీరును గమనిస్తూ.. పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లకు తగిన సూచనలు చేసింది. మరోవైపు కొడంగల్‌లో ఓటు వేసి వచ్చిన అనంతరం క్యాంపు కార్యాలయం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని సమీక్షించారు. పార్టీ అభ్యర్థులు, కీలక నేతలతో సంప్రదిస్తూ, సూచనలిస్తూ గడిపారు.

ఓటు బ్యాంకు పదిలమే!

గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సుమారు 40శాతం ఓటు బ్యాంక్ పదిలంగానే ఉందని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. వీలైతే మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన తర్వాత 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సుమారు 30 శాతం ఓట్లు వచ్చాయని గుర్తు చేస్తున్నారు. అప్పుడు పార్టీకి కష్టకాలంలో లభించిన ఆ ఓటుబ్యాంకు ఇప్పుడు కచ్చితంగా మళ్లీ వచ్చి ఉంటుందని చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఓట్లను కొంత బీఆర్‌ఎస్ లాగేసిందని.. ఇప్పుడు మాత్రం ఆ వర్గాలకు చెందిన మెజార్టీ ఓటర్లు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని నేతలు అంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల అమలు, పంద్రాగస్టుకు రుణమాఫీ చేస్తామన్న హామీలు గ్రామీణ ఓటు బ్యాంకుతోపాటు మహిళా ఓట్లను కాంగ్రెస్ వైపు తిప్పగలిగాయని చెప్తున్నారు. అయితే బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు కొంతమేర బీజేపీ వైపు వెళ్లిందని.. కానీ అది బీజేపీ అభ్యర్థులను గెలిపించేంత స్థాయిలో జరగలేదని, అంటే బీజేపీ ఓటు బ్యాంకు పెరిగినా ఎక్కువ సీట్లు రాబోవని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని.. 10–12 సీట్ల వరకు వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

12కు పైగా స్థానాల్లో బీఆర్‌ఎస్ ధీమా

ఆ పార్టీ ప్రాథమిక అంచనా
- తగ్గిన పోలింగ్ శాతం పార్టీకి అనుకూలిస్తుందనే లెక్కలు
- ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో లబ్ధి జరుగుతుందనే అంచనాలు
- పోలింగ్ సరళిపై అధినేత కేసీఆర్ ఆరా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డజనుకు పైగా లోక్‌సభ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. సోమవారం ఉదయం నుంచి పోలింగ్ సరళిని విశ్లేషించిన పార్టీ.. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం పోగా మిగతా 16 స్థానాలకు గాను అరడజను స్థానాల్లో కాంగ్రెస్‌తో, మరో నాలుగు స్థానాల్లో బీజేపీతో ప్రధానంగా తలపడినట్లు లెక్కలు వేస్తోంది. ఆరు చోట్ల త్రిముఖ పోటీ నెలకొనగా వీటిలో కనీసం మూడుచోట్ల రెండు జాతీయ పార్టీలపై బీఆర్‌ఎస్ పైచేయి సాధించే అవకాశమున్నట్లు భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం తగ్గడం తమకు అనుకూలిస్తుందని ఆ పార్టీ విశ్లేషిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు దూరమై కాంగ్రెస్ వైపు మొగ్గుచూపిన వర్గాలు, ప్రస్తుతం బీజేపీ వైపు మొగ్గు చూపినట్లు భావిస్తోంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ వ్యతిరేక ఓటు భారీగా బీఆర్‌ఎస్‌కు బదిలీ అయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలింగ్ ప్రారంభమైన కొద్ది గంటల తర్వాత బీఆర్‌ఎస్ ఓటు బీజేపీకి క్రాస్ అవుతున్నట్టుగా కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసిందని పలువురు నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ పటిష్టమైన పార్టీ యంత్రాంగం ఉండటం కలిసి వచ్చే అంశంగా బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. బీజేపీకి పోలైన ఓట్లతో కాంగ్రెస్ పార్టీకే నష్టమని కూడా క్షేత్రస్థాయి నుంచి నివేదికలు అందినట్లు బీఆర్‌ఎస్ కీలక నేతలు చెప్తున్నారు.

అర డజను సీట్లలో కాంగ్రెస్‌తో పోటీ

కాంగ్రెస్‌తో ఆరు స్థానాల్లో ముఖాముఖి పోటీ జరిగినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, ఖమ్మం, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్ ప్రధాన పోటీదారుగా ఉన్నట్లు అంచనాకు వచ్చారు. కరీంనగర్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మెదక్ సెగ్మెంట్లలో బీజేపీ అభ్యర్థుల నుంచి గట్టి పోటీ ఎదురైందని చెబుతున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, భువనగిరి, మహబూబ్‌నగర్, చేవెళ్ల, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోటీ నెలకొనగా, వీటిలో కనీసం మూడు నుంచి నాలుగు స్థానాల్లో గెలుస్తామనే ధీమా బీఆర్‌ఎస్‌లో కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, పార్టీ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర, క్షేత్ర స్థాయిలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు సమన్వయంతో పని చేయడం తదితరాలు పార్టీకి అనుకూలించినట్లు భావిస్తున్నారు. రైతులు, మహిళలు, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులు ప్రధానంగా అనుకూల ఓట్లు వేసినట్లు పార్టీ అంచనాకు వచ్చింది. అయితే క్రాస్ ఓటింగ్‌తో బీజేపీకి భారీగా లబ్ధి జరుగుతుందనే వార్తల నేపథ్యంలో బూత్‌లవారీగా పార్టీ పోలింగ్ ఏజెంట్లు, కేడర్ నుంచి సమాచారం సేకరించి ఓ అంచనాకు రావాల్సిందిగా కేసీఆర్ ఆదేశించారు.



కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ భేటీ

స్వగ్రామం చింతమడకలో ఓటు వేసిన తర్వాత ఎర్రవల్లి నివాసానికి చేరుకున్న కేసీఆర్.. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ సరళిపై పార్టీ నేతలకు ఫోన్ చేసి ఆరా తీశారు. కాగా పోలింగ్ ముగిసిన తర్వాత సోమవారం రాత్రి కేటీఆర్, హరీశ్‌రావులు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో భేటీ అయ్యారు.

'ఓటు' వీడియోలు.. ఘర్షణలు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల చిన్న చిన్న ఇబ్బందులు, ఈవీఎంల మొరాయింపుల మధ్య లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తమ తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదంటూ మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని చింతలగడ్డ తండా వాసులు పోలింగ్‌ను బహిష్కరించారు. ఇదే సెగ్మెంట్ పరిధిలోని నెల్లికుదురు మండలం హేమ్లా తండాలో ఓ వ్యక్తి ఓటు వేస్తూ వీడియో తీశాడు. మహబూబాబాద్ గాంధీపురానికి ఓ యువకుడు తాను ఓటు వేసిన దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వరంగల్ జిల్లా సంగెం మండలం ఎల్గూర్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాట్‌లో వచ్చిన స్లిప్ ఫొటో తీసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టాడు. మరోవైపు జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ పాఠశాల పోలింగ్ బూత్‌లోకి నేతలు వెళ్లే విషయంలో కాంగ్రెస్–బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వివాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పలువురికి గాయాలయ్యాయి.

- తమ సమస్యలను పరిష్కరించలేదంటూ ఖమ్మం జిల్లా రాయమాదారం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గొల్లగూడెం, కొమ్ముగూడెం, పెద్దతోగు, రాయిగూడెం గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నచ్చచెప్పడంతో చివరికి ఓట్లు వేశారు.
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని సిర్లాహిల్స్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.
- నిజామాబాద్ జిల్లా బోధన్ ఉద్మీర్ గల్లీ కాలనీలోని 69వ పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో బీజేపీ కార్యకర్త నవీన్ గాయపడ్డారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ బాధితుడిని పరామర్శించారు.

కారు గుర్తు కనిపించకుండా ఇంకు మార్కు

శాంతినగర్: జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడ్ 167వ బూత్‌లో ఈవీఎం మిషన్‌లో కారు గుర్తుపై ఇంకు మార్కు రుద్దడం కలకలం రేపింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫొటో పక్కన ఉండే కారు గుర్తుపై మార్కర్‌తో ఇంకు రాసి కనపడకుండా చేశారని, దీంతో కారు గుర్తు కనబడక అరగంటసేపు ఓట్లు నష్టపోయామని, బూత్‌లో రీపోలింగ్ జరిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులను కోరారు. అయితే వెంటనే కారు గుర్తుపై ఉన్న ఇంకును తుడిపి వేయించిన అధికారులు పోలింగ్‌ను పునఃప్రారంభించారు. దీంతో పోలీసులు, అధికారులు, బీఆర్‌ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్పీ రితిరాజ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని.. ఈవీఎంను పరిశీలించి ఏ సమస్యా లేదని స్పష్టం చేశారు.



రెడ్ కార్పెట్



నిహారికా ఎన్.ఎమ్.

కాన్స్ ఫెస్టివల్‌లో
సినిమాలకు ఎంట్రీ దొరికినా
సెలబ్రిటీలకు ఆహ్వానం దొరికినా
చాలా ఘనత.
ఈసారి కాన్స్‌లో చాలా ఏళ్ల తర్వాత
ఒక భారతీయ సినిమా
ప్రదర్శితం కానుంది.
అదలా ఉంటే మన దేశానికి చెందిన
ముగ్గురు యువ ఇన్‌ఫ్లుయెన్సర్లను
కాన్స్ ఆహ్వానించింది.
మే 14-25 మధ్య జరగనున్న ఈ ఫెస్టివల్‌లో
ఆర్‌జె కరిష్మా, ఆస్థా షా, నిహారికా ఎన్.ఎమ్
రెడ్ కార్పెట్ మీద దర్జాగా నడవనున్నారు.
వారి పరిచయాలు.

కాన్స్‌లో ఆ ముగ్గురు



ఆర్‌జె కరిష్మా



ఆస్థా షా

ప్రపంచ సినిమా ప్రతిష్ఠాత్మకంగా భావించే కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ నేటి నుంచి (మే 14) నుంచి ఫ్రాన్స్‌లోని కాన్స్ నగరంలో ప్రారంభం కానుంది. ఆస్కార్ అవార్డ్స్‌తో సమానంగా కాన్స్ అవార్డులను భావిస్తారు. ఈసారి భారతదేశం నుంచి పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' సినిమా మెయిన్ కాంపిటీషన్‌లో ఎంట్రీ సాధించింది. సినిమాకు, సంస్కృతికి ప్రాధాన్యం ఇచ్చే ఈ ఫెస్టివల్‌లో భారతదేశం నుంచి కొంతమంది యువ ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఆహ్వానం అందింది. అతిరథ మహారథులతో కలిసి రెడ్ కార్పెట్ మీద నడిచే అవకాశం వీరు పొందారు. స్ఫూర్తినిచ్చే తమ జీవితాల ద్వారా, ప్రతిభ, విజయం ద్వారా వీరు అవకాశం పొందారు. అలాంటి ముగ్గురి పరిచయం.

ఆస్థా షా

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తన జీవిత పోరాటంతో ప్రభావం చూపుతున్న ఆస్థా షాది ఢిల్లీ. 24 ఏళ్ల ఆస్థా 8 ఏళ్ల వయసు నుంచి విటిలిగో (తెల్లమచ్చలు) బారిన పడింది. పూర్తిగా నివారణ లేని ఈ చర్మవ్యాధి ఆమె ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ప్రతి ఒక్కరూ 'ఈ అమ్మాయికి పెళ్లవుతుందా' అని తల్లిదండ్రులను వేధించేవారు. అన్ని రకాల వైద్య విధానాలతో విసిగిపోయిన ఆస్థా నేను ఎలా ఉన్నా నా జీవితం ముఖ్యం అనుకుని చదువు మీద దృష్టి పెట్టింది. మంచి ప్రతిభ చూపి ఇప్పుడు హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్‌లో ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా పని చేస్తోంది. ఇన్‌స్టా, ట్విటర్ ద్వారా పాపులర్ అయ్యి డబ్బు సంపాదిస్తోంది. 'ఆడపిల్లలకు విటిలిగో ఉంటే ఆ అమ్మాయిలను తల్లిదండ్రులే ఇంటి నుంచి బయటకు రానీకుండా చూస్తారు. ఆమెను న్యూనతకు గురి చేస్తారు. విటిలిగో కేవలం ఒక చర్మస్థితి. ఇప్పుడు నేను పూర్తి విటిలిగోతో తెల్లగా అయిపోయాను. కాని నా జీవితాన్ని సమర్థంగా జీవిస్తున్నాను. మీరు ఎలా ఉన్నారో అలా కనపడుతూ ముందుకు సాగిపోండి' అని చెప్పి లక్షలాది మంది అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం పెంచుతోంది ఆస్థా. అందుకే ఆమెకు ఆహ్వానం.

ఆర్‌జె కరిష్మా

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా నెలకు 30 లక్షలు సంపాదిస్తున్న కరిష్మా బహురూపాలు వేసి కామెడీ చేయడంలో నేర్పరి. చిన్నప్పుడు ఒక రోజు కరిష్మా గదిలో నుంచి రకరకాల గొంతులు వినిపిస్తుంటే తల్లి కంగారుపడి తలుపు తట్టి 'కరిష్మా నీతో ఎవరున్నారు' అని అడిగితే తలుపు తెరిచిన కరిష్మా అవన్నీ తాను మిమిక్రీ చేస్తున్న గొంతులని చెప్పింది. జమ్ము కశ్మీర్‌కు చెందిన కరిష్మా నటి కావాలనుకుని ఆర్.జె. అయ్యి ఆ తర్వాత కామెడీ బిట్స్ చేసే యూట్యూబర్‌గా ఖ్యాతి పొందింది. ఇండోర్‌లో రెడ్ ఎఫ్.ఎం.లో పని చేసేటప్పుడు ఆమె షో సూపర్‌హిట్ అయ్యింది. మానవ ప్రవర్తనల్లోని భిన్నత్వాన్ని ఆమె చూపే విధానం వల్ల చాలా సీరియస్ విషయాలను కూడా తేలిగ్గా తీసుకుని ముందుకు సాగవచ్చనే ధిలాసా ఇస్తుంది. అందుకే ఆమెకు ఈ ఆహ్వానం.

నిహారికా ఎన్.ఎమ్.


బెంగళూరులో పుట్టి పెరిగి ఇప్పుడు లాస్ ఏంజెలిస్‌లో ఉంటున్న నిహారికకు తెలుగు బాగా వచ్చు. బహుశా తెలుగు మూలాలు ఉండొచ్చు. యూట్యూబ్‌లో, ఇన్‌స్టాలో నిహారిక చేసే వీడియోలకి లక్షల మంది ఫాలోయెర్స్ ఉన్నారు. నిహారికతో షో చేస్తే ప్రచారం లభిస్తుందని భావించే పెద్ద పెద్ద సెలబ్రిటీలు ఉన్నారు. 27 ఏళ్ల ఈ ఇన్‌ఫ్లుయెన్సర్ లోపలొకటి బయటొకటిగా ఉండే మనుషులను గేలి చేస్తూ బోలెడన్ని వీడియోలు చేసి నవ్విస్తుంటుంది. 'మార్కులు వస్తేనే జీవితం. గొప్ప మార్కులు వచ్చినవారే గొప్ప జీవితాన్ని గడపగలరు అనే భావన నుంచి తల్లిదండ్రులు బయటపడాలి. పిల్లల తెలివితేటలు, ఆసక్తిని బట్టి వారిని ప్రోత్సహిస్తే వారు సక్సెస్ అవుతారు. నేను డాక్టరో ఇంజనీరో కావాలని మా అమ్మా నాన్నలు అనుకున్నారు. కాని లక్షలాది మంది అభిమానించే యూట్యూబర్‌ని అయ్యాను. కలలు కని ముందుకు సాగండి' అనే సందేశం ఇస్తుంటుంది నిహారిక. ఆమె ఇప్పుడు రెడ్ కార్పెట్ మీద హంగామా చేయనుంది.

చెన్నైకి చెందిన చరణ్య కుమార్‌కు గేమింగ్ అంటే ఎంతో ఇష్టమో, పురాణాలు అంటే కూడా అంతే ఇష్టం. అందుకే పురాణాలలోని ఆసక్తికర అంశాలను, స్ఫూర్తిదాయకమైన విషయాలను గేమింగ్‌లోకి తీసుకువచ్చింది చరణ్య కుమార్. ఆమె ప్రారంభించిన 'చిత్తం' గేమింగ్ కంపెనీ విజయపథంలో దూసుకుపోతోంది...

రూట్స్



ఆటలకు పురాణ సౌరభం



చరణ్య కుమార్

యూఎస్‌లో ఇంజినీరింగ్ చేసిన చరణ్య కుమార్ ఎన్నో పెద్ద కంపెనీలలో కన్సల్టింగ్ విభాగంలో పనిచేసింది.

కొన్ని సంవత్సరాల క్రితం వ్యక్తిగత జీవితంలో ఏర్పడిన సమస్యల వల్ల పురాణాలకు దగ్గరైంది. వాటిని చదవడం తనకు ఎంతో సాంత్వనగా ఉండేది.

అమ్మమ్మ ద్వారా పురాణాలలోని గొప్పదనం గురించి చిన్న వయసులోనే విన్నది కుమార్.

'జీవితంలో ప్రతి సమస్యకు పురాణాల్లో సమాధానం దొరుకుతుంది' అంటుంది కుమార్.

ఉద్యోగం నుంచి బ్రేక్ తీసుకున్న కుమార్ ఆ తరువాత ఎంబీఏ చేసింది.

'పురాణాలు ఆధ్యాత్మికతకు మాత్రమే పరిమితమైనవి కాదు. పౌరాణిక విషయాలు నిత్యజీవితంలో ఎన్నో రకాలుగా దారి చూపుతాయి. కష్టకాలంలో పురాణ పఠనం నాకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు సొంతంగా ఏదైనా ప్రారంభించాలనే పట్టుదలను కూడా ఇచ్చింది. కానీ ఏం చేయాలో ఎలా చేయాలో తెలియదు. నేను ధైర్యంగా వేసిన మొదటి అడుగు ఎంబీఏ చేయడం' అంటున్న కుమార్ గేమింగ్ కంపెనీ 'చిత్తం' రూపంలో తన కలను నెరవేర్చుకుంది.

తక్కువ ప్రాడక్ట్‌లతో మొదలైన 'చిత్తం' మొదటి సంవత్సరంలోనే పదమూడు ప్రాడక్ట్స్‌కు చేరుకుంది.

'ఫన్' ఎలిమెంట్స్‌ను జత చేస్తూ 'చిత్తం' రూపొందించిన గేమ్స్, యాక్టివిటీస్, బుక్స్ సూపర్ హిట్ అయ్యాయి.

తమిళ సామెతలను దృష్టిలో పెట్టుకొని 'పార్టీ టాక్స్' అనే గేమ్‌ను డిజైన్ చేశారు.

'భరత విలాస్' అనేది చిత్తం బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఈ కార్డ్ గేమ్ మన సంస్కృతిలోని రకరకాల నృత్యరూపాలు, వంటల రుచులు... మొదలైన వాటిని వెలికి తీస్తుంది.

'సింపుల్ గేమ్ ప్లే-సింపుల్ కంటెంట్ అనే రూల్‌ని నమ్ముకొని ప్రయాణం ప్రారంభించాం. మా నమ్మకం వృథా పోలేదు' అంటుంది చరణ్య.

వ్యాపార అనుభవం లేకపోవడం వల్ల మొదట్లో ఫండింగ్ విషయంలో కాస్తో కూస్తో ఇబ్బంది పడినా ఆ తరువాత మాత్రం తనదైన ప్రత్యేకతతో ఇన్వెస్టర్‌లను ఆకర్షించి విజయపథంలో దూసుకుపోతోంది 'చిత్తం'.

సాగుబడి

కృత్తిక కార్తె : మే 11 నుంచి

గుర్రాల విసర్జితాలతోనూ జీవామృతం!

- గుర్రాల పేడ, మూత్రంతో అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతాన్ని తయారు చేసి సేంద్రియ పంటలు పండిస్తున్న మహిళా రైతు జయ దగ
- ట్యూబ్ పద్ధతిలో గిర్ ఆవులు, గుర్రాల వ్యర్థాలతో వేర్వేరుగా అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతం ఉత్పత్తి
- ఆవుల జీవామృతంతో పోల్చితే గుర్రాల జీవామృతం ప్రభావశీలంగా పనిచేస్తోందని జయ అంటున్నారు

ప్రకృతి వ్యవసాయానికి ముఖ్యంగా అవసరమైనది జీవామృతం. దేశీ ఆవుల పేడ, మూత్రం, బెల్లం తదితర పదార్థాలతో తయారు చేసే జీవామృతం ప్రభావశీలంగా పనిచేస్తుందన్న భావన ఉంది. అయితే, రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో రాజస్థాన్‌కు చెందిన మహిళా రైతు 'జయ దగ' అందుకు భిన్నంగా.. గుర్రాల పేడ, మూత్రంతో కూడా ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్నారు. గిర్ ఆవుల విసర్జితాలతోనే కాకుండా.. గుర్రాల విసర్జితాలతో కూడా ఆమె వేర్వేరుగా ద్రవ జీవామృతం తయారు చేసి తమ పొలాల్లో వివిధ పంటల సేంద్రియ సాగులో ఆమె వాడుతున్నారు.

అహ్మదాబాద్‌కు చెందిన మహేశ్ మహేశ్వరి అభివృద్ధి చేసిన ట్యూబ్ పద్ధతిలో అధిక కర్బనంతో కూడిన అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతాన్ని ఈ రెండు రకాలుగా జయ గత 8 నెలలుగా తయారు చేసి వినియోగిస్తున్నారు. ఈ జీవామృతంతో తమ వ్యవసాయ క్షేత్రాల్లో నేపియర్ గడ్డి, మునగ, మామిడి తదితర పంటలను సేంద్రియంగా సాగు చేస్తున్నారు.

ఆవుల జీవామృతంతో పోల్చితే గుర్రాల విసర్జితాలతో తయారైన జీవామృతం పంటల సాగులో మరింత ప్రభావశీలంగా పనిచేస్తోందని జయ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. అయితే, గుర్రాల జీవామృతాన్ని ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న వేసవి కాలంలో పంటలకు వాడకూడదని, ఇతర కాలాల్లో ఏ పంటలకైనా వాడొచ్చని ఆమె సూచిస్తున్నారు.



గుర్రాల పెంపక క్షేత్రంలో జయ దగ



గుర్రాల పెంపక క్షేత్రాలు

రాజస్థాన్‌కు చెందిన జయ దగ కుటుంబీకుల ప్రధాన వ్యాపారం గుర్రాల ద్వారా ఔషధాల ఉత్పత్తి. ఇందుకోసం సుమారు 2 వేల వరకు గుర్రాలను రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌తో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని ముత్పూర్, రాజాపూర్ గ్రామాల్లో గల తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఆమె పెంచుతున్నారు. పాములు, తేళ్ల కాటు వేసినప్పుడు విరుగుడుగా వాడే ఇంజక్షన్లతో పాటు.. కుక్క కాటు వేసినప్పుడు రేబిస్ సోకకుండా వేసే ఇంజక్షన్లను సైతం పోనీల ద్వారా దాదాపు మూడు దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఇంజక్షన్లను భారత ప్రభుత్వానికి విక్రయించటంతో పాటు.. అనేక ఆసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాలకు తమ విన్స్ బయో ప్రొడక్ట్స్ సంస్థ ద్వారా ఎగుమతి చేస్తున్నట్లు జయ దగ వివరించారు.

అహ్మదాబాద్‌కు చెందిన ఆవిష్కర్త మహేశ్ మహేశ్వరి వద్ద నుంచి పొందిన టెక్నాలజీ ద్వారా జయ ట్యూబ్ పద్ధతిలో అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని తమ క్షేత్రంలో గత 8 నెలలుగా తయారు చేస్తున్నారు. ట్యూబ్ ద్వారా ప్రత్యేక పద్ధతిలో తయారవుతున్న ఈ అడ్వాన్స్‌డ్ జీవామృతం తమ పొలాల్లో మంచి ఫలితాలనిచ్చిందని ఆమె సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 43 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా ఆమె క్షేత్రంలో పెరుగుతున్న నేపియర్ గడ్డి, మునగ తోటలు చాలా ఆరోగ్యంగా, ఆకుపచ్చగా ఆకర్షణీయంగా ఉండటం విశేషం. నేపియర్ గడ్డి, మునగ ఆకు ముక్కలతో పాటు బార్లీ, సోయా, మొక్కజొన్నల మొలకలు, గోధుమ తవుడుతో కూడిన దాణాను కూడా ఆవులు, గుర్రాలకు ఆమె మేపుతున్నారు.

50 వేల లీటర్ల ట్యూబ్‌లు రెండు..

గుర్రాలు, పోనీలతో పాటు వందలాది గిర్ ఆవుల పోషణ కోసం గత 8 నెలల నుంచి తిమ్మాపూర్ వ్యవసాయ క్షేత్రంలో అనేక ఎకరాల్లో నేపియర్ గడ్డిని, మునగ ఆకును జయ దగ సేంద్రియ పద్ధతిలో చేస్తున్నారు. ఇందుకోసం 50,000 లీటర్ల సామర్థ్యం గల ట్యూబ్‌లు రెండిటిని ఆమె ఏర్పాటు చేసుకున్నారు. ఒక దాని ద్వారా గిర్ ఆవుల పేడ, మూత్రంతో.. రెండో దానిలో గుర్రాల పేడ, మూత్రంతో అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారు చేస్తున్నారు. ఒక్కొక్క ట్యూబ్ రోజుకు వెయ్యి లీటర్ల అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని తయారు చేస్తున్నారు.

రోజూ వెయ్యి లీటర్లు..

50 వేల లీటర్లు పట్టే ట్యూబ్ నుంచి మహిళా రైతు జయ దగ వెయ్యి లీటర్ల జీవామృతం పొందుతున్నారు. అంతే మొత్తంలో లోపలికి పోస్తున్నారు. ప్రతి బ్యాచ్‌లో 30 కేజీల ఆవులు లేదా గుర్రాల పేడ, 40 లీ. మూత్రం, 20 కిలోల బెల్లం, 10 కిలోల పండ్లు, 20 కిలోల కూరగాయలు, 10 కిలోల కలబంద జ్యూస్, 300 లీటర్ల జీవామృతంతో పాటు మిగతా 430 లీటర్ల నీటిని కలిపి ట్యూబ్‌లో పోస్తున్నారు. ఈ రోజు పోసింది నెలరోజుల తర్వాత అడ్వాన్స్‌డ్ జీవామృతంగా మారి బయటకు వస్తుంది.

ఏడాదిన్నర నిల్వ ఉంటుంది

సాధారణ జీవామృతంలో నలకలు పిప్పి ఉంటుంది. అయితే, ట్యూబ్‌లో గాలి తగలకుండా 30 రోజులు మగ్గిన తర్వాత అసలు ఏ నలకలూ, చెత్త లేని జీవామృతం వెలువడుతుంది. ఇందులో కర్బనం 15% వరకు ఉంటుందని, అందువల్ల ఇది సాధారణ జీవామృతం కన్నా ప్రభావశీలంగా పనిచేస్తుందని మహేశ్ మహేశ్వరి చెబుతున్నారు.

సాధారణ జీవామృతం 15 రోజుల తర్వాత పనికి రాదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కలియతిప్పాలి. అయితే, ట్యూబ్ జీవామృతం కనీసం ఒక ఏడాది నుంచి ఏడాదిన్నర కాలం వరకు నిల్వ ఉంటుంది. ప్రతి రోజూ కలియతిప్పాల్సిన అవసరం లేదు. బ్యారెల్స్‌లో నింపుకొని నిల్వ చేసుకుంటే చాలు. మరో విషయం ఏమిటంటే.. ట్యూబ్‌ని కానీ, దానిలో తయారైన జీవామృతాన్ని గానీ నీడలోనే ఉంచాలన్న నియమం లేకపోవటం మరో విశేషం అని జయ దగ చెబుతున్నారు. ఈ ప్రత్యేకతల వల్ల అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని ఒక చోట తయారు చేసి, దూర ప్రాంతాలకు కూడా రవాణా చేసుకొని అవసరం అయినప్పుడు వాడుకోవచ్చు. ట్యూబ్ టెక్నాలజీ వల్ల తమకు గడ్డి సమస్య శాశ్వతంగా తీరిపోయిందని ఆమె సంతోషిస్తున్నారు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్



అడ్వాన్స్‌డ్ జీవామృతం అరెకరానికి ఉచితం!

రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లోని తమ క్షేత్రానికి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న రైతులు ఎవరైనా సేంద్రియ వ్యవసాయం చెయ్యాలనుకుంటే.. ఒక్కో రైతుకు అరెకరానికి సరిపోయే అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని ఉచితంగా ఇస్తాను. వరి లేదా పత్తి వంటి పంటలకు ఎకరానికి 400 లీటర్ల అడ్వాన్స్‌డ్ జీవామృతం అవసరం ఉంటుంది. ఒక్కో రైతుకు అరెకరానికి సరిపడా 200 లీటర్లను రెండు దఫాలుగా ఇస్తాను. గిర్ ఆవుల జీవామృతం లీటరు రూ. 10, గుర్రాల జీవామృతం లీటరు రూ. 15, ఆర్గానిక్ పురుగుల మందు లీటరు రూ. 20కి విక్రయిస్తున్నాం. వీటితో సాగు చేసిన నేపియర్ గడ్డి మేపిన తర్వాత గిర్ ఆవు పాలలో కొవ్వు శాతం 3.4 నుంచి 4.7కు పెరిగింది. ఇతర వివరాలకు డాక్టర్ వెంకటేశ్ (98482 09696)ను సంప్రదించవచ్చు.

– జయ దగ, మహిళా రైతు, తిమ్మాపూర్, రంగారెడ్డి జిల్లా jsd@vinsbio.in

ఆర్గానిక్ పురుగుల మందు కూడా..

ఆర్గానిక్ పురుగుల మందును కూడా 200 లీటర్ల ట్యూబ్ ద్వారా మహిళా రైతు జయ దగ తయారు చేస్తున్నారు. మహేశ్ మహేశ్వరి నుంచి తెచ్చిన మైక్రోబియల్ కల్చర్ 2 లీటర్లు, 2 కిలోల దేశీ ఆవు పేడ, 10 కిలోల పెరుగుతో చేసిన మజ్జిగ, 40 లీటర్లు దేశీ ఆవు మూత్రం కలిపి ట్యూబ్‌లో పోస్తారు. 30 రోజులు ఇలా పోస్తూనే ఉండాలి. 30 రోజుల తర్వాత ట్యూబ్ నుంచి ఆర్గానిక్ పురుగుమందును తీసుకొని వాడుకోవచ్చు. ఈ పురుగుమందును నేరుగా పంటలపై చల్లకూడదు. 1 లీ. పురుగు మందును 1 లీ. నాటు ఆవు మూత్రం, 1 లీ. పుల్ల మజ్జిగ, 17 లీటర్ల నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేయాలి. ఈ ఆర్గానిక్ పురుగుమందును పిచికారీ చేసిన రోజు జీవామృతం పిచికారీ చేయకూడదని జయ తెలిపారు.



అడ్వాన్స్‌డ్ జీవామృతం 30 రోజుల్లో తయారవుతుంది!

సాధారణ జీవామృతం తయారీ ప్రక్రియకు.. ట్యూబ్ ద్వారా అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారీ ప్రక్రియకు చాలా వ్యత్యాసం ఉంది. ట్యాంకు లేదా డ్రమ్ములో వేసి నీటిలో నాటు ఆవు పేడ, మూత్రం, పప్పులపిండి, బెల్లం, పిడికెడు మంచి మట్టిని కలిపితే.. సాధారణ జీవామృతం 48 గంటల్లో వాడకానికి సిద్ధమవుతుంది. ఇందులో పిప్పి, పీచు, నలకలు అలాగే ఉంటాయి.

అయితే, ట్యూబ్‌లో అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారు కావటానికి 30 రోజులు పడుతుంది. ట్యూబ్‌ను ఏర్పాటు చేసుకొని, ఆ ట్యూబ్ పరిమాణాన్ని బట్టి నిర్ణీత పరిమాణంలో పేడ, మూత్రం, కూరగాయలు, పండ్ల వ్యర్థాలు తదితరాలను ద్రవ రూపంలోకి మార్చి ట్యూబ్‌లోకి వేస్తూ ఉంటారు. దీనికి తోడు మహేశ్ మహేశ్వరి రూపొందించిన ప్రత్యేక మైక్రోబియల్ కల్చర్‌ను కూడా తగిన మోతాదులో కలిపి వేస్తూ ఉంటారు. ఇలా ప్రతి రోజూ ట్యూబ్ లోపలికి వేస్తూనే ఉండాలి.

30 రోజులు వేసిన తర్వాత నుంచి ప్రతి రోజూ ఎటువంటి పిప్పి, పీచు, నలకలు లేని శుద్ధమైన అడ్వాన్స్‌డ్ జీవామృతం ట్యూబ్ నుంచి వెలికివస్తుంది. ప్రతి రోజూ ఎంత పరిమాణంలో పేడ తదితరాలను ట్యూబ్‌లో ఒక వైపు నుంచి వేస్తూ ఉంటామో.. ట్యూబ్ వేరే వైపు నుంచి అంతే మోతాదులో అడ్వాన్స్‌డ్ జీవామృతం బయటకు వస్తుంది. సాధారణ ద్రవ జీవామృతాన్ని 15 రోజుల్లో వాడేయాలి. అయితే, ఈ అడ్వాన్స్‌డ్ జీవామృతం ఏడాదిన్నర వరకు నిల్వ ఉంటుందని.. అధిక కర్బనం, సూక్ష్మజీవుల జీవవైవిధ్యంతో కూడినదైనందు వల్ల ఎంతో ప్రభావశీలంగా పనిచేస్తుందని మహేశ్ మహేశ్వరి 'సాక్షి సాగుబడి'కి తెలిపారు.




అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారుచేసే ట్యూబ్‌లు

ధాన్యం తడవకుండా కాపాడే మంచె!

వరి పంట పండించటంలోనే కాదు, పంటను నూర్పిడి చేసి ఆరుబయట కళ్లంలో ధాన్యాన్ని ఆరబెట్టుకోవటంలోనూ రైతులకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అకాల వర్షాలకు కళ్ళాల్లో వరి ధాన్యం తడిచిపోవటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కళ్లాల్లో పంట కళ్లెదుటే నీటిపాలవ్వకుండా రక్షించుకోవటానికి రైతులు ఎవరికి వారు తమ కళ్లం దగ్గరే నిర్మించుకోదగిన ఓ ఫ్లాట్‌ఫామ్ గురించి సింగరేణి మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీరామ సూచిస్తున్నారు.

ఇది కళ్లం/పొలంలోనే నిర్మించుకునే శాశ్వత నిర్మాణం. నలు చదరంగా ఉండే పొలంలో అయితే, ప్లస్ ఆకారంలో,



సుమారు 6 అడుగుల వెడల్పు, 3 అడుగుల ఎత్తుగల మంచెను పర్మనెంటుగా వేసి ఉంచాలి. దీర్ఘ చతురస్రాకార పొలమైతే, పొడుగ్గా దీన్ని నిర్మిస్తే చాలు. దీనికి, పొలం గట్లపై ఉండే 2 లేక 3 తాడి చెట్లు కొట్టి వేస్తే చాలు. తాటి మొద్దులను 5 అడుగుల ముక్కలుగా కోసి, భూమిలోకి 2 అడుగులు, భూమి పైన 3 అడుగులు ఎత్తున ఉండేలే చూడాలి. రెండు మొద్దుల మధ్య దూరం 6 అడుగులు ఉంటే చాలు. దీని మీద జీఐ చెయిన్ లింక్ ఫెన్స్ లేదా మెటల్ ఫెన్స్ లేదా రోజ్ హెడ్ నెయిల్స్ సహాయంతో వ్యవసాయ సీజన్ మొదట్లోనే అమర్చి ఉంచుకోవాలి. అకాల వర్షం వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన సమయంలో ఈ మంచెపైన టార్పాలిన్ షీట్ పరచి, దానిపైన ధాన్యాన్ని ఎత్తి పోసుకోవాలి. ధాన్యంపైన కూడా టార్పాలిన్ షీట్ కప్పి చైన్ లింక్ ఫెన్స్‌కి తాళ్లతో గట్టిగా కట్టాలి. ఎంతపెద్ద గాలి అయినా, తుపాను అయినా, 2 అడుగుల లోపు వరద వచ్చినా, ధాన్యం తడవకుండా ఇలా రక్షించుకోవచ్చు. ధాన్యం ధర తగ్గించి అమ్ముకోవాల్సిన అవసరం ఉండదు.

చిన్న కమతాల్లో అయితే అకాల వర్షం నుంచి పంటను కాపాడుకోవటానికి రైతు, అతని భార్య ఈ పని చేసుకోవచ్చు లేదా ఇద్దరు మనుషులు చాలు. ఈ మంచెకు పొలం విస్తీర్ణంలో ఒక శాతం అంటే ఎకరానికి ఒక సెంటు స్థలాన్ని కేటాయిస్తే చాలు. ఆ స్థలం కూడా వృథా కాదు. దీన్ని పందిరిగా వాడుకుంటూ బీర, ఆనప, చిక్కుడు తదితర తీగ జాతి కూరగాయలు సాగు చేసుకోవచ్చు.

చిత్రంలో సూచించిన మాదిరిగా మంచెను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక్కడ సూచించిన కొలతలను రైతులు తమ అవసరాన్ని బట్టి మార్చుకోవచ్చు. ఎకరానికి ఒక సెంటు భూమిలో ఇలా తక్కువ ఖర్చుతో, రైతుకు తేలికగా దొరికే తాడి దుంగలతో వేదికను నిర్మించుకుంటే సరిపోతుందని శ్రీరామ (83095 77123) సూచిస్తున్నారు.

నేరుగా ఫైనల్లో పోటీపడనున్న కిశోర్, నీరజ్



ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ మీట్‌లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్లు నీరజ్ చోప్రా, కిశోర్ నేరుగా ఫైనల్లోనే పోటీపడతారు. ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ నీరజ్ మూడేళ్ల తర్వాత స్వదేశంలో ఓ టోర్నీలో పాల్గొంటున్నాడు. కనీస అర్హత ప్రమాణం 75 మీటర్లను పలుమార్లు తమ కెరీర్‌లో అధిగమించినందుకు నిర్వాహకులు నీరజ్, కిశోర్‌లకు నేరుగా ఫైనల్లో పాల్గొనే అవకాశం ఇచ్చారు.

నెదర్లాండ్స్ టి20 జట్టులో తేజ



పురుషుల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే 15 మంది సభ్యులతో కూడిన నెదర్లాండ్స్ జట్టుకు స్కాట్ ఎడ్వర్డ్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. గత ఏడాది భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో పోటీపడ్డ నెదర్లాండ్స్ జట్టులో సభ్యుడిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన తేజ నిడమనూరు టి20 ప్రపంచకప్‌నకు కూడా ఎంపిక కావడం విశేషం. నెదర్లాండ్స్ జట్టు: స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), ఆర్యన్ దత్, బస్ డి లీడీ, డోరమ్, క్లాసెన్, కైల్ క్లీన్, లోగాన్ వాన్ బీక్, మార్క్స్ ఒడౌడ్, లెవిట్, మీకెరెన్, సైబ్రాండ్, తేజ నిడమనూరు, ప్రింగిల్, విక్రమ్ సింగ్, వెస్లీ బారెసి.

నిఖత్ శుభారంభం



అస్తానా (కజకిస్తాన్): ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. సోమవారం జరిగిన 52 కేజీల విభాగం తొలి రౌండ్‌లో నిఖత్ 5–0తో రఖీమ్‌బెర్డి జన్నాయా (కజకిస్తాన్)ను ఓడించింది. భారత్‌కే చెందిన మీనాక్షి (48 కేజీలు), అనామిక (50 కేజీలు) కూడా తొలి రౌండ్‌లో విజయాలు అందుకున్నారు. మీనాక్షి 4–1తో గసిమోవా రొక్సానా (కజకిస్తాన్)పై గెలుపొందగా... అనామిక పంచ్‌ల ధాటికి ఆమె ప్రత్యర్థి జుమ్‌బయేవా అర్గెలిమ్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేసి భారత బాక్సర్‌ను విజేతగా ప్రకటించారు. ఇస్మిత్ (75 కేజీలు), సోనియా (54 కేజీలు) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. ఇస్మిత్ 0–5తో అర్మాత్ (కజకిస్తాన్) చేతిలో, సోనియా 0–5తో చాంగ్ యువాన్ (చైనా) చేతిలో ఓడిపోయారు.

ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ



రోమ్: ఇటాలియన్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–2, 6–2తో అర్నాల్డి–పసారో (ఇటలీ) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో బొలెలీ–వావాసోరి (ఇటలీ)లతో బోపన్న–ఎబ్డెన్ తలపడతారు.



గుజరాత్ అవుట్

వర్షంతో మ్యాచ్ రద్దు

- టైటాన్స్, కోల్‌కతాలకు చెరో పాయింట్
- 19 పాయింట్లతో టాప్ –2 ఖాయం చేసుకున్న నైట్‌రైడర్స్

అహ్మదాబాద్: సొంతగడ్డపైనే గుజరాత్ టైటాన్స్ పుట్టి మునిగింది. ఈ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలిచి ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలనే పట్టుదలతో ఉన్న నిరుటి రన్నరప్ టైటాన్స్ ఆశల్ని భారీ వర్షం ముంచేసింది. తెరిపినివ్వని వానతో నరేంద్ర మోదీ స్టేడియం తడిసిముద్దయ్యింది. కనీసం 5 ఓవర్ల మ్యాచ్‌గానైనా నిర్వహించేందుకు గ్రౌండ్ సిబ్బంది చాలా కష్టపడింది. కానీ ఆగినట్లే ఆగిన వాన మళ్లీ చినుకు చినుకుగా పడటంతో నిర్వాహకులు చేసేదేమీలేక తుది నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. నిజానికి రాత్రి 10 గంటలైనా అసలు టాస్ వేసేందుకే అవకాశం లేకపోయింది. చివరి సారిగా రాత్రి 10.36 గంటలకు మైదానాన్ని పరిశీలించిన ఫీల్డు అంపైర్లు నవ్‌దీప్ సింగ్, నిఖిల్ పట్వర్ధన్ మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించగా, ఆటగాళ్లు పరస్పర కరచాలనంతో మైదానంలోని ప్రేక్షకుల్ని పలుకరిస్తూ డ్రెస్సింగ్ రూమ్‌వైపు నడిచారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో వర్షంవల్ల రద్దయిన తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం.

పటిష్టస్థితిలో కోల్‌కతా

ఫలితం తేలని మ్యాచ్‌తో టాప్–2 స్థానాలు మాత్రం తేలిపోయాయి. మ్యాచ్ రద్దుతో వచ్చిన ఒక పాయింట్‌తో కోల్‌కతా 19 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. కేకేఆర్ మిగిలున్న ఆఖరి మ్యాచ్‌లో ఓడినా... తొలి రెండు స్థానాల్లో ఉండటం ఖాయమైంది. ప్రస్తుతం 16 పాయింట్లతో ఉన్న రాజస్తాన్ రాయల్స్ తమ రెండు లీగ్ మ్యాచ్‌ల్లోనూ ఒకవేళ గెలిస్తే 20 పాయింట్లతో అగ్రస్థానంలోకి ఎగబాకుతుంది. అప్పుడు నైట్‌రైడర్స్ రెండో స్థానానికి పడిపోయినా ఎలిమినేటర్ ఆడే పరిస్థితి అయితే రాదు. ఐపీఎల్‌లోకి ప్రవేశించిన గత రెండేళ్ల నుంచి ఫైనల్ చేరిన గుజరాత్ ఈసారి ఇంకో మ్యాచ్ మిగిలున్నా... లీగ్ దశలోనే నిష్క్రమించనుంది. 2022లో టైటిల్ గెలిచిన టైటాన్స్ గతేడాది రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ప్రస్తుతం 13 మ్యాచ్‌ల్లో ఐదింట గెలిచిన టైటాన్స్ ఖాతాలో 11 పాయింట్లున్నాయి. ఒకవేళ ఆఖరిపోరు గెలిచినా... 13 పాయింట్లవద్దే ఆగిపోతుంది. అయితే పట్టికలో ఇప్పటికే కోల్‌కతా (19), రాజస్తాన్ (16), చెన్నై (14), హైదరాబాద్ (14) ముందు వరుసలో ఉండటంతో గుజరాత్ ఖేల్ లీగ్‌తోనే ముగిసింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
బెంగళూరు	13	6	7	0	12	0.387
ఢిల్లీ	13	6	7	0	12	-0.482
లక్నో	12	6	6	0	12	-0.769
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × ఢిల్లీ
వేదిక: న్యూఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత 85వ గ్రాండ్‌మాస్టర్‌గా శ్యామ్

12 ఏళ్ల తర్వాత మూడో జీఎం నార్మ్ అందుకున్న తమిళనాడు ప్లేయర్



దుబాయ్: ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఏకంగా 12 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ అనుకున్నది సాధించాడు తమిళనాడు చెస్ ప్లేయర్ శ్యామ్ నిఖిల్. 31 ఏళ్ల శ్యామ్ నిఖిల్‌భారత చెస్‌లో 85వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. జీఎం హోదా దక్కాలంటే చెస్ ప్లేయర్ 2500 ఎలో రేటింగ్‌ను దాటడంతోపాటు మూడు జీఎం నార్మ్‌లు సాధించాలి. ఈ రెండూ సాధ్యమైతేనే జీఎం హోదా లభిస్తుంది. 2012లోనే శ్యామ్ 2500 ఎలో రేటింగ్‌ను అందుకోవడంతోపాటు రెండు జీఎం నార్మ్‌లు సాధించాడు. అయితే చివరిదైన మూడో జీఎం నార్మ్ కోసం సుదీర్ఘంగా నిరీక్షించాల్సి వచ్చింది. 12 ఏళ్లపాటు వేచి చూశాక ఎట్టకేలకు శ్యామ్ నిఖిల్ దుబాయ్ పోలీస్ మాస్టర్స్ ఓపెన్ చెస్ టోర్నీలో జీఎం హోదా ఖరారు కావడానికి అవసరమైన మూడో జీఎం నార్మ్‌ను అందుకున్నాడు. ఈ టోర్నీలో శ్యామ్ నిఖిల్ ఐదు పాయింట్లతో 39వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ క్రమంలో ఏడుగురు గ్రాండ్‌మాస్టర్లతో తలపడిన శ్యామ్ ఒకరిపై గెలిచి, ఆరుగురితో 'డ్రా' చేసుకొని మూడో జీఎం నార్మ్‌ను సాధించాడు. 'ఎనిమిదేళ్ల వయస్సులో చెస్ ఆడటం ప్రారంభించాను. అయితే మూడేళ్లపాటు ఏ టోర్నీలోనూ ఆడలేదు. ఆ తర్వాత అండర్–13 రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాను. 2012లోనే రెండు జీఎం నార్మ్‌లు అందుకున్నా మూడో జీఎం నార్మ్ సులభంగా రాలేదు. పలుమార్లు చేరువై దూరమయ్యాను. ఎట్టకేలకు 12 ఏళ్ల తర్వాత మూడో జీఎం నార్మ్ అందుకోవడంతో చాలా సంతోషంగా ఉంది' అని 2022లో కామన్వెల్త్ చాంపియన్‌గా నిలిచిన శ్యామ్ నిఖిల్ వ్యాఖ్యానించాడు.

షాట్‌పుట్‌లో ఆభా జాతీయ రికార్డు



భువనేశ్వర్: ఫెడరేషన్ కప్ జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో రెండో రోజు కొత్త జాతీయ రికార్డు నమోదైంది. మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో ఆభా ఖటువా జాతీయ రికార్డు నెలకొల్పింది. బెంగాల్‌లో జన్మించి మహారాష్ట్ర తరఫున పోటీపడుతున్న ఆభా ఇనుప గుండును 18.41 మీటర్ల దూరం విసిరి జాతీయ రికార్డు సృష్టించడంతోపాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. గత జాతీయ రికార్డు కూడా ఆభా (18.06 మీటర్లు) పేరిటే ఉండటం గమనార్హం. మరోవైపు పురుషుల 200 మీటర్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షణ్ముగ శ్రీనివాస్ (20.97 సెకన్లు) రజత పతకం సాధించాడు.

ఐపీఎల్ నుంచి స్వదేశానికి...

ఇంగ్లండ్‌కు పయనమైన బట్లర్, జాక్స్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు ముగింపు దశకు చేరగా... ఆయా జట్లకు కీలకమైన ఇంగ్లండ్ ఆటగాళ్లు తిరుగుపయనమయ్యారు. జోస్ బట్లర్ (రాజస్తాన్), లివింగ్‌స్టోన్ (పంజాబ్ కింగ్స్), విల్ జాక్స్, రీస్ టాప్లీ (బెంగళూరు)లు ఇంగ్లండ్‌కు బయలుదేరారు. వచ్చే నెల 2 నుంచి అమెరికా, వెస్టిండీస్‌లలో జరిగే టి20 ప్రపంచకప్‌కు తుది సన్నాహంగా సొంతగడ్డపై ఇంగ్లండ్ జట్టు పాకిస్తాన్‌తో టి20 సిరీస్ ఆడనుంది. మే 22 నుంచి ఇరు జట్ల మధ్య నాలుగు టి20ల సిరీస్ జరుగుతుంది. 22, 25, 28, 30 తేదీల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా... ఈ ఐపీఎల్ సీజన్‌లో లివింగ్‌స్టోన్ ఆకట్టుకోలేకపోయాడు. బట్లర్ రాజస్తాన్ స్టార్ ఓపెనర్. ఈ సీజన్‌లో ఒంటిచేత్తో కొన్ని మ్యాచ్‌ల్ని గెలిపించాడు. బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జాక్స్, టాప్లీలలో జాక్స్‌ది కీలకపాత్ర. బెంగళూరు వరుస విజయాల్లో భాగమైన అతను లేకపోవడం జట్టుకు లోటే! చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు... చెన్నైతో ఈ నెల 18న తలపడుతుంది.


బట్లర్

సినిమా


● విష్ణు మంచు

కాన్స్‌లో కన్నప్ప

ప్రతిష్ఠాత్మక కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీమ్ సందడి చేయనుంది. విష్ణు మంచు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ నెల 14 నుంచి 25 వరకూ జరగనున్న కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 20వ తేదీన 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప'గా కన్నప్ప మూవీ టీజర్‌ని ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని విష్ణు మంచు సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ''కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'లో 'కన్నప్ప' సినిమా టీజర్‌ను ఆవిష్కరించనుండటం ఆనందంగా ఉంది. మేం ఎంతో ఇష్టంగా రూపొందిస్తున్న కన్నప్పను ప్రపంచ ప్రేక్షకులకు చూపించేందుకు కాన్స్ అనువైన వేదికగా ఉపయోగపడుతుంది. మన భారతీయ చరిత్రను ప్రపంచ వేదికపైకి తీసుకురావడం, మన కథలు, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు తెలియజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం'' అని ట్వీట్ చేశారు విష్ణు మంచు.


● దీపికా పదుకోన్

డబ్బింగ్ డన్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ సినిమా ద్వారా హీరోయిన్ దీపికా పదుకోన్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 27న విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. 'కల్కి 2898 ఏడీ'లో తన పాత్రకి సంబంధించిన డబ్బింగ్‌ని పూర్తి చేశారట దీపికా పదుకోన్. హిందీ, కన్నడ భాషల్లో ఆమె డబ్బింగ్ చెప్పినట్లు సమాచారం. హీరో రణ్‌వీర్ సింగ్–దీపికా పదుకోన్‌లకు 2018 నవంబర్ 14న వివాహం అయింది. ప్రస్తుతం దీపిక గర్భవతి. దీంతో సినిమాలకు గ్యాప్ ఇచ్చి జూన్ నెల నుంచి పూర్తిగా ఇంటికే పరిమితమై ఆమె విశ్రాంతి తీసుకోనున్నారని టాక్. ఈ కారణంగానే 'కల్కి 2898 ఏడీ' మూవీలో తన పాత్ర డబ్బింగ్‌ని పూర్తి చేశారట ఆమె. అదే విధంగా ఈ సినిమా ప్రమోషన్స్ కోసం దీపిక స్పెషల్ ఇంటర్వ్యూలని కూడా ముందుగానే ప్లాన్ చేసిందట చిత్ర యూనిట్. ఇదిలా ఉంటే ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ, ఇంగ్లిష్... ఇలా పలు భాషల్లో విడుదల కానుంది. హిందీ, కన్నడ వెర్షన్లకు దీపిక డబ్బింగ్ చెప్పారు. ఇతర భాషల్లో ఆమె పాత్రకు వేరేవారితో డబ్బింగ్ చెప్పిస్తారా? లేక దీపికానే చెబుతారా? అనేది తెలియాల్సి ఉంది.

ఆడపిల్లనే... ఐతే ఏంటంట

హీరోలకు ప్రేమ కబుర్లు చెప్పే పాత్రలే ఎక్కువగా చేసే హీరోయిన్లు ఫర్ ఎ చేంజ్ నేరస్తులకు బుద్ధి చెప్పే పనిలో పడ్డారు. న్యాయ పోరాటం కోసం ఏం చేయడానికి అయినా వెనకాడని పోలీసాఫీసర్లుగా బెల్టు బిగించారు... తుపాకీ గురి పెట్టారు.. లాఠీకి పని చెప్పారు. 'ఆడపిల్లనే... ఐతే ఏంటంట' అంటూ ఓ హీరోయిన్ పోలీస్ పాత్రలో రెచ్చిపోయారు. మిగతా కథానాయికలు కూడా దాదాపు అలానే అంటూ పోలీసు పాత్రల్లో విజృంభించారు. ఆ పోలీసాఫీసర్ల గురించి తెలుసుకుందాం.


● 'సత్యభామ'లో కాజల్ అగర్వాల్

సత్యభామ సాహసం

హైదరాబాద్ సిటీ ఏసీపీ కె. సత్యభామగా చార్జ్ తీసుకున్నారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. ఓ అమ్మాయి కేసు విషయంలో సత్యభామ పోలీసాఫీసర్‌గా ఆల్మోస్ట్ సస్పెండ్ అవ్వాల్సిన పరిస్థితి. మరి.. సత్యభామ ఈ కేసును ఎలా సాల్వ్ చేసింది? ఈ క్రమంలో ఆమె ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అన్నది 'సత్యభామ' సినిమాలో చూడాలి. సత్యభామగా కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్ చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పణలో తక్కలపల్లి శ్రీనివాసరావు, బాబీ తిక్క నిర్మించారు. ఓ అమ్మాయి హత్యాచారం నేపథ్యంలో 'సత్యభామ' సినిమా కథ ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ నెల 17న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రంలో డీజీపీ నారాయణదాస్ పాత్రలో ప్రకాశ్‌రాజ్, అమరేందర్ అనే పాత్రలో నవీన్ చంద్ర లీడ్ రోల్స్‌లో నటించారు. నాగినీడు, హర్షవర్ధన్, రవివర్మ కీలక పాత్రల్లో కనిపిస్తారు. ఈ సంగతి ఇలా ఉంచితే... పోలీసాఫీసర్‌గా కాజల్ అగర్వాల్ నటించడం ఇది తొలిసారి కాదు. 2014లో తమిళ హీరో విజయ్ నటించిన 'జిల్లా', గత ఏడాది విడుదలైన తమిళ చిత్రం 'ఘోస్టీ'లో కాజల్ పోలీసాఫీసర్‌గా నటించారు. ఆ రెండు చిత్రాల్లోనూ పవర్‌ఫుల్ పోలీస్‌గా ఒదిగిపోయారు కాజల్. తాజాగా 'సత్యభామ'లో కూడా పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా విజృంభించారని యూనిట్ పేర్కొంది.

పాయల్ రక్షణ

హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తొలిసారి 'రక్షణ' కోసం ఖాకీ డ్రెస్ ధరించి, లాఠీ పట్టారు. పాయల్ రాజ్‌పుత్ ఫస్ట్ టైమ్ పోలీసాఫీసర్‌గా నటించిన చిత్రం ఇది. ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఓ పోలీసాఫీసర్ జీవితంలోని ఓ ఘటనను ఆధారంగా చేసుకుని, ఈ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను తెరకెక్కించినట్లుగా యూనిట్ పేర్కొంది. రోషన్, మానస్, రాజీవ్ కనకాల తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ స్వరకర్త.


అగ్ని నక్షత్రం

మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మర్డర్ మిస్టరీ చిత్రం 'అగ్ని నక్షత్రం'. ఈ చిత్రంలో మంచు లక్ష్మి ఓ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె దీక్ష అనే పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఎమ్. వంశీకృష్ణ దర్శకత్వంలో మంచు లక్ష్మి, మంచు మోహన్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మర్డర్ మిస్టరీ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. మలయాళీ నటుడు సిద్ధిఖ్, సముద్రఖని, విశ్వంత్, చైత్ర శుక్లా ఈ సినిమాలో ఇతర కీ రోల్స్‌లో కనిపిస్తారు. ఈ చిత్రం విడుదలపై స్పష్టత రావాల్సి ఉంది.

ఐతే ఏంటంట?

'కలర్ ఫొటో', 'గామి' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు నటిగా మరింత దగ్గరయ్యారు హీరోయిన్ చాందినీ చౌదరి. ఈ బ్యూటీ ఇటీవల పోలీసాఫీసర్‌గా డ్యూటీ చేశారు. ఈ డ్యూటీ 'యేవమ్' సినిమా కోసం. ఈ సినిమాలో చాందినీ చౌదరితో పాటు వశిష్ఠ సింహా, జై భారత్, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించారు. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించారు. మహిళా సాధికారిత నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో ఎస్ఐ సౌమ్య పాత్రలో కనిపిస్తారు చాందినీ చౌదరి. ఇటీవల విడుదలైన ఈ సినిమా పోస్టర్‌పై 'ఆడపిల్లనే!.. ఐతే ఏంటంట?' అనే క్యాప్షన్ ఉంది. దీన్నిబట్టి ఈ సినిమాలో చాందిని పాత్ర చాలా స్ట్రాంగ్‌గా ఉంటుందని ఊహించవచ్చు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది.

ఇలా పోలీసాఫీసర్లుగా కనిపించనున్న దక్షిణాది హీరోయిన్లు మరికొంతమంది ఉన్నారు.


● 'అగ్ని నక్షత్రం'లో మంచు లక్ష్మి


● 'రక్షణ'లో పాయల్ రాజ్‌పుత్


● 'ఏవమ్'లో చాందిని

హీరోయిన్ త్రిష నటించిన తొలి వెబ్ సిరీస్ 'బృందా'. త్రిష టైటిల్ రోల్‌లో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ఇది. ఇందులో త్రిష పోలీసాఫీసర్ పాత్ర చేశారు. సూర్య వంగల దర్శకత్వం వహించిన ఈ తెలుగు వెబ్ సిరీస్ చిత్రీకరణ పూర్తయింది. స్ట్రీమింగ్ తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ క్యారెక్టర్ కావడం వల్లే త్రిష ఈ వెబ్ సిరీస్ చేశారని కోలీవుడ్ టాక్.


● 'బృందా'లో త్రిష

సాక్షి బిజినెస్
మంగళవారం
14-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
112	49
72,776	22,104

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,376	▲	35
డోజోన్స్	39,429	▽	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,415	▽	19
డాక్స్	18,742	▽	31
షాంఘై	3,148	▽	7
నికాయ్ (గురువారం ముగింపు)	38,104	▽	125

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,490
బంగారం (99.5 స్వచ్ఛత)	72,200
వెండి (కేజీ)	83,265

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.11	84.13
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.47	106.01
€	యూరో	ఎస్‌బీఐ	88.82	91.25
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.08	54.26
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	52.81	57.62
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.33	64.05
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.44	12.51

మార్చి త్రైమాసిక ఫలితాలు

జిందాల్ స్టీల్ మెరుపులు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం జిందాల్ స్టీల్ అండ్ పవర్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ. 933 కోట్లను తాకింది. వాటాదారులకు షేరుకి రూ. 2 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,708 కోట్ల నుంచి రూ. 13,521 కోట్లకు స్వల్పంగా నీరసించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 12,749 కోట్ల నుంచి రూ. 12,358 కోట్లకు తగ్గాయి. ముడివ్యయాలు రూ. 6,168 కోట్ల నుంచి రూ. 5,265 కోట్లకు దిగివచ్చాయి. ఈ కాలంలో 2.05 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేయగా.. 2.01 ఎంటీ స్టీల్‌ను విక్రయించింది. ఇక పూర్తి ఏడాదికి / ందాల్ స్టీల్ నికర లాభం రూ. 3,193 కోట్ల నుంచి రూ. 5,943 కోట్లకు జంప్‌చేసింది. మార్చికల్లా కంపెనీ నికర రుణభారం రూ. 11,203 కోట్లుగా నమోదైంది.

జిందాల్ స్టీల్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం లాభంతో రూ. 939 వద్ద ముగిసింది.

డీఎల్‌ఎఫ్ పటిష్టం



న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం డీఎల్‌ఎఫ్ లిమిటెడ్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 62 శాతం దూసుకెళ్లి రూ. 921 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో కేవలం రూ. 570 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,576 కోట్ల నుంచి రూ. 2,317 కోట్లకు జంప్‌చేసింది. ఇక పూర్తి ఏడాదికి డీఎల్‌ఎఫ్ నికర లాభం రూ. 2,036 కోట్ల నుంచి రూ. 2,727 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 6,012 కోట్ల నుంచి రూ. 6,958 కోట్లకు బలపడింది.

డీఎల్‌ఎఫ్ షేరు బీఎస్‌ఈలో 1.5 శాతం లాభంతో రూ. 838 వద్ద ముగిసింది.

జొమాటో టర్న్‌అరౌండ్



క్యూ4లో రూ. 175 కోట్ల లాభం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో లిమిటెడ్ టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 175 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 188 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,056 కోట్ల నుంచి రూ. 3,562 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,431 కోట్ల నుంచి రూ. 3,636 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి జొమాటో నష్టాలనువీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 351 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022–23లో రూ. 971 కోట్ల కన్సాలిడేటెడ్ నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 7,079 కోట్ల నుంచి రూ. 12,114 కోట్లకు ఎగసింది. కాగా.. బ్లింక్ కామర్స్(గతంలో గ్రోఫర్స్ ఇండియా) ప్రయివేట్ లిమిటెడ్ కొనుగోలు నేపథ్యంలో ఫలితాలను అంతక్రితం ఏడాదితో పోల్చిచూడతగదని జొమాటో పేర్కొంది. క్విక్ కామర్స్ బిజినెస్‌లో భాగంగా స్టోర్ల ఏర్పాటు వేగంగా కొనసాగుతున్నట్లు వెల్లడించింది. 2025కల్లా వీటి సంఖ్య 1,000కు చేరనున్నట్లు తెలియజేసింది.

పేమెంట్ లైసెన్స్ వెనక్కి

ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్‌గా సేవలందించేందుకు లభించిన అధీకృత సర్టిఫికెట్‌ను అనుబంధ సంస్థ జొమాటో పేమెంట్ ప్రయివేట్ లిమిటెడ్ స్వచ్ఛందంగా ఆర్‌బీఐకు తిరిగి అప్పగించనున్నట్లు జొమాటో వెల్లడించింది. డిజిటల్‌చెల్లింపుల విభాగంలో భారీ లబ్ధికి అవకాశం లేదని భావిస్తున్నట్లు తెలియజేసింది. వెరసి వాణిజ్య ప్రాతిపదికన పేమెంట్స్ బిజినెస్ లాభసాటికాదని నిర్ణయించుకున్నట్లు వివరించింది.

జొమాటో షేరు బీఎస్‌ఈలో 4 శాతం పతనమై రూ. 194 వద్ద ముగిసింది.

కరూర్ వైశ్యా బ్యాంక్ స్పీడ్

న్యూఢిల్లీ: కరూర్ వైశ్యా బ్యాంక్ లాభం 35 శాతం పెరిగి రూ. 338 కోట్ల నుంచి రూ. 456 కోట్లకు చేరింది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం 45 శాతం వృద్ధి చెందింది. రూ. 1,605 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యాపారం 16 శాతం పెరిగి రూ. 1,40,806 కోట్ల నుంచి రూ. 1,63,536 కోట్లకు వృద్ధి చెందింది. నికర వడ్డీ మార్జిన్ 1 బీపీఎస్ పెరిగి 4.19 శాతంగా నమోదైంది. నికర ఎన్‌పీఏలు 0.74 శాతం నుంచి 0.40 శాతానికి దిగి వచ్చాయి.

బ్యాంక్ షేర్ బీఎస్‌ఈలో 1 శాతం తగ్గి రూ.188 వద్ద ముగిసింది.

యూపీఎల్ నేలచూపు



న్యూఢిల్లీ: అగ్రోకెమికల్స్ దిగ్గజం యూపీఎల్ లిమిటెడ్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 95 శాతం పతనమై రూ. 40 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో ఏకంగా రూ. 792 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 15 శాతం క్షీణించి రూ. 14,078 కోట్లను తాకింది. అంతక్రితం ఇదే కాలంలో రూ. 16,569 కోట్ల ఆదాయం సాధించింది. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 3,033 కోట్ల నుంచి రూ. 1,933 కోట్లకు భారీగా తగ్గింది. ఇబిటా మార్జిన్లు 34.4 శాతం నుంచి 29.4 శాతానికి బలహీనపడ్డాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) 21 కోట్ల డాలర్ల విస్తరణ వ్యయ ప్రణాళికలు అమలు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో యూపీఎల్ షేరు బీఎస్‌ఈలో 6.5 శాతం జంప్‌చేసి రూ. 534 వద్ద ముగిసింది.

5% దిగువనే రిటైల్ ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 5 శాతం దిగువనే కొనసాగింది. సూచీ సమీక్షానెల్లో 4.83 శాతంగా నమోదయ్యింది. మార్చిలో నమోదయిన 4.85 శాతంతో పోల్చితే స్వల్పంగా తగ్గింది. ఇది 11 నెలల కనిష్ట స్థాయి. అయితే 2023 ఇదే నెలతో పోల్చితే (4.7 శాతం) అధికంగా ఉంది. నెలవారీగా చూస్తే, ఒక్క ఆహార ద్రవ్యోల్బణం 8.52 శాతం (2024 మార్చి) నుంచి 8.70 శాతానికి పెరిగింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ 2తో 4 శాతంగా ఉండాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-5-2024 ఫామ్ ధర...

విశాఖ	550–00
చిత్తూరు	608–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00

గ్రీన్‌కో జీరోసీ భారీ కాంట్రాక్ట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమోనియా తయారీలో ఉన్న గ్రీన్‌కో జీరోసీ భారీ కాంట్రాక్ట్ దక్కించుకుంది. అమోనియా ట్రేడింగ్, పంపిణీలో ప్రపంచ దిగ్గజ సంస్థ అయిన ఓస్లోకు చెందిన యారా క్లీన్ అమోనియా తాజాగా ఏఎం గ్రీన్‌కు చెందిన గ్రీన్‌కో జీరోసీతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది. గ్రీన్‌కో జీరోసీకి చెందిన కాకినాడ ప్లాంటు నుంచి యారా క్లీన్‌కు పునరుత్పాదక, కార్బన్ రహిత అమోనియా సరఫరా చేస్తామని ఏఎం గ్రీన్ ప్రెసిడెంట్ మహేశ్ కొల్లి తెలిపారు. గ్రీన్‌కో గ్రూప్ వ్యవస్థాపకులు అయిన మహేశ్ కొల్లి, అనిల్ చలమలశెట్టి ఏఎం గ్రీన్‌ను స్థాపించారు. పర్యావరణ అనుకూల అమోనియా తయారీ కేంద్రాన్ని కాకినాడ వద్ద 10 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యంతో కంపెనీ రెండు దశల్లో నిర్మిస్తోంది.

దక్షలో కోరమాండల్ వాటాల పెంపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రోన్ల తయారీ సంస్థ దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్‌లో అదనంగా 7 శాతం వాటా తీసుకుంటున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. దీంతో కంపెనీలో తమ మొత్తం వాటాలు 58 శాతానికి చేరతాయని వివరించింది. ఇందుకోసం రూ. 150 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ తెలిపారు. ప్రారంభ దశ నుంచి దక్షతో కలిసి పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డిఫెన్స్, అగ్రి ఇన్‌పుట్ కంపెనీల నుంచి దక్షకు ప్రస్తుతం రూ. 265 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి.

బీఎండబ్ల్యూ బైక్ రూ.45 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సూపర్ ప్రీమియం బైక్స్ తయారీ దిగ్గజం బీఎండబ్ల్యూ భారత్‌లో సరికొత్త ఎం 1000 ఎక్స్‌ఆర్ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.45 లక్షలు. పూర్తిగా తయారైన బైక్‌ను భారత్‌కు దిగుమతి చేసుకుంటారు.

భారీ నష్టాల్లోంచి లాభాల్లోకి..

- అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- కలిసొచ్చిన ఆఖరి గంట కొనుగోళ్లు

ముంబై: భారీ నష్టాల నుంచి పుంజుకున్న స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్‌లో 798 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరికి 112 పాయింట్లు పెరిగి 72,776 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 234 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ ఆఖరికి 49 పాయింట్లు బలపడి 22,104 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలతో ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు.., మిడ్ సెషన్ తర్వాత కోలుకున్నాయి. ముఖ్యంగా అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీవీఎస్ షేర్లు ఒక శాతానికి పైగా రాణించడంతో పాటు సూచీల రికవరీకి తోడ్పాటు అందాయి. సర్వీసెస్, రియల్టీ, ఫార్మా, పారిశ్రామికోత్పత్తి, కమోడిటీస్, బ్యాంకింగ్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. కన్జూమర్, టెలికమ్యూనికేషన్, యుటిలిటీస్, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లోకి ట్రేడవుతున్నాయి.



→ క్యూ4 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో టాటా మోటార్స్ షేరు ఎనిమిది శాతానికి పైగా నష్టపోయి రూ.960 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 9.44% క్షీణించి రూ.948 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29,016 కోట్లు కోల్పోయి రూ.3.19 లక్షల కోట్లకు దిగివచ్చింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.

హెల్త్‌కేర్ టెక్ సంస్థ ఇండిజెన్ లిస్టింగ్ సక్సెస్ అయ్యింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.452)తో పోలిస్తే 45% ప్రీమియంతో 660 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో ఆరంభ లాభాలను కోల్పోయి 26% లాభంతో రూ.571 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,614 కోట్లుగా నమోదైంది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

» ఏఐఏపీజీఈటీ 2024 నోటిఫికేషన్ విడుదల
» ఒకే ఎంట్రన్స్‌తో దేశ వ్యాప్తంగా ఆయుష్ పీజీ కోర్సుల్లో ప్రవేశం
» పీజీతో ఆయా రంగాల్లో స్పెషలిస్ట్‌లుగా రాణించే అవకాశం

ఆయుష్ పీజీ.. భవితకు భరోసా

ఆయుర్వేదం, యోగా అండ్ నేచురోపతి, యునానీ, సిద్ధ వైద్య, హోమియోపతి.. ఆయుష్ కోర్సులుగా సుపరిచితం! బ్యాచిలర్ స్థాయిలో వైద్య విద్యకు ప్రత్యామ్నాయాలుగా నిలుస్తున్న బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, బీఎస్‌ఎంఎస్, బీయూఎంఎస్ ఉత్తీర్ణులు పీజీలో చేరేందుకు మార్గం.. ఆల్ ఇండియా ఆయుష్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ (ఏఐఏపీజీఈటీ)! ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా.. దేశ వ్యాప్తంగా ఉన్న ఆయుష్ కళాశాలల్లో ప్రవేశం పొందొచ్చు!! తాజాగా.. 2024కు సంబంధించి ఏఐఏపీజీఈటీ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఏఐఏపీజీఈటీ పరీక్ష విధానం, ఆయుష్ కోర్సులతో కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరాలంటే.. నీట్–పీజీలో ర్యాంకు సాధించాలి. ఇదే మాదిరిగా బ్యాచిలర్ స్థాయి ఆయుష్ కోర్సుల ఉత్తీర్ణులకు పీజీలో ప్రవేశం కల్పించేందుకు నిర్వహించే పరీక్ష.. ఆల్ ఇండియా ఆయుష్ పీజీ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్. ఆయుష్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించాలని నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సీఐఎస్‌ఎం), నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి (ఎన్‌సీహెచ్) నిర్ణయించాయి. దీంతో ఎన్‌సీఐఎస్‌ఎం పరిధిలోని ఆయుర్వేద, సిద్ధ, యునానీ.. అదే విధంగా ఎన్‌సీహెచ్ పరిధిలోని హోమియోపతి పీజీ, ఎండీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు.

ఏఐఏపీజీఈటీ స్కోర్‌తోనే ప్రవేశాలు

ఎన్‌సీఐఎస్‌ఎం, ఎన్‌సీహెచ్‌ల మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం–2019లో తొలిసారిగా ఏఐఏపీజీఈటీని నిర్వహించారు. అప్పటి నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరుగుతోంది. దేశంలో ఆయుష్ కోర్సులను అందిస్తున్న అన్ని యూనివర్సిటీలు, కళాశాలలు ఈ పరీక్ష స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. దీంతో ఆయుష్ విభాగంలో పీజీ/ఎండీ కోర్సులు చదవాలనుకునే వారికి ఏఐఏపీజీఈటీలో ఉత్తీర్ణత తప్పనిసరిగా మారింది.

ఆల్ ఇండియా కోటా

వైద్య విద్యకు సంబంధించి యూజీ, పీజీ ప్రవేశాల్లో ఆల్ ఇండియా కోటా విధానం అమలవుతున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా ఆయుష్ విభాగంలో.. ఆల్ ఇండియా కోటాలో అందుబాటులో ఉండే ఇతర రాష్ట్రాల్లోని 15 శాతం సీట్లను ఏఐఏపీజీఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రాల స్థాయిలో.. వైద్య విశ్వ విద్యాలయాలు ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి ఏఐఏపీజీఈటీ స్కోర్ ఆధారంగా స్థానిక సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుంది.

అర్హతలు

ఏఐఏపీజీఈటీకి దరఖాస్తు చేసుకునేందుకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఏఎంఎస్/బీయూఎంఎస్/ బీఎస్‌ఎంఎస్/బీహెచ్‌ఎంఎస్ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు ఏడాది ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేసుకోవాలి. 2024, జూలై 31లోపు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకోనున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా సీసీఐఎం/సీసీహెచ్/ఎన్‌సీఎస్ఐఎం/ఎన్‌సీహెచ్/రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని బోర్డ్‌ల నుంచి ప్రొవిజనల్ లేదా పర్మనెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగుండాలి.

480 మార్కులకు పరీక్ష

ఏఐఏపీజీఈటీ పరీక్ష మొత్తం 120 ప్రశ్నలు–480 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు. పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ బ్యాచిలర్ డిగ్రీకి సరితూగే సబ్జెక్ట్‌లను దరఖాస్తు సమయంలోనే(ఆయుర్వేద/హోమియోపతి/సిద్ధ/యునానీ) ఎంచుకోవాల్సి ఉంటుంది.

బ్యాచిలర్ డిగ్రీ స్థాయి అంశాలు

ఏఐఏపీజీఈటీలో.. ఆయా విభాగాల్లో అడిగే ప్రశ్నలు సంబంధిత సబ్జెక్ట్‌లో అభ్యర్థులకున్న అవగాహనను పరిశీలించేలా ఉంటాయి. కాబట్టి ఆయా సబ్జెక్ట్‌లు /కోర్సులకు సంబంధించి బేసిక్ ప్రిన్సిపుల్స్, అనాటమీ, ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, మెడిసినల్ బోటనీ, ఫార్మకోగ్నసీ, మోడ్రన్ పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, పిడియాట్రిక్స్, మెడికల్ స్టాటిస్టిక్స్, ప్రివెంటివ్ మెడిసిన్‌లలోని అంశాలపై పట్టు సాధించాలి.

పలు స్పెషలైజేషన్లు

ఆయుష్ పీజీ కోర్సుల్లో పలు స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆయుర్వేదలో.. జనరల్ మెడిసిన్‌కు సరితూగే విధంగా ఉండే కాయ చికిత్స, జనరల్ సర్జరీకి సరితూగే శల్యతంత్ర, ఆయుర్వేద వాచస్పతి, ఆయుర్వేద ధన్వంతరి, పంచకర్మ వంటి స్పెషలైజేషన్లు ప్రవేశం పొందొచ్చు.

- హోమియోపతిలో మెటీరియా మెడికా, హోమియోపతిక్ ఫిలాసఫీ, హోమియోపతిక్ ఫార్మసీ, ప్రాక్టీస్ ఆఫ్ మెడిసిన్, పిడియాట్రిక్స్, సైకియాట్రీ తదితర స్పెషలైజేషన్లు ఉన్నాయి.
- సిద్ధ వైద్యంలో ఎండీ సిద్ధ వైద్య, టాక్సికాలజీకి సరితూగే నంజు మారుతువమ్, గుణపాదం, కుఝాంజదాయ్ మారుతువమ్, నోయి నాడల్, పుర మారుతువమ్, వర్మ మరుతువమ్, సిద్ధార్ యోగ మారుతువమ్ తదితర స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి.
- యునానీకి సంబంధించి యునానీ మెడిసిన్స్, యునానీ ఫార్మసీ, యునానీ ప్రివెంటివ్ మెడిసిన్ అండ్ సోషల్ మెడిసిన్, యునానీ పిడియాట్రిక్స్, యునానీ పాథాలజీ, యునానీ రెజిమెంటల్ థెరపీ, యునానీ ఫిజియాలజీ, యునానీ డెర్మటాలజీ వంటి స్పెషలైజేషన్లల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

భవిష్యత్తు అవకాశాలు

ఆయుష్ కోర్సుల్లో ఎండీ/ఎంఎస్ పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. వీరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆయుష్ విభాగాల పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెడికల్ ఆఫీసర్స్‌గా కొలువులు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా.. టీచింగ్ హాస్పిటల్స్‌లో అధ్యాపక వృత్తిలోకి కూడా అడుగుపెట్టే అవకాశం ఉంది. ఆయుర్వేద, హోమియో కోర్సుల ఉత్తీర్ణులకు సంబంధిత ఫార్మాస్యూటికల్ విభాగాల్లో అవకాశాలు లభిస్తున్నాయి.



స్వీయ ప్రాక్టీస్

ప్రజలు సహజ సిద్ధ వైద్య రీతుల వైపు దృష్టిపెడుతున్నారు. దీంతో ఆయుష్ స్పెషలిస్ట్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఆయుష్ పీజీ చేసిన వారు సొంత హాస్పిటల్స్ నెలకొల్పి స్వయం ఉపాధి పొందొచ్చు. ఆయుష్ విభాగాల్లోనూ కార్పొరేట్ తరహా ఆస్పత్రులు ఏర్పాటవుతుండడం కూడా భవిష్యత్తు అవకాశాలు విస్తృతం చేసేందుకు దోహదం చేస్తోంది. స్వయం ఉపాధి కోరుకునే వారు సొంతంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 15
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2024, మే 17 – మే 19
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2024, జూలై 2 నుంచి
- ఏఐఏపీజీఈటీ తేదీ: 2024, జూలై 6
- వెబ్‌సైట్: www.nta.ac.in/, https://exams.nta.ac.in/AIAPGET

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈసీఐఎల్ సీఎంఎస్‌ఎస్, న్యూఢిల్లీలో 13 పోస్టులు

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్).. సీఎంఎస్‌ఎస్ ప్రధాన కేంద్రం, సీఎంఎస్‌ఎస్ వేర్‌హౌస్‌లలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
- **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్(డీఈఓ):అడ్మినిస్ట్రేషన్–01,ప్రొక్యూర్‌మెంట్–04 ,లాజిస్టిక్స్–సప్లై చైన్–02, క్వాలిటీ అస్యూరెన్స్ –02,ఫైనాన్స్–02, జూనియర్ ఫార్మసిస్ట్–02.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 50 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.30,000.
- **ఎంపిక విధానం:**రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.05.2024.
- **వెబ్‌సైట్:** https://www.becil.com

సిల్వర్ సెట్-2024

కర్నూలులోని సిల్వర్ జూబ్లీ గవర్నమెంట్ కాలేజ్ (కో ఎడ్యుకేషన్, అటానమస్).. 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ డిగ్రీ ఆనర్స్ కోర్సు(ఇంగ్లిష్ మీడియం)ల్లో ప్రవేశాలకు నిర్వహించే సిల్వర్ సెట్–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత బోధన, భోజన, వసతి, శిక్షణ అందుతుంది.

కోర్సుల వివరాలు

- బీకాం–జనరల్–20 సీట్లు; బీకాం–కంప్యూటర్ అప్లికేషన్స్–20 సీట్లు; బీఏ–హిస్టరీ, ఎకనామిక్స్–20 సీట్లు; బీఏ–పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ –20 సీట్లు; బీఎస్సీ–కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్–20 సీట్లు; బీఎస్సీ–కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్–20 సీట్లు; బీఎస్సీ–మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్–25 సీట్లు; బీఎస్సీ–ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్–25 సీట్లు; బీఎస్సీ–బోటనీ, కెమిస్ట్రీ–20 సీట్లు; బీఎస్సీ–జువాలజీ, బయోటెక్నాలజీ–20 సీట్లు; బీఎస్సీ–మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ–20 సీట్లు; బీఎస్సీ–కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ–20 సీట్లు; బీఎస్సీ–ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్–25 సీట్లు.
- **అర్హత:** మార్చి–2024లో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అర్హులు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.06.2024.
- **హాల్‌టికెట్/అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేది:** 10.06.2024.
- **కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష తేది:** 16.06.2024.
- **వెబ్‌సైట్:** www.sjgckurnool.edu.in

టీఎస్ సెట్-2024

ఉస్మానియా యూనివర్శిటీ.. తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీఎస్ సెట్)–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ పోస్టుల నియామకాల అర్హత కోసం టీఎస్ సెట్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.

- **సబ్జెక్టులు:** జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్–అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, జర్నలిజం–మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ (ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్‌ఎల్‌ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్‌ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్–2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 14.05.2024.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 02.07.2024
- **దరఖాస్తులో మార్పులకు చివరితేది:** 28.07.2024, 29.07.2024.
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రారంభం:** 20.08.2024.
- **పరీక్ష తేదీలు:** 28.08.2024, 29.08.2024, 30.08.2024, 31.08.2024.
- **పరీక్ష కేంద్రాలు:** ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్ నగర్, వైజాగ్, నల్గొండ.
- **వెబ్‌సైట్:** http://telanganaset.org

ఎన్ఐఈపీఏ, న్యూఢిల్లీలో పీహెచ్‌డీ ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్(ఎన్ఐఈపీఏ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ(ఫుల్‌టైమ్/పార్ట్‌టైమ్)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024.
» **పరీక్షతేది:** 08.06.2024.
» **ఇంటర్వ్యూ తేది:** 13.06.2024 నుంచి 14.06.2024 వరకు.
» **ఫలితాల వెల్లడి:** 20.06.2024.
» **వెబ్‌సైట్:** https://niepaadm.samarth.edu.in

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.